# రాజకీయ కథలు



ఓల్గా

# రాజకీయ కథలు

ఓల్గా

స్వేచ్ఛ ప్రచురణలు
హైదరాబాద్

**Rajakeeya Kathalu**
(Political Stories)
By Volga

# రాజకీయ కథలు - ఓల్గా

నాల్గవ ముద్రణ : మార్చి, 2007

ముఖచిత్రం : అంజన్‌బాబు

డిజైన్, బుక్ మేకింగ్ : జుగాష్ విలి

డి.టి.పి. : టి.పుష్పరాణి
ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్

ప్రతులకు
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు,
ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు,
నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్,
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్,
తెలుగు బుక్ హౌస్, హైదరాబాద్.

**వెల : 30 రూపాయలు**

**అంకితం**

బీనా

ఆదిలక్ష్మి

శోభలకు

సాహిత్యమే సమస్తంగా

బ్రతికిన ఆ రోజులకు గుర్తుగా -

**కృతజ్ఞతలు**

మానవి వసంతలక్ష్మికీ
స్త్రీశక్తి సత్యవతికీ
ఆంధ్రజ్యోతి, ఉదయం
ఇండియాటుడే, విపుల
ఈనాడు పత్రికలకూ
ముఖచిత్రం వేసిచ్చిన
అంజన్‌బాబుకీ –

# ముందుమాట

రాజకీయ కథలు అని ఈ కథా సంకలనానికి పేరు పెట్టడం చాలా మందికి ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. లోపల కథల పేర్లు చూస్తే సీత జడ, ముక్కుపుడక, కళ్ళు – యిలాంటి పేర్లున్న కథలతో కూడిన కథాసంకలనానికి రాజకీయ కథలు అనే పేరు ఎందుకు పెట్టవలసి వచ్చిందనే ప్రశ్న వచ్చి తీరుతుంది. అందుకే ఆ పేరు గురించీ, ఈ కథలను అర్థం చేసుకోవాల్సిన దృక్కోణం గురించీ కొంత వివరణ యివ్వడం అవసరమనిపించి ఈ ముందు మాట రాస్తున్నాను. ముందుమాట అనే పేరుండటం వల్లా, కథలకు ముందే ఈ వివరణ వుండటం వల్లా, యిది ముందే చదవాలని అనుకోనక్కరలేదు. నిజానికి కథలన్నీ చదివాక ఈ ముందుమాట చదివితే బాగుంటుంది.

ఈ సంకలనంలో మొదటి కథలు స్త్రీల శరీరాల చుట్టూ, స్త్రీలకు తోటి స్త్రీలతో, సమాజంతో, తమ పురుషులతో వుండే సంబంధాల చుట్టూ పురుషాధిపత్య సమాజం ఎన్ని 'మిత్'లను బలంగా అల్లిందో చెప్పటానికి ప్రయత్నించిన కథలు. చివరివి స్త్రీలకు తమ తోటి వారితో, సమాజంతో, కుటుంబంతో సంబంధాలలో వున్న 'మిత్'ల గురించి రాసినవి. స్త్రీల శరీరం ఎప్పటి నుంచో సాహిత్య వస్తువుగా వుంది. పురాణాలలో, ప్రబంధాలలో, కావ్య నాటకాలలో స్త్రీల శరీరాన్ని ఒక్క అంగుళం కూడా విడిచి పెట్టకుండా వర్ణించారు కవులు. ఇక ఆ వర్ణనలలోని అసభ్యత గురించీ, అతిశయోక్తుల గురించీ చెప్పే పనేలేదు. స్త్రీల శరీరం ఎట్లా వుంటే తాము చొంగ కార్చుకుంటూ

నోళ్ళు చప్పరించుకుంటారో అన్నదానికి హద్దూ పద్దూ లేకుండా పోయింది. ఒక్కొక్క అవయవం చుట్టూ రాసిన పద్యాలనూ, వచనాలనూ విడివిడిగా తీసి ప్రత్యేకంగా పెడితే, అవి 'ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా' సైజులో తయారవుతాయని నమ్మకంగా చెప్పవచ్చు. స్త్రీల శరీరాల చుట్టూ కొంత ఆకర్షణనూ కొంత అసహ్యతనూ పోగు చేసి పెట్టడం, ఆ ఆకర్షణ అసహ్యతల రంగుటద్దాల నుండే స్త్రీలను చూడటం ఈ సమాజానికి అవసరం. అందువల్ల ఒక వైపు స్త్రీల శారీరక సౌందర్యం గురించి యింత రాసిన కవులు, వ్యక్తిగా స్త్రీకి ఏ విలువా లేకుండా చేసే ప్రయత్నం చేశారు. కొంత వ్యక్తిత్వం గల స్త్రీ పాత్రలున్న భారతం వంటి పురాణాలలో కూడా వందల కొద్దీ పద్యాలలో స్త్రీల హీనత్వం గురించీ, చపలత్వం గురించీ, స్త్రీల వల్ల జరిగే అనర్థాల గురించీ వర్ణించారు. ప్రబంధాలలో స్త్రీని ఒక భోగవస్తువుగా మాత్రమే చూశారు. భావ కవులు స్త్రీల శరీరంతోపాటు మనసునీ ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఆమె కన్నులలోని అనంతాంబరపు నీలి నీడలను కూడా తమ స్వంతం చేసుకోవాలని ఆశపడ్డారు. సమాజంపై తమకు కలిగిన కసినీ, సమాజంలో తాము చూస్తున్న కుళ్ళునీ శక్తివంతంగా చెప్పటానికి దిగంబర కవులకు స్త్రీల శరీరాలూ, వాటి చుట్టూ అల్లబడిన భావజాలాలే కనిపించాయి. వారికవే కనిపించటం యాదృచ్ఛికం కాదు. అప్పటికే స్త్రీల శరీరాల చుట్టూ ఆ అసహ్యత చాలా బలంగా అల్లబడివుంది. ఆ అసహ్యతను దిగంబర కవులు చాలా సులభంగా, తమకు ఈ సమాజం మీద కలుగుతున్న అసహ్యానికి ప్రతీకలుగా వాడుకున్నారు. దిగంబర కవులే కాదు ఆ కాలంలో వచ్చిన కవితా సంకలనాలను పరిశీలిస్తే ఎన్నో కవితలలో స్త్రీనీ, స్త్రీ శరీరాన్ని హీనపరచటం కనిపిస్తుంది.

అప్పటికి ఎన్ని అభ్యుదయ భావాలూ, విప్లవ భావాలూ ప్రచారంలో వున్నా స్త్రీల విషయంలో మాత్రం ఈ పితృస్వామ్య సమాజం అల్లిన భావజాలానికి చిన్న తూటు కూడా పడలేదు. విప్లవోద్యమాలలో స్త్రీల పాత్ర పెరిగినపుడూ, స్త్రీలు ఆ ఉద్యమాలలోని పురుషాధిపత్య ధోరణులను ప్రశ్నించినపుడే స్త్రీల సమస్యల విషయంలో క్రమంగా చైతన్యం మొదలయింది.

ఆ తరువాత నెమ్మదిగా స్త్రీవాదం సాహిత్యంలో ప్రవేశించింది. క్రమంగా అదొక బలమైన శక్తిగా రూపొందింది. ఈ స్త్రీవాద భావాల నేపథ్యంలో మొదటిసారిగా స్త్రీలు తమను తాము అర్థం చేసుకోటానికి ప్రయత్నించారు. తమ శరీరాలనూ శరీర ధర్మాలనూ ఎవరో చెప్పి వుంచిన భావజాలం ప్రకారం కాకుండా, తమ అనుభవాల ఆధారంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పని సులభమైంది కాదు.

శతాబ్దాలుగా అణచివేతకు గురైన స్త్రీ శరీరం తమ శక్తులను కోల్పోయి, కుంచించుకు పోయి, తనకు తానే పరాయిదైపోయి, తనను తానే తక్కువ చేసుకుని నిందించుకునే

స్థితికి చేరుకునే క్రమం గురించి ఆలోచించటం మొదలుపెడితే మన గుండె నీరవుతుంది. మన అనుభవాలూ, మన తోటి స్త్రీల అనుభవాలూ గుర్తు చేసుకుని వాటిని స్త్రీవాద దృక్పథం నుండి విశ్లేషించుకోవటం మొదలుపెడితేనే, స్త్రీల శరీరాలు సాంఘికంగా ఎలా మలచబడ్డాయో మనకు అర్థమవుతుంది. స్త్రీలను స్త్రీలుగా తయారు చెయ్యటానికి ఎంత పకడ్బందిగా జండర్ విధానం సమాజంలో తయారయివుందో మనం తెలుసుకో గలుగుతాం. అది తెలుసుకునే ప్రయత్నం యిటీవలి కాలంలో స్త్రీలు చేస్తున్నారు. తమ అనుభవాలను కథలుగా, కవితలుగా రాస్తున్నారు. సమాజంలో సగమైన స్త్రీల విషయాలను శాస్త్రీయంగా అర్థం చేసుకునే మార్గం ఒకటి వుందని తెలిశాక, స్త్రీవాదం చుట్టూ యింతకు ముందు పోగు పడ్డ భ్రమలన్నీ (పాశ్చాత్యుల నుంచి వచ్చింది, ఫెమినిస్టులంటే సిగరెట్లు తాగేవాళ్ళు, జుట్టు కత్తిరించుకునే ఆడవాళ్ళు మొదలైనవి) పోతున్న సమయంలో చాలా మంది ఈ సాహిత్యాన్ని గురించి సీరియస్‌గా చర్చించారు, ఆలోచించారు, ఈ సాహిత్యాన్ని ఆహ్వానించారు. ఐతే అదే సమయంలో కొత్తదృష్టి నుంచి చూడటానికి విముఖులైన కొందరు సంప్రదాయవాదులు ఈ రచనలలో సామాజిక స్పృహకంటే శరీర స్పృహ ఎక్కువగా వున్నదనీ, యివన్నీ వ్యక్తిగత విషయాలే గానీ సమాజంతో సంబంధం వున్న విషయాలు కాదనీ, యింకా చెప్పాలంటే నీలి కవితలనీ అంటున్నారు. వాళ్ళు అంటున్నారనే కాకపోయినా, స్త్రీల శరీరాలు గురించీ యివాళ వస్తున్న రచనలు సామాజిక స్పృహతో వస్తున్నవేననీ, యివాళ వున్న ఈ అణచివేత, దోపిడీలతో నిండిన సమాజం ప్రధానంగా ఆధారపడిన విషయాలలో స్త్రీని శారీరకంగా అణచివేయటమనేది అతి ముఖ్యమైనదనీ చెప్పాల్సిన బాధ్యత మనపై వుంది. తమాషా ఏమిటంటే మనం సీరియస్‌గా సిద్ధాంత చర్చ చేయాలనుకుంటే సమాధానం చెప్పేవాళ్ళూ, చర్చ చేసేవాళ్ళూ ఒకళ్ళూ ఉండరు. ఎలాగోలా మన వ్యక్తిగత జీవితాలను చర్చలోకి లాగి అందరి దృష్టీ అటువైపు మళ్ళించి, స్త్రీవాదం అంటే ఏమిటనే గందరగోళం సృష్టిస్తారు. దానిని మనం అసలు పట్టించుకోకుండా మనం చెప్పదల్చుకున్న విషయాలు చెప్పటం తప్ప మార్గంలేదు. ఐతే ఈ రచనలు శరీరస్పృహతో వున్నాయనే వాదాన్ని అమాయక పాఠకులు కొందరు నమ్మవచ్చు. మనకు మంచి సాహిత్య విమర్శ కరువైన ఈదశలో స్త్రీవాద దృక్పథం నుంచి ఈరచనలన్నీ విశ్లేషించే వారు అసలే కనిపించటం లేదు. ఆ దృష్ట్యా స్త్రీల శరీరాల చుట్టూ వున్న భావజాలంలో వున్న రాజకీయాలను గురించి ఈ కథా సంకలనం ప్రచురణ సందర్భంగానైనా కొంత మాట్లాడటం అవసరం అనిపించింది. ఈ కథలు సీరియస్ రాజకీయ కథలు సుమా అని నొక్కి చెప్పాలనిపించింది. సరైన విమర్శకులుంటే ఈ అవసరం ఉండేది కాదు. ఒక ఉద్యమాన్నో ప్రజలలో తిరుగుబాటునో వస్తువుగా తీసుకున్నా, చివరలో విప్లవం వర్థిల్లాలనే ముక్తాయింపు లేనిదే ఆ రచనను సామాజిక విప్లవంతో సంబంధం లేనిదిగా తీసిపారేసే రోజుల్లో 'సీత జడ' కథ గురించి చెప్పేపనే ముంది?

స్త్రీల సమస్యలు అవి ఏవయినా గానీ – వాటిని మనం యింతవరకూ ఎట్లా అర్థం చేసుకుంటున్నాం? వాటిని నిజంగా ఎట్లా అర్థం చేసుకోవాలి? ఆధునిక యుగం నుంచీ తీసుకుందాం–స్త్రీల సమస్యలుగా ఈ యుగంలో ఎన్నో విషయాలు ముందుకువచ్చాయి. వితంతు వివాహాలు, కన్యాశుల్కం, స్త్రీవిద్య, వరకట్నం, స్త్రీలపై లైంగికవేధింపు – అత్యాచారాలు, కుటుంబంలో హింస, భర్త పెట్టే బాధలు, ఆర్థిక అస్వతంత్రత – ఇలా ఎన్నో విషయాలు వున్నాయి. మనం చాలా రోజులుగా వీటిని సాంఘిక దురాచారాలుగా అర్థం చేసుకున్నాం. సంస్కారం, జ్ఞానం, ఆధునిక దృక్పథం యివేవీలేని సమాజం, అందులోని పురుషులూ, స్త్రీలకు సంబంధించి కొన్ని ఆచారాలు కల్పించారు. మనకు సంస్కారం, చదువు, ఆధునికత, విజ్ఞానం అన్నీ రాగానే ఆ ఆచారాలను దురాచారాలుగా గుర్తించి వాటిని తొలగించుకుంటాం. ఒకరిద్దరు సంస్కర్తలు దానికోసం కృషి చేస్తే చాలు. అవసరమైతే ఆమేరకు కొన్ని చట్టాలు కూడా చేసుకుంటాం. దాంతో క్రమంగా ఆ దురాచారాలు పోయి, స్త్రీలకు కూడా హక్కులు వచ్చి సమాజంలో సమాన గౌరవాన్నీ, స్థాయినీ పొందగలుగుతారు అని మనం చాలా రోజులుగా అనుకున్నాం. కానీ ఈ చట్టాల వల్లా సంస్కరణల వల్లా స్త్రీల సమస్యలేమీ తీరలేదు. బాల్య వివాహాలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. కన్యాశుల్కం కంటే భయంకరమైన రూపంలో వరకట్నం ఉంది. చదువు కోసం, పని కోసం బైటికి వచ్చిన స్త్రీలపై లైంగికహింస రోజురోజుకీ ఎలా పెరుగుతోందో మనకు కనబడుతూనే వుంది. ఉద్యోగం చేస్తున్న స్త్రీలు కూడా పరాధీనులు గానే బ్రతుకుతున్నారనీ, వారి స్వేచ్ఛ అంతా తండ్రులూ, భర్తలూ అనుమతించిన వరకేననీ అర్థమవుతూనేఉంది. స్త్రీపురుష సంబంధాలలో వైరుధ్యాలూ, వైషమ్యాలూ రోజురోజుకీ పెరగటం కూడా మనం చూస్తున్నాం.

ఇదంతా ఎందుకిలా జరుగుతోంది అని ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది. ఇప్పుడైనా స్త్రీల విషయాలు సాంఘిక దురాచారాలుగా మాత్రమే గుర్తించాల్సినంత చిన్న విషయాలు కావనీ, ఈ దోపిడీ సమాజపు మూలాలు స్త్రీల అణచివేతలో పాతుకుని వున్నాయని గ్రహించకపోతే ఈ విషయంలో మనం ఒక్కడుగు కూడా ముందుకు వేయలేం. మొత్తం సామాజిక పునాదిలోనే స్త్రీల అణచివేత అంతర్భాగమయిందని, స్త్రీలను స్త్రీలుగా తయారుచేసి కంట్రోలు చేసి అణచిపెట్టటం వల్లనే ఈ దోపిడీ సమాజం మనగలుగుతోందని మనం గ్రహించాలి. సమాజాన్ని ఉత్పత్తి విధానం ద్వారా మాత్రమే కాకుండా పునరుత్పత్తి విధానం ద్వారా కూడా అర్థం చేసుకోవాలి. అలా అర్థం చేసుకున్నపుడు ఈ సమస్యలన్నీ స్త్రీల లైంగికత్వం మీదా సంతానోత్పత్తి శక్తి మీదా సమాజం విధించిన కంట్రోళ్ళుగా అర్థమవుతాయి. ఆ కంట్రోలు రాజ్యానికి ఎంత కీలకమైన విషయమో అర్థమయిన కొద్దీ మనం చేసే ఉద్యమాలూ, పోరాటాలూ ఆ

దిశగా సాగుతాయి. సమస్య ఎక్కడవుందో మనకు తెలిస్తే మనం ఆయుధాలను అవైపు ఎక్కు పెడతాం. రాజకీయ పరిష్కారాల కోసమే ఆలోచిస్తాం. ఇంతవరకూ మనం కుటుంబానికి మాత్రమే పరిమితమైనవి అనుకుంటున్న విషయాలన్నీ రాజ్యం మనమీద చాలా పకడ్బందీగా, కనపడకుండా విధించిన ఆంక్షలని మనకు అర్థమయ్యాక మన జీవితాలలో ప్రతి చిన్న విషయమూ రాజకీయమేనని తెలుస్తుంది.

ఇదంతా చాలా తేలికగా జరిగేపనికాదు. అనేక వేల సంవత్సరాలుగా మనలో పాతుకుపోయి వున్న నమ్మకాలనూ అభిప్రాయాలనూ ప్రశ్నిస్తున్నపుడు ఒకోసారి మన పునాదులే కదిలిపోతున్నాయనిపిస్తుంది. శరీరం గురించిన మన ఆలోచనలు ఎంత ముఖ్యమైనవో గుర్తించటానికి ఎంత యుద్ధం చేయాలో, తర్వాత ఆలోచించదానికి, స్వేచ్ఛగా మన మనసు నుపయోగించి అనుభూతి చెందటానికి అంత యుద్ధం చేయాలి. స్త్రీలకు తమ శరీరాలతో వున్న సంబంధాలను బట్టే ప్రపంచం గురించిన దృక్పథం, అభిప్రాయాలూ, విలువలూ ఏర్పడతాయి. వ్యక్తిత్వం రూపుదిద్దుకునే క్రమంలో శరీర ప్రాధాన్యత పెరుగుతుంది. ఆడపిల్లకు ఊహవస్తున్న కొద్దీ అణచివేత కంట్రోళ్ళు ఎక్కువవుతాయి. ఆమెనొక బానిసగా తయారుచేయటానికి అన్నివైపుల నుండీ ప్రయత్నాలు ప్రారంభమవుతాయి. శరీరాన్ని అణచటం ద్వారా మనసుని అణిచి వ్యక్తిత్వాన్ని హరించటం, మనసుని అణచి వ్యక్తిత్వాన్ని పెరగనీయకుండా అణచటం ద్వారా శరీరాన్ని కుంచింపజేయటం ఈ రెండూ ఒకదాని నుండి ఒకటి విడదీసి చూడలేనంతగా కలిసిపోయి ఉంటాయి. కానీ మనసు, శరీరం వేరు వేరన్నట్లు సమాజం ప్రచారం చేస్తుంది. సందర్భాన్ని బట్టి ఒక్కోసారి ఒక్కోదాన్ని గొప్పచేసి విలువకడుతుంటుంది. శ్రమ విభజనలో మెదడుకీ చేతికీ వున్న ద్వంద్వంలాంటిదే శరీరానికీ మనసుకీ మధ్యవున్న ద్వంద్వమని గ్రహించి చర్చించటం యివాళ చాలా అవసరం. మనం మన శరీరాల నుండి వేరుకాదని బలంగా చెప్పటం అవసరం. స్త్రీలు తమకోసం చేసుకునే పనులలోనే యితరుల కోసం చెయ్యటమనేది యిమిడివుంది. అందువల్ల స్త్రీలు తమకు తమ గురించి గానీ, సమాజం పట్ల గానీ బాధ్యత వుందని అనుకోరు. కేవలం కుటుంబం కోసం, భర్త కోసం, పిల్లల కోసమే తాము ఉన్నామనీ, వారిపట్లే తమ బాధ్యత అనీ అనుకుంటారు. తల దువ్వుకుని జడవేసుకుని పువ్వులు పెట్టుకోవటం స్త్రీలకు సుఖంగా, ఆనందంగా వుంటుందనుకుంటే (ఇది కూడా సమాజం కల్పించిన భావజాలమే – ఉదాహరణకు మాత్రమే తీసుకుంటు న్నాను) అది తమకోసం తాము చేసుకునే పనే కానీ దాని చుట్టూ ఎంతో బలమైన భావజాలం అల్లుకుని ఉంటుంది. అది భర్త కోసం ఔతుంది. భర్త లేకపోతే యిక ఆ పని చేయకూడనిదవుతుంది. స్త్రీలు వంట చేస్తారు. తింటారు. కానీ ఇంట్లో ఎవరూ లేకపోతే తమ కోసం తాము ప్రత్యేకంగా చేసుకుని తినరు. ఇంట్లో ఎవరూ లేరుగా అవన్నీ వండటం ఎందుకని

ఏదో పచ్చడి వేసుకుని తినేస్తారు. తను తినటం, ఆరోగ్యంగా వుండటం తన కోసం, సమాజం కోసం అనుకోకుండా భర్తా పిల్లల ఆనందం కోసం, ఆరోగ్యం కోసం అనుకుంటారు. ఇవి చాలా స్పష్టంగా అందరికీ అర్థమయ్యే ఉదాహరణలు. చాలా సంక్లిష్టమై, అర్థం చేసుకోవటానికి వీలులేనంత అందమైన, బిగువైన అల్లికతో బిగించబడినవి ఎన్నో వుంటాయి. అవన్నీ సహజమైనట్లు, వాటికి విరుద్ధంగా ఆలోచించటమంటే, ప్రవర్తించటమంటే ఎంతో తప్పు చేసినట్లు, మనలోనే ఆ తప్పు వున్నట్లు అనుకుంటాం. సమాజమైతే మనల్ని నిర్ద్వంద్వంగా, దోషిగా ప్రకటిస్తుంది.

కొంచెం తృప్తిగా తినాలనుకునే ఆడవాళ్ళను మొగుడూ పిల్లల గురించి పట్టించు కోనిదిగా ముద్రవేస్తుంది. "ముందుగా తిన్నమ్మ మొగుడాకలి ఎరగదు, కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం" ఇట్లాంటి సామెతలెన్నో వున్నాయి. భర్తలేనపుడు బాగా ముస్తాబైన స్త్రీ గురించి ఎన్ని నిందలైనా వస్తాయి.

ఇట్లాంటి 'చిన్న' 'చిన్న' విషయాలను గురించి మనం ఆలోచించకుండా మన చిన్నతనంలోనే మనల్ని తయారు చేస్తారు. శరీరం ఇలా వుండాలి, అలా వుండకూడదు – ఈ శరీరంతో ఈ పనులు చెయ్యాలి, ఆ పనులు చెయ్యకూడదు అనే విధినిషేధాలు పుట్టుకతోనే మనకు అలవాటైపోతాయి. మన శరీర ధర్మాలను మనం అసహ్యించు కోవటం నేర్చుకుంటాం. వాటినుంచి ఎట్లా విముక్తి చెందగలమా అని మధనపడతాం – మన స్త్రీలు పాపులు గాబట్టే యిలాంటి శరీర ధర్మాలు వచ్చాయని మనల్ని మనం నిందించు కుంటాం. మన శరీరాల మీద జరిగే దౌర్జన్యాన్ని సహించటం, అది మన తప్పేనన్నట్లు చూడటం మనకు అలవాటువుతుంది. ఇప్పటికీ స్త్రీలపై జరిగే లైంగిక వేధింపుల గురించి మాట్లాడినపుడు వాళ్ళు సరిగా బట్టలు వేసుకుంటే, రెచ్చగొట్టేలా లేకపోతే, తలవంచుకు నడిస్తే, నవ్వకుండా అరవకుండా నెమ్మదిగా వుంటే మగవాళ్ళు వేధించరనే వాదన ఎంతో చదువుకున్న వాళ్ళూ, మేధావులూ కూడా చేస్తుంటారు. వీటన్నిటి గురించీ మనం చైతన్యం తెచ్చుకోవటమంటే, మన శరీరాలను మనం గౌరవంగా బాధ్యతతో చూడట మంటే సమాజంలో మౌలికమార్పు కోసం ప్రయత్నించటమే. మానవ సంబంధాల గురించీ, వర్గ, జాతి, లైంగిక ఆధిపత్య సంబంధాలతో నిండిపోయిన ప్రపంచం గురించీ ఆలోచించినపుడు కొత్తరకమైన సంబంధాల గురించి ఆలోచించాల్సినపుడు సాంఘిక భావజాలంతో నిర్మించబడ్డ స్త్రీల శరీరాలను అర్థం చేసుకుని అక్కడి నుండి కూడా యుద్ధం మొదలు పెట్టటం అవసరమే-

శరీరానికి సంబంధించిన మనం ఎలా బతుకుతున్నాం? మన శరీరాలతో ఎలా బతుకుతున్నాం? అలా బతుకుతూ మనం మన తోటి వాళ్ళతో, ప్రపంచంతో ఎలాంటి సంబంధంలో వున్నామని నిర్వచించుకోవాలి. ఆ ప్రయత్నంలోనే ఈ కథలు రాశాను.

ఇలాంటి కథలు కొన్ని వేలు రావాల్సిన అవసరముంది. సాంఘికమైన అర్థంలో మనం స్త్రీలం ఎలా అయ్యామని ఆలోచించి, స్త్రీ శరీరాన్ని సాంఘికజీవిగా (Socio Biological Unit) ఎలా తయారు చేస్తున్నారో గ్రహించటానికి ఇవాళ జరుగుతున్న కృషిలో ఈ కథలు ఉపయోగపడతాయని ఆశపడుతున్నాను.

ఈ కథలు 1985 నుంచి 94 వరకు అంటే దాదాపు ఎనిమిది సంవత్సరాల కాలంలో రాసినవి. రాసిన ప్రతి కథా ఆరు నెలల తర్వాతగాని ప్రచురణ కాలేదు. ఒకటి రెండు కథలు సంవత్సరాల తరబడి ప్రచురణ కాకుండా వుండిపోయాయి. ఈ కథలు రాయటం నాకొక అనుభవం. సరికొత్త ప్రదేశంలో ప్రవేశించటం. మన అనుభవాలనో, మనకు తెలిసిన అనుభవాలనో చాలా సీరియస్‌గా తీసుకుని వాటిలోని రాజకీయాలను గుర్తించే స్థితికి తీసుకురావటం చాలా కష్టమైన పనని నాకు ఈ కథలు రాసేటప్పుడు అర్థమయింది. ఏ మాత్రం ఆలోచించకుండా మనం చేసే పనులగురించీ మనం ఎప్పుడో విన్న మాటల గురించీ గుర్తు చేసుకుని అవి మనలో కలిగించిన తిరుగుబాటు భావాలనూ, కసినీ, ఆర్తినీ, దుఃఖాన్నీ, నవ్వునూ మళ్ళీ ఇంకోసారి గుర్తు తెచ్చుకుని ఆ జయాపజయాలను రికార్డు చేయటం చాలా పెద్దపని.

'ఆర్తి'లో కథానాయిక రజస్వల అయ్యాక 'ఎర్రగా వెచ్చగా స్రవిస్తున్న రక్తం మరోసారి నేను స్త్రీనని గర్వపడేలా చేసింద'ని అనుకుంటుంది. అలా అనుకోవటానికి ఒకమ్మాయి ఎలాంటి తిరుగుబాటు యుద్ధం చేయాలో ఆ వాక్యం రాయటానికి నేను అప్పుడంత యుద్ధం చేయాల్సివచ్చింది.

ఈ రచనలు చెయ్యటం ద్వారా ఈ సంస్కృతిపై తిరుగుబాటు చేస్తున్నాను అని నమ్మి నేనీ కథలు రాశాను. ఈ సంస్కృతి మన అధికారాన్ని మన చేతుల్లో నుంచి లాక్కుంది. మన జీవితాలకి ఏవో అర్థాలను సృష్టించింది. ఆధిపత్యం చేసే వారి సంస్కృతి యిది - దానిని తిరస్కరిస్తూ చేసిన రచనలన్నీ ఆ సంస్కృతిపై యుద్ధ ప్రకటనలే.

ఆడవాళ్ళ భాష, ఆలోచనలు, అనుభూతులు అన్నీ అణచివేతకు గురైనవే. ఈ రోజు స్త్రీలుగా రాయటమంటే వీటన్నిటిమీదా తిరుగుబాటు చేయటమే. ఒకోసారి రాయటం అసాధ్యమైపోతుంది. రాయటానికి ఏమీ లేదా అనిపిస్తుంది. మన అనుభవాలకు ఏమీ విలువ ఉండదు, ఎవరికీ ఆసక్తి ఉండదు, ఎందుకు రాయటం అనిపిస్తుంది. స్త్రీలు సాహిత్యంలో వస్తువులుగా వుండటానికి ఇప్పుడు కూడా రెండు అర్హతలుండాలి. విప్లవ కారిణిగానన్నా కథలోకి రావాలి, లేకపోతే భయంకరమైన విషాదకరమైన దోపిడీకైనా గురవ్వాలి. ఈ రెండూ లేకపోతే మామూలు స్త్రీ జీవితం గురించి రాయటం

ఎందుకు అనే ఆలోచన కొడవటిగంటి కుటుంబరావు కథలు రాసిన తర్వాత కూడా సాహిత్య రంగంలో వుంది. కొన్ని జాడ్యాలు ఏ మందులకూ లొంగవు.

మనమీద మనం విధించుకునే సెన్సార్‌షిప్ ఎంత బలమైందో ఈ కథలు రాస్తున్నప్పుడు నాకు అర్థమైంది. రాసేటప్పుడు వచ్చే ప్రధాన ఆటంకం ప్రతిదాన్నీ అది సరైందా, కాదా అనే తీర్పు ఇచ్చే పద్ధతిలో ఆలోచించటం. ప్రతి భావాన్నీ Value Judgement దృష్టితో ఆలోచించటం. నైతిక దృష్టికి ఇదెలా వుంటుందోనన్న ఆలోచన ఎంతవద్దనుకున్నా రావటం. ఈ తీర్పు యిచ్చే తత్వం మనలోకి రాకూడదని నన్ను నేను పరీక్ష చేసుకోవటం – నిజంగా ఈ కథలు రాయటం వలన నేను చాలా నేర్చుకున్నాను.

ఒకోసారి రాస్తున్నవన్నీ తెలిసినవే కదా – చెప్పటానికేముందనిపించేది.

కానీ వాటినే కొత్త వెలుగులో చూసి జ్ఞానం సంపాదించుకోవాలని తపనపడేదాన్ని.

మిగిలిన రచనలు చేయటానికి పడ్డంత ఎక్కువ కష్టం ఈ పది కథలు రాయటంలో పడ్డాను.

మనల్ని గురించి మనం తెలుసుకోటానికి ఒక పద్ధతిని ఈ కథల ద్వారా యివ్వ గలిగానని ఇప్పుడు తృప్తి పడుతున్నాను.

– ఓల్గా

8 మార్చి, 1993

## కథా క్రమం


- సీత జడ 17
- కళ్ళు 24
- ముక్కుపుడక 27
- నోర్మూయ్ 32
- వెన్నెముక 37
- రాతిగుండెలు 47
- అయోని 58
- ఒక రాజకీయ కథ 65
- కేసు 76
- ఆర్తి 91

# 1

# సీత జడ

కుచ్చులు కుచ్చులుగా రాలిపోతున్న జుట్టునంతా పోగు చేసి కాలికింద కదలకుండా పెట్టుకుంది సీత. దువ్వెనతో దువ్వుతున్నప్పుడల్లా ఇంత జుట్టు రాలిపోతోంది. తలమీద వున్న పిడికెడు వెంట్రుకలూ ఎంత ప్రియంగా ఉన్నాయో కాలి కింద నలుగుతున్న వెంట్రుకలు అంత అప్రియంగా వున్నాయి. అరవయ్యేళ్ళ సీతకు నెల రోజుల క్రితం పెద్ద జబ్బు చేసింది. క్రమంగా ఒంట్లో కాస్త బలం చిక్కుతోందిగానీ జుట్టు మాత్రం మిగలకుండా రాలిపోతోంది. పాయలుపాయలుగా వూడి నల్లని దువ్వెనలో వెండి తీగల్లా మెరుస్తున్న ఆ జుట్టును చూస్తుంటే సీత మనసులో ఆరాటం పుట్టుకొచ్చింది. ఆ జుట్టు తన ప్రాణమైనట్లూ, ఆ ప్రాణం పోతుంటే తను చూస్తూ ఉండాల్సి వచ్చినట్లూ, నిస్సహాయంగా కళ్ళనీళ్ళతో కూచుండిపోయింది. ఆ జుట్టుని గురించిన జ్ఞాపకాలు, ఆ జుట్టు చుట్టూ పెరిగిన భ్రమలు, భ్రమతలు సీత మనసులో కల్లోలం రేపుతున్నాయి.

ఊహ తెలిసేసరికే తన జుట్టు చాలా ముఖ్యమైనదని సీతకు అర్థమైపోయింది. అసలు సీతకు తను ఆడపిల్లననే స్పృహ మొదటిసారిగా జుట్టువల్లే కలిగింది. నల్లగా పట్టుకుచ్చులా రోజురోజుకీ పెరుగుతున్న ఆ జుట్టును అతి శ్రద్ధగా పోషణ చేసేది సీత తల్లి. రకరకాల ఆకులూ, పువ్వులూ ఎండబెట్టేది. వాటిని కొబ్బరి నూనెలో వేసి కాచేది. దానిని రోజూ సీత వెంట్రుకలకు కుదుళ్ళకంటా పట్టించేది సీత తల్లి. తలంటే రోజు

ఆమె హడావుడి చెప్పనలవికాదు. వంటాముదం తలకు అంటి గంటసేపున్న తర్వాత కుంకుడు పులుసుతో రుద్దేది. ఆ తర్వాత సాంబ్రాణి పొగవేసి ఆరబెట్టి నెమ్మదిగా చిక్కుతీసేది. ఆ రోజు మల్లెపూలో జాజిపూలో తలలో పెట్టకుండా వుండేది కాదు. జడలో పువ్వులు పెట్టి 'ఆడదానికి తలకట్టే సింగారం' అని నడినెత్తిన ముద్దు పెట్టుకునేది. తల్లి ఆర్భాటంవల్లా చుట్టుపక్కల వారు తన జుట్టుకు ఇచ్చే గుర్తింపు వల్లా సీతకు తనంటే తన జుట్టే అనిపించేది.

అయితే ఒక్కోసారి సీతకు జుట్టంటే చాలా చిరాకేసేది. ప్రతిపనికీ అడ్డంపడే జుట్టును కత్తిరించి పారెయ్యాలనిపించేది. వేసవి కాలంలో బోడిగుళ్ళతో తిరుగుతున్న అన్నయ్యలను చూస్తే సీతకు తను కూడా నున్నగా గుండు చేయించుకుని తిరగాలనిపించేది. గుండు చేయించుకుంటే రోజూ పొద్దునా సాయంత్రం అమ్మ చేతిలో తన తల పెట్టనవసరం లేదు. ఆ నొప్పి, బాధా తప్పుతుంది. ఆటలకు పిలవగానే పరిగెత్తిపోవచ్చు. అమ్మ నున్నగా తలదువ్వి జడవేసే దాకా ఆగనవసరం లేదు. "చింపిరి జుట్టేసుకుని వీధులెంట బయల్దేరావా"అని అప్పుడెవరూ తిట్టరు. ఆదివారం ఆదివారం పేలు దువ్వించుకోవడానికి ప్రాణం పణంగా పెట్టాల్సిన అవసరం వుండదు. ఈర్పెన తీసుకుని అమ్మ తన వెనకాల కూర్చుంటే సాక్షాత్తూ యముడే అమ్మ రూపంలో వచ్చాడనిపించేది. తన ఖర్మకాలి తల్లో ఈపు ఆపాటికే చచ్చి ఉంటే ఇక ఆ బాధ పగవాడికి కూడా వద్దనిపించేది.

ఇన్ని రకాల ఊహలతో ఓనాడు సీత తన కోరిక తల్లిముందు బయటపెట్టింది. తల్లి 'ఇవ్వేం పిదదకాలం బుద్దులే, ఆడపిల్లవి ముచ్చటగా జడవేసుకుని పువ్వులు పెట్టుకోక మగరాయుడల్లే గుండు చేయించుకుంటావా' అని చివాట్లేసింది. మగరాయుడు గొప్పవాడూ అతని గుండు గొప్పదైతే, ఆ గొప్పగుండు తనెందుకు చేయించుకోకూడదో మగరాయుడిగా ఎందుకుండకూడదో సీతకు అర్థం కాలేదు.

పదేళ్ళన్నా రాని సీత భయం గొలిపే దృశ్యం చూసిందోనాడు. పక్కింటి డాక్టరు గారింట్లో పని మనిషి దొంగతనం చేసిందట, ఆ పదహారేళ్ళ పిల్ల తలనున్నగా గీసి సున్నపుబొట్లు పెట్టి పంపించారు. కొట్టలేదు. పోలీసులకు పట్టివ్వలేదు. ఆ అమ్మాయి గుండెలవిసేలా ఏడుస్తూ వాళ్ళింటికి వెళ్ళిపోయింది. సున్నపుబొట్లతో వెక్కిరిస్తున్నట్లున్న గుండు మీద రెండు చేతులూ పెట్టుకుని ఏడుస్తూ బజారంట నడుస్తున్న ఆమెను చూస్తే సీతకు కూడా ఏడుపొచ్చింది. దొంగతనం చేస్తే తిట్టరాదా, కొట్టరాదా, జైల్లో వేయించ రాదా గుండు చేయించటమెందుకు అని సీత కోపంగా పక్కింటి వాళ్ళను తిట్టుకుంది. ఆ రాత్రి పడుకునే ముందు నలిగిపోతాయని జడలో మల్లెపూలు తీసి కండువాలో చుడుతుంటే ఆ పనమ్మాయే గుర్తొచ్చింది. ఎవరూ చూడకుండా దుప్పటి నిండా కప్పుకుని చాలాసేపు ఆ అమ్మాయి జుట్టుకోసం ఏడ్చింది సీత.

సీత ఎనిమిదో క్లాసునుంచి మిషనరీ స్కూల్లో చదివింది.

స్కూల్లోకి రాగానే ఎదురైన నన్‌లను చూసి విస్తుపోయింది. జాలిపడింది. వాళ్ళ మావయ్య చచ్చిపోతే అత్తయ్య జుట్టు తీయించుకున్న విషయం సీతకు గుర్తే కాని మొగుడు చస్తేనే జుట్టు తీస్తారనుకుంది. మరి వీళ్ళకు పెళ్ళే కాలేదుగా ఎందుకు గుండు చేసుకున్నారో సీతకు అర్థం కాలేదు. తోటి అమ్మాయిలంతా ఆ విషయం గురించి మాట్లాడుకునేవారు.

'వీళ్ళు జుట్టు తీయించుకుంటారెందుకు?'

'పెళ్ళి చేసుకోరుగా అందుకు'

'పెళ్ళి చేసుకోకపోతే జుట్టు తీయించుకోవటం ఎందుకు?'

'పెళ్ళికీ జుట్టుకీ సంబంధం ఏమిటి?'

'జుట్టు లేకపోతే కోరికలు రావట'

'కోరికలేమిటి – ఏం కోరికలు'

'పూలు పెట్టుకోవాలనీ, పెళ్ళి చేసుకోవాలనీ, పిల్లల్ని కనాలనీ కోరికలు రావటం'

'పెళ్ళిరోజు పూలజడ వేసుకోవటం కుదరదుగా అందుకని ఇక పెళ్ళేలా చేసుకుంటారు'

సీతకు తన జుట్టుమీద భక్తి శ్రద్ధలు పెరిగాయి –

తన జుట్టును ప్రేమగా నిమురుకుని

'ఈ జుట్టు వుంటే కోరికలుంటాయి. లేకపోతే వుండవు. అమ్మో' అనుకుంది.

'అది కాదు లేవోయ్ – జుట్టువుంటే అందంగా కనపడతారట, అందంగా కనపడ కూడదట వాళ్ళు'

'ఎందుకని'

'ఏమో–'

'జుట్టు లేకపోయినా మన ఇగ్నేషియస్ అమ్మగారు ఎంత బాగుంటారు? జుట్టున్న వాళ్ళ కన్నా బాగుంటారు. "ఔను ఔన"ని అందరూ ఆ మాటని ఏకగ్రీవంగా అంగీక రించారు.

సీత పదో తరగతికి వచ్చేసరికి సీత జడల మీద ఇంట్లో తీవ్రమైన వ్యతిరేకత మొదలయింది. ఆ వ్యతిరేకతకు ప్రారంభకురాలు సీత నాయనమ్మ, 'పిల్ల పెద్దదైంది.

తాడిలా పెరుగుతోంది, రేపోమాపో పెళ్ళి చెయ్యాలి, ఇంకా రెండు జడలేమిటి?' అని పోరు పెట్టేది. తల్లి కూడా వంతపాడేది. సీత మొదట ఇష్టపడలేదు. ఆరు నెలల క్రితమే సీత తన జుట్టును తన చేతుల్లోకి తీసుకుంది. తల్లి బిర్రుగా బిగించి జుట్టు పైకి దువ్వి రెండు చెవుల పక్కగా జడలు వేసి కొసకు రిబ్బను వేసి మడిచి పైకి కట్టేది. ఆరు నెలల క్రితం సీత టీచరొకావిడ సీత జడలు చూసి ముచ్చటపడి ఆ బిగుతు జడలు విప్పించి జుట్టుపైకి ఎగదువ్వకుండా కిందకు దువ్వి కాస్త ఒదులుగా రెండు జడలు వేలాడేలా వేసింది. రిబ్బన్లు తీసేసింది. ఆ జడలు చూసి ఇంట్లో అందరూ వెక్కిరించారు. నవ్వారు. నానా గోలా చేశారు. సీత ఏడ్చి గొడవ చేసి అలాగే జడలు వేసుకుంటోంది. ఇప్పుడిక ఆ రెండు జడలు మానెయ్యమని అన్ని వైపుల నుంచీ ఒత్తిడి మొదలయింది. ఆ జడని అందరూ ప్రత్యేకంగా చూస్తుంటే గర్వపడేది. జుట్టుకి శ్రద్ధగా పోషణ చేసేది. ఎంత శ్రద్ధ తీసుకున్నా ఎన్ని చిట్కాలు ఉపయోగించినా తమ జుట్టు పెరగటం లేదని తోటి పిల్లలు కొందరు బాధపడుతుంటే వినోదంగా చూసేది. అయితే సీత జుట్టుని బొత్తిగా లెక్కచెయ్యని స్నేహితురాలు ఒకమ్మాయి ఉంది. 'జుట్టంటే ఏమిటి – లేకపోతే ఏమిటి – అసలు జుట్టెందుకు. జుట్టుకింద వున్న మెదడు ముఖ్యం. నువ్వు ఆ మెదడంతా జుట్టు గురించి ఆలోచించటానికి, జుట్టుని రక్షించటానికి ఉపయోగిస్తున్నావు. జుట్టుని మర్చిపోయి ఇంకదేన్ని గురించయినా ఆలోచించు' అనేది సుభద్ర. సుభద్ర జుట్టు భుజాలు దాటదు. అందువల్ల అసూయతో అలా మాట్లాడుతోందని అనుకునేది సీత.

సీత నిజంగానే జుట్టు గురించే ఆలోచిస్తూ స్కూల్ ఫైనల్ తప్పి పెళ్ళి చేసుకుంది. పెళ్ళి కొడుకు తన జుట్టు చూసి ముగ్ధుడయ్యాడనుకుంది సీత. అయ్యాడు కూడా. మొదటి మూడు నెలలూ శాయశక్తులా పొగిడాడు. రానురానూ సీత జడ రకరకాల పనులకు అడ్డం వస్తోందని గ్రహించి విసుక్కోవటం మొదలెట్టాడు. సీతతో కలిసి ఎక్కడికి బయల్దేరాలన్నా సీత జడకు ఒక అరగంట టైము కేటాయించాలి. జుట్టు పోషణ కోసం సీత తీసుకునే జాగ్రత్తల వల్ల కూడా అతనికి చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. 'కాస్త జుట్టూడితే ఏమవుతుంది? అసలు సగానికి కత్తిరించెయ్యరాదూ' అంటూ సీతకు కళ్లనీళ్ళు తెప్పించేవాడు. కొన్నాళ్ళకు అతను సీత జుట్టును పట్టించుకోవటం మానేశాడు. అది సీత గుండెల్లో ముల్లులా గుచ్చుకుంటూనే వుండేది.

సీతకు ముప్పయ్యేళ్ళ వయసప్పుడు సీతనూ, ఇద్దరు కొడుకుల్నీ వదిలి అతను మరణించాడు. సీతకు భర్త చనిపోగానే నాయనమ్మ గుర్తొచ్చింది. నాయనమ్మ తన జుట్టుని ఉండనిస్తుందా అన్న అనుమానంతో సీత ఒణికి పోయింది. నాయనమ్మ పెద్ద పంచాయితీనే నడిపింది. ఐనా సీత అన్నలు ఆమె మాట సాగనివ్వలేదు. ఈ చర్చలు జరుగుతున్నప్పుడు సీతను పరామర్శించటానికి సుభద్ర వచ్చింది. 'ఆడదానికి జుట్టే

అందం, జుట్టే ముఖ్యం అనేవాళ్ళు భర్త చనిపోగానే జుట్టు తియ్యాలంటారు. సహజంగా వచ్చిన జుట్టును సాంఘిక సంబంధాల కారణంగా తియ్యాలనటం, ఉంచాలనటం చాలా పిచ్చితనం' అంది. సీతకు ఆ మాటలు చాలా నచ్చాయి. సుభద్ర కూడా 'నీకు భర్తంటే ప్రాణమో కాదో నాకు తెలియదు గానీ జుట్టంటే ప్రాణమని తెలుసు. ఎట్టి పరిస్థితుల్లోనూ జుట్టు తీయించకు' అని చెప్పింది.

సీతకు జుట్టు మిగిలింది గానీ దానికి చేసే పోషణ పూర్తిగా పోయింది. సీత జుట్టునిపుడు ఎవరూ పట్టించుకోవడంలేదు. తల నూనెలు తయారు చెయ్యటం లేదు. పూలు తేవటం లేదు. కళావిహీనమైన జుత్తు మాత్రం ఒత్తుగానే వుంది. ఒక్కోసారి భర్త జ్ఞాపకాలు సీతకు పిచ్చెక్కించేవి. ప్రేమగా తనను ముద్దులాడి కౌగిలించుకునే భర్త గుర్తొచ్చి శరీరమంతా అతని కోసం తపనపడేది. అప్పుడు సీతకు 'జుట్టు కత్తిరించుకుంటే కోరికలుండవు' అని చిన్నప్పుడు చెప్పుకున్న మాటలు గుర్తొచ్చేవి. అది నిజంకాదని తెలిసినా ఈ జుట్టు తీయించుకుని కోరికల పీడ ఒదిలించుకుందామా అని ఆవేశంగా అనుకునేది. వెర్రిగా జుట్టు పీక్కుని ఏడ్చేది.

సీత తలంటుకునే ముందు నూనె పెట్టుకోవటం కూడా వదినలకు కంటగింపు అయిపోయింది. తమ కంటె పెద్ద జుట్టు సీతకుండటం కూడా వారికి కంటగింపుగానే ఉండేది. క్రమంగా సీత జడ వాళ్ళ కంటికి పాముకంటే ప్రమాదకరంగా కనపడసాగింది. 'ఇంకెన్నాళ్ళు వాలు జడ వయ్యారం. ముడేసుకోరాదూ' అని మూతి తిప్పటం మొదలెట్టారు. జడమానేసి ముడి వేసుకున్న రోజున సీత కెందుకో ఆగకుండా దుఃఖం వచ్చింది. తన యవ్వనపు రోజులు గుర్తొచ్చో, అది పోతోందనే బాధో, యవ్వనం పోయింది ఒప్పుకోమని నలుగురూ బలవంతపెట్టిన తీరుకో, ఎందుకో గానీ సీత తనలో తనే కుళ్ళి ఏడ్చింది.

కొడుకులిద్దరి క్రాపులూ చూసినప్పుడల్లా తనకో కూతురైనా పుట్టి వుండకూడదా అనుకునేది. ఓసారి ఆ మాట పైకే అంటే సుభద్ర తిట్టింది. 'నీకో కూతురుంటే దాని ప్రాణం కూడా జుట్టులోనే ఉండేలా చేసేదానివి. అది కూడా నీలానే తయ్యారయ్యేది' అంది. సుభద్ర తనకున్న నాలుగు వెంట్రుకల్నీ కత్తిరించి ఇంచుమించు క్రాపుగానే చేసింది. ఆమె ఇప్పుడు పంతులమ్మ అయింది. కూతురికి జడే వేస్తోంది. సీతకు కోపం వచ్చి 'మరి నీ కూతురికి జడే వేస్తున్నావేం' అని అడిగింది. 'ఇప్పుడు ఆడపిల్లలకు క్రాఫింగులు పెంచటం ఫాషనయింది. పిల్లల దృష్టంతా బాబ్డ్ హెయిర్ మీదో పోనీటెయిల్స్ మీదో వుంటోంది. అందుకని నా పిల్లలకు పెద్దయ్యేదాకా జడవేసి తర్వాత క్రాఫ్ చేయిస్తా' అంది సుభద్ర.

సుభద్రకు తలతిక్క అనుకుంది సీత.

కాని సుభద్రకు కూడా తెలియదు తన జుట్టు గురించి ఎంత పట్టించుకోకుండా ఉండాలన్నా కుదరటం లేదని, ఆడదాని జుట్టు ఎట్లా పెంచాలో అన్నది నిర్ణయించేది కొన్ని సాంఘిక శక్తులే గాని ఆడవాళ్ళు కాదని

క్రమంగా సీత మేనగోడళ్ళు ఎదుగుతున్నారు. జుట్టు రక్షించుకునేందుకు వాళ్ళు ఉపయోగిస్తున్న పద్ధతులు వేరుగా ఉంటున్నాయి. పదిహేను రోజుల కొకసారి షాపుకెళ్ళి కత్తిరించుకొస్తారు. రెండు రోజుల కొకసారి షాంపూతో తలస్నానం చేస్తారు. నెలకో రకం షాంపూ మారుస్తారు. కోడిగుడ్డు, పెరుగు, నిమ్మకాయలు – వాళ్ళు జుట్టుకు పట్టించని పదార్థంలేదు. ఒదినలు ఆ పిల్లలకు సహకరిస్తూనే వున్నారు. ఈ షాంపూల వ్యవహారం జుట్టు కత్తిరింపుల వ్యవహారం సుభద్రకు తెలుస్తుందేమోనని అడిగింది. 'ఆడవాళ్ళ జుట్టు పెరగటం ఏమోగానీ కోట్ల రూపాయల వ్యాపారం మాత్రం జరుగుతోందే సీతా. జుట్టు వూడితే సవరాలవాడి వ్యాపారం పెరుగుతుంది. మనకు జుట్టు మీద భ్రమలు పెరిగిన కొద్దీ వాళ్ళ వ్యాపారం పెరుగుతుంది. నన్నడిగితే ఆడవాళ్ళందరూ క్రాపులు చేయించుకుని ఈ షాంపూల, సవరాల వ్యాపారాన్ని దివాళా తీయిస్తేగాని ఆడవాళ్ళ కష్టాలు తీరవు' అంది. 'సుభద్రకు జుట్టంటే కసిమాత్రం పోలేదు. ఏం చేస్తుంది పాపం. చిన్న జుట్టు' అనుకుంది సీత.

ఇంతలో ఆ ఇంట్లో పెద్ద సమస్య ఒకటొచ్చి పడింది. రెండో అన్నయ్య కూతురికి పలచగా మీసాలూ గడ్డమూ మొలవటం మొదలయింది. మొదట ఆ పిల్లను అందరూ ఎగతాళి చేశారు. ఆ పిల్ల రెండు రోజులు అన్నం మానేసి ఏడ్చింది. ఏడవటమే కాదు అంతకు ముందు ఆ పిల్ల కళ్ళల్లో ముఖంలో ఉండే కాంతి, ఉత్సాహం, చురుకుదనం అన్నీ పోయాయి. ఏదో పెద్ద దిగులు మబ్బులా ముఖమంతా పరుచుకుంది. క్రమంగా ఆ పిల్ల తల్లికి్కూడా దిగులు పెరిగింది. ఎన్నో మందులు వాడి చూశారు ఫలితం లేకపోయింది. తన జీవితం నాశనమైందని ఆ పిల్ల ఏడుస్తుంటే ఓదార్చే వారే లేరు. ఔను పాపం అని జాలిపడ్డారు. అవతల మగపిల్లలు గడ్డాలూ, మీసాలతో గర్వంగా తిరుగుతున్నారు. ఈ పిల్ల అవి ఒదిలించుకోలేక చచ్చిపోతోంది. ఏం పాపం చేసిందో ఎందుకని వచ్చాయో అని సీత జాలిపడింది. తెల్లబడిపోతున్న తన జుట్టు చూసుకొని కొన్నాళ్ళు బాధపడింది. ఒదినలు ముగ్గురూ కలిసి వాళ్ళ జుట్టుకి రంగు వెయ్యాలా, ఏం చెయ్యాలని చర్చించుకునే వారు. సీత జుట్టు తెల్లబడటమే మంచిదన్నట్లు పట్టించుకునే వారు కాదు. తను తప్ప మరెవరూ దిగులు పడకుండానే సీత జుట్టు తెల్లబడిపోయింది.

ఇవాళ నెలరోజుల జబ్బు తర్వాత జుట్టంతా రాలిపోతుంటే సీతకు అన్నీ గుర్తొచ్చాయి. అమ్మ రాసే నూనెలు, ఆముదం, కుంకుడు పులుసు, మల్లెపూలు, పెళ్లినాటి పూలజడ,

జడకుచ్చులు, భర్త పోయాక జుట్టు తీస్తారనే భయం, తియ్యరని తెలిశాక నిశ్చింత, అప్పటి నుంచీ వున్నా లేనట్టయిన జుట్టు, పూలకూ, పోషణకూ నోచుకోని జుట్టు, ఇప్పుడు రాలిపోతున్న జుట్టు –

అన్నీ కళ్ళముందు గాలికెగురుతున్న ముంగురుల్లా అల్లల్లాడాయి.

"ఈ జుట్టు నా ఇష్టంతో పెరిగిందా. నా ఇష్ట ప్రకారం పెరిగిందా?

నా జుట్టుని పోషించుకోవటంలోనూ, నిర్లక్ష్యం చెయ్యటంలోనూ ఎంతమంది పెత్తనం చేశారు. ఆడదాని జుట్టు మీద ఇన్ని ఆంక్షలూ, నియమాలూ, పైత్తనాలూ ఎందుకొచ్చాయి. ఆడదాని జుట్టునింత గట్టిగా పట్టుకున్న సమాజం ఆడదాన్ని ఇంకెంత గట్టిగా పట్టుకుంటుంది. ఆ పట్టులోంచి తప్పించుకోకుండా ఈ జుట్టులా పండి బలహీనమై రాలిపోవటమేనా – ఈ పట్టునుంచి ఈ పెత్తనం నుంచి తప్పించుకుంటే!... ఈ ఆంక్షలు లేకపోతే ఏమయ్యేది. నేనేమయ్యేదాన్ని" –

ఈ ప్రశ్నలు చాలా అస్పష్టంగా సీత మనసులో మెదులుతున్నాయి.

*జూన్ 1988*

*మానవి (ఉదయం)*

# 2

# కళ్ళు.

**నా** కళ్ళు అందమైనవి అంటుంది అమ్మ. కళ్ళ నిండుగా కాటుక పెడుతుంది. 'పచ్చటి చెంపల మీదుగా నల్లటి కాటుకా, తెల్లని కళ్ళలో నల్లని కాటుకా ఎంత కళ వుందే నీ కళ్ళలో' అంటుంది వదిన కూడా.

నిజమే నా కళ్ళు పెద్దవే - కాని ఏం లాభం. వాళ్ళ రాముడివి చింతాకంతకళ్ళు. చీకిరి కళ్ళు. నాకూ పదేళ్ళే. వాడికీ పదేళ్ళే. ఇంకా పదిరోజులు వాడికంటే నేనే పెద్దదాన్ని. కానీ, మా ఊళ్ళో వాడు చూసిన వింతల్లో వందోవంతు కూడా నేను చూడలేదు. మొన్నొకరోజు మా వాకిట్లో పెద్ద గొడవ అయింది. నేను బయటకు పరుగెత్తి గుంపులో నుంచున్నా. ఎక్కడ్నించి వచ్చాడో ఏమో మా అన్నయ్య బరబరా లాక్కొచ్చి ఇంట్లో పడేశాడు.

"ఆడపిల్లవు భయం లేకుండా ఎట్లా నుంచున్నావే - ఆ అరుపులు ఇంట్లో వుండి వింటుంటేనే గుండె దడదడ లాడుతుంటేనూ" అంది అమ్మ.

"నాకు భయంవెయ్యలేదు" అని చెబితే అందరూ తిట్టిపోశారు. మా వదిన పిరికితనం చూస్తే మా అన్నయ్యకి ఎంత సంతోషమో. ఒదిన్ని భయపెట్టి ఆమె దడుచుకుంటే కిలకిలా నవ్వుతాడు. ఒదిన కూడా అంతే - మాట్లాడితే "అమ్మో భయం" అని కళ్ళు మూసుకుంటుంది. "కళ్ళు తెరిచి చూడు ఒదినా ఏం లేదంటే" తెరవదే. ఒదిన కళ్ళు కూడా పెద్దవే కానీ ఏం లాభం వదినకు ఆ కళ్ళు మూసుకుని వుండటమే బాగుంటుంది.

వీధిలోకి ఒస్తారా – అమ్మా ఒదినా ఇక తలెత్తరు. వాళ్ళ కళ్ళన్నీ నేలమీదనే. నేలమీద ఏముంటాయి, ఒక వేళ ఏమన్నా వున్నా ఎన్ని రోజులు అవే చూస్తాం? వీధిలో ఏమున్నాయో సరిగ్గా చూడనే చూడరు. పైగా అమ్మ నన్ను తిడుతుంది.

'అలా దిక్కులు చూస్తావేం' అని, 'తలొంచుకు నడువు. నేల మీద చూడు' అంటూ మొట్టికాయలు వేస్తుంది.

అమ్మో – నేనసలు అట్లా నడవను. వీధిలోకి ఒచ్చినపుడు అటూ ఇటూ చూడకపోతే అన్నీ నాకెట్లా తెలుస్తాయి. ఇరవై నాలుగ్గంటలూ వీధిలో తిరిగే రాముడు నన్నసలు లెక్క చేస్తాడా.

కానీ వాడికి కూడా చాలా తెలియవు. ఆడవాళ్ళు కొన్నిటిని మాత్రమే చూస్తేచాలని వాడికి తెలియదు. అమ్మకు అవన్నీ బాగా తెలుసు.

మన ఒంటిని కూడా మనం సరిగా చూసుకోగూడదు. అమ్మకేకలేస్తుంది. ఏంటా చూడటం అని, పెద్దవుతున్న కొద్దీ మగవాళ్ళని అసలు సరిగ్గా చూడకూడదు. ఇప్పుడు నేను రాముడితో ఆడుకుంటున్నానా ఇంకో రెండేళ్ళు పోతే రాముడితో ఆడుకోగూడదు. రాముడు కనపడ్డగానే ఇంట్లోకి వెళ్ళాలి. బజార్లో కనపడితే తల పైకెత్తకుండా కళ్ళు మాత్రం పైకెత్తి చూడాలి. మా పక్కింట్లో వుండే పద్మక్క అట్లాగే చూస్తుంది. ఎందుకక్కా అట్లా చూస్తావూ అంటే అలా చూస్తేనే భలే అందంగా వుంటుందట. నా కింకా చేతకావటంలా అట్లా చూడటం. ఎప్పటికొస్తుందో ఏమో – రాముడికైతే చచ్చినారాదు.

ఆడవాళ్ళ కళ్ళ వెంట నీళ్ళు తొందరగా రావాలిట. మొన్న అమ్మ పక్కింటామెను తిడుతోంది. "రాతిగుండె, కంటెమ్మట చుక్క నీళ్ళు రాలేదు" అని. ఆడవాళ్ళకి ఊరి కూరికినే ఏడుపు రావాలిట. నాకెందుకో కోపం వస్తుంది గానీ ఏడుపురాదు. నన్ను ఊరికే తిడితే నాకు కోపం వస్తుంది. ఒదినకైతే ఏడుపొస్తుంది. అప్పుడన్నయ్య కోపం తగ్గుతుంది.

'చాల్లే ఇక ఆ ఏడుపు ఆపు' అంటాడు. ఐనా సరే ఒదిన కుమిలి కుమిలి ఏడుస్తుంది. అన్నాయ్యా ఒదినా పొట్లాడుకుంటే ఎప్పుడూ ఒదినే ఏడుస్తుంది. అన్నయ్య ఒక్కసారీ ఏడవడే. అమ్మా నాన్నా అయినా అంతే – ఎప్పుడూ అమ్మే ఏడవాలి. నాకు ఏడుపంటే ఇష్టంలేదు. ఏడిస్తే నా కళ్ళు ఏమీ బాగుండవు. మొహమంతా నల్లగా కాటుకవుతుంది. నేనెప్పుడూ ఏడవను బాబూ.

మనకళ్ళకి ఏం కనపడ్డా సరే మనం ఏం అనకూడదంట – ఏం చెయ్యకూడదంట. నాకు నాన్న చేతిలో మామిడిపళ్ళ బుట్ట కనపడిందనుకో – 'ఓ మామిడిపళ్ళో' అని ఎగర బుద్ధేస్తుంది. ఎగర కూడదంట. ఆ మామిడిపండు మన కంచంలోకి వచ్చేవరకూ

అరవకూడదంట. మన కంచంలోకి వచ్చాక బుద్ధిగా తినాలంట. మామిడి పళ్ళు చూడగానే ఎగరకపోతే చూసిన ఫలితం ఏముంది?

అలాగే కోపం వచ్చేవి చూసినా అరవకూడదంట. అప్పుడొక రోజు ఏమయిందీ, కల్యాణి అక్క కాలేజీ నుంచి ఒస్తుంటే ఒకబ్బాయి సైకిల్ మీద నుంచి పడిపోయాడు గదా – కాలు బెణికి లేవలేక పోయాడు. రోడ్డుమీదేమో ఎవరూ లేరు. కల్యాణి అక్క అతన్ని లేపి సైకిల్‌ని లేపి స్తంభానికి ఆనించి పెట్టింది. ఆ అబ్బాయి కాలు విదిలించు కుంటుంటే అతను పడకుండా పట్టుకుందట. ఇదంతా మా ఎదురింటి మామయ్య చూసి కల్యాణి వాళ్ళ నాన్నతో చెప్పాడట. కల్యాణి అక్కని బాగా కొట్టాడు. పరాయి మగాడిని రోడ్డుమీద కావలించుకుంటావా – అని తిడుతూ కొట్టాడు. పడిపోతే చూసి లేవదీశానంటే – చూస్తే చూశావు నీ దారిన నువ్వు రావాలి గాని దేశసేవ చేస్తావా అంటూ తిట్టాడు. కల్యాణి వాళ్ళ నాన్న కూడా మామయ్యే కాని అక్కను అట్లా కొట్టాక నాకు కోపం వచ్చి మామయ్యతో పలకటం మానేశా. చూసిన తర్వాత ఏదన్నా చెయ్యాలి గదా – లేకపోతే చూడటం ఎందుకు? చూడక ముందూ చూసిన తర్వాతా ఒకే రకంగా వుంటే చూడటం ఎందుకు? అంటే అమ్మకు అర్థం కాదు. నోర్మూసుకో అంటుంది.

కళ్ళు మూసుకోవాలి. నోరు మూసుకోవాలి. మా అన్నయ్య ఆఫీసులో పని చేసే ఆవిడొచ్చిందా – ఆవిడెంత బాగా నవ్వుతుందో. కాని చిత్రం ఆవిడ బొట్టు పెట్టుకోలేదు. కాటుక పెట్టుకోలేదు. ఐనా సరే ఎంత బాగుందో. ఉన్నంత సేపు చక్కగా నవ్వుతూ ఉంది. ఆవిడ అమ్మకీ ఒదినకూ నచ్చలేదుట. ముఖాన బొట్టు లేకపోతే మెళ్ళో గొలుసు లేకపోతే ఆ ముఖమే రోతగా ఉంటుందట. 'నిజంగా బాగోలేదామ్మా, నిజంగా బాగోలేదామ్మా' అని ఎన్నిసార్లో అడిగాను. 'నా కళ్ళకు పరమరోతగా కన్పించిందే – బొట్టులేని ముఖం చూడబుద్ధవదు నాకు' అంది అమ్మ. అమ్మంత అయితే నా కళ్ళు కూడా అమ్మ కళ్ళలాగే మారిపోతాయా.

అమ్మో – అలా మారిపోతే నా కళ్ళకు ఏమీ కనపడవు.

'ఎక్కడెక్కడివన్నీ నీ కళ్ళకే కనిపిస్తాయేమిటే' అంటుంది అమ్మ. అమ్మ కళ్ళకు ఏమీ కనిపించవు. కనిపించిన వాటి గురించి అమ్మ పట్టించుకోదు. ఆడవాళ్ళ కళ్ళు ఇట్లా ఎందుకుంటాయో –

*13 సెప్టెంబర్ 1988*

*స్త్రీ శక్తి (ఆంధ్రజ్యోతి)*

# 3

# ముక్కుపుడక

**మ**ళ్ళీ పెళ్ళి చూపులు.

రమకు తనలోపల ఏదో గడ్డకట్టుకుపోయిన అనుభూతి కలుగుతోంది. ఇప్పటికి ఆరు సంవత్సరాలనుంచీ సంవత్సరానికి ఐదారుసార్లకు తక్కువ కాకుండా ఈ పెళ్ళి చూపులు జరుగుతూనే ఉన్నాయి. రమ ఇంటర్ రెండో సంవత్సరంలోకి వచ్చినప్పటి నుండి మొదలైనాయి. రమ బి.ఏ. పాసయ్యి రెండేళ్ళనుంచీ ఉద్యోగం చేస్తోంది.

రమ చూపులకు బాగానే ఉంటుంది. చామనఛాయ. కళగల ముఖం. ముక్కు కాస్త పొట్టిగావున్నా లావనిపించేలా వున్నా చట్టిముక్కు అనిపించుకోదు. పెద్ద జడతో లావుకు తగిన ఎత్తుతో బాగానే ఉంటుంది రమ.

ఐతే అసలు సమస్య వేరే ఉంది. వచ్చి చూసి వెళ్ళిన వాళ్ళందరికి పిల్లనచ్చలేదని కాదు. పిల్ల నచ్చటం నచ్చకపోవటం అనే సమస్య చాలా తక్కువసార్లే వచ్చింది. అసలు నచ్చనిది రమ తండ్రి యిచ్చే కట్నం. అసలు సమస్య అదే!

ఐతే ఏది సమస్య అనేది అర్థమైతే, అసలు సమస్య ఎక్కడుందో సరిగా గుర్తించగలిగితే ప్రపంచంలో సమస్యలన్నీ తేలిగ్గానే పరిష్కారమవుతాయి.

ఒక సమస్యలో ఎన్నో రకాల కోణాలూ, నీడలూ. సమస్య ఒకచోట వుంటే దాని నీడ ఇంకో చోట కనబడుతుంది. నీడనే అసలు సమస్య అనుకుని మనం దాన్నక్కడ పట్టుకుంటాం. అలాగే రమ పెళ్ళి చూపుల్లో కొన్నాళ్ళు సమస్యంతా రమ ముక్కు మీద కేంద్రీకృతమయింది.

రమకి చిన్నప్పుడు వాళ్ళ నాయనమ్మ చెవులతో పాటు ముక్కూ కుట్టించింది. మూడేళ్ళ రమ బావురుమని ఏడుస్తూ తప్పించుకోబోయింది గానీ కుదరలేదు. ముక్కు కుట్టారు. రమ గింజుకోవటంతో ఒకచోట గాక రెండుచోట్ల చిల్లులుపడ్డాయి. మళ్ళీ నాయనమ్మ రమ కాళ్ళూ చేతులూ అదిమి పట్టుకుంటే రెండు చిల్లులూ కలిపేసి ఒకే పెద్ద చిల్లు పొడిచాడు ముక్కు కుట్టే అబ్బాయి.

తర్వాత చెవులకు పడ్డ పుళ్ళు తొందరగానే మానాయి గానీ ముక్కుకి బాగా చీము పట్టింది. జ్వరం వచ్చింది. పదిహేనురోజులు పిల్లను పీల్చిపిప్పి చేసి గానీ జ్వరం తగ్గలేదు.

నాయనమ్మ తన బేసరి రమకేనని బహిరంగంగా ప్రకటించింది. రమకి పదేళ్ళ వయసులో నాయనమ్మ చచ్చిపోతే ఆ బేసరి రమ ముక్కుకి పెట్టింది రమ తల్లి. బళ్ళో అందరూ వెక్కిరించటంతో రమ దాన్ని తీసి పెట్టెలో దాచింది.

ఐతే ముక్కుకి కన్నం మాత్రం అలాగే ఉంది. అక్కడ పడిన మచ్చ కూడా నల్లగా మిగిలిపోయింది. రమ కాలేజిలో చేరేనాటికి ముక్కుపుదకలు మరీ మోటయ్యాయి. రమ తోటివాళ్ళెవరూ ముక్కు కుట్టించుకోనే లేదు.

చాలా మంది రమ ముక్కువంకా చిల్లి వంకా మచ్చవంకా అదే పనిగా చూసేవారు.

"అదొక్కటేనే నీకు వంక" అనేవారు.

"అది వుంటే మాత్రం ఏమయిందిప్పుడు గాలి పీల్చటానికి అది అడ్డంకాదు. వాసన చూడటానికి అడ్డంకాదు. ముక్కుకి సంబంధించిన జబ్బులేమీ లేవు. కనీసం నాలుగేళ్ళ కోసారి కూడా జలుబన్నా చెయ్యదు. నా ముక్కు కేం బంగారం" అనేది రమ.

"మిగిలిన వాటికి అడ్డంకాదుగానీ రేపు నీ పెళ్ళికి అదే అడ్డంవస్తుంది చూస్తుండు" అంది శైల.

శైలని అందరూ చట్టిముక్కు అనేవాళ్ళు.

శైల అనే కాదు అందరూ ఎవరికి వాళ్ళు తమ అవయవాలు – ముఖ్యం ముఖం – ఫర్ఫెక్టుగా ఉందా లేదా అని పరీక్షించుకుంటూనే ఉండేవాళ్ళు. దానిలో భాగంగా

ముక్కు గురించి కూడా దిగులుపడుతుండేవారు. ఒకమ్మాయికి ముక్కు మరీ పొడుగని దిగులు - ఒకమ్మాయికి ముక్కు పొట్టిగా వుందని దిగులు. ఇంకొకమ్మాయికి ముక్కు వంకరని దిగులు. ఇంకొకరికి ముక్కు కిందికి వాలిపోయిందని దిగులు. అందరి మనసుల్లో ఓ ముక్కు ఉండేది.

నిటారుగా సన్నగా సూదిలా మొనదేలిన ముక్కు. కవులూ రచయితలూ వర్ణించే ముక్కు.

"అలాంటి ముక్కు ఉంటే ఎంత బాగుండు" అని పెద్దగా అంది మల్లిక, తెలుగు మాస్టారు మనుచరిత్రలో ముక్కు పద్యం చదివి చెప్పినప్పుడు.

సంపంగి మొగ్గలాంటి ముక్కు.

కథల్లో నవలల్లో నాయికలకుండే అందమైన ముక్కు.

తమకు లేని ఆ 'నాసిక'ను తల్చుకుని అమ్మాయిలందరూ తమ ముక్కుల మీద అసంతృప్తితో ఉండటం రమకు విసుగ్గా ఉండేది.

కానీ తన ముక్కే తనకో సమస్య ఔతుందని క్రమంగా ఆమెకు తెలిసి వచ్చింది.

వరసగా నలుగురు పెళ్ళి వాళ్ళు రమ ముక్కు గురించీ దానికున్న చిల్లి గురించీ మచ్చ గురించీ మాట్లాడేసరికి ఇంట్లో అందరికి భయం పట్టుకుంది.

ముక్కు కుట్టించి చచ్చిన నాయనమ్మను శాపనార్థాలు పెట్టింది రమ తల్లి.

ఐదో సంబంధం వాళ్ళు.

"డబ్బుదేముందిలెండి. మా అబ్బాయికి అందం ప్రధానం. మీ అమ్మాయేమో చామనఛాయ. పైగా ముక్కుమీద అదొకటి"

అంటూ నాన్చడం చూశాక, ఆ చిల్లినెలాగైనా పూడ్పించాలనుకున్నాడు రమ తండ్రి.

రమ బి.ఏ. రెండవ సంవత్సరంలో ఉండగా గుంటూర్లో పెద్ద సర్జన్ దగ్గరకు వెళ్ళి ఆ మచ్చ కనపడకుండా సర్జరీ చేయించాడు రమకి.

మచ్చలేని ముక్కు తనను వెక్కిరిస్తున్నట్టుంటే నిట్టూర్చింది రమ.

సంవత్సరాలుగా అలవాటైన ఆ మచ్చ రమ శరీరంలో భాగమైంది. అది లేకపోతే కొన్నాళ్ళు రమకు ఏదో వెలితిగానే అనిపించింది.

ఐనప్పటికీ "పోన్లే. ఇంకేం వంక పెడతారూ?" అనుకుంది.

స్నేహితులందరూ సంతోషించారు. "ఇక నీ పెళ్ళి అవుతుంది పొమ్మ"న్నారు.

'పెళ్ళికోసం ఆడపిల్లలు వీలైతే తమ ప్రతి అవయవాన్నీ మార్చుకోవాలేమో ఆ పెళ్ళి వాళ్ళ ఇష్టాల కనుగుణంగా' అనుకుంది రమ.

తెల్లగా ఉండే శోభని "మరీ అదేం తెలుపమ్మా పిచ్చి తెలుపు కళాకాంతి లేదు" అన్నారు.

పెద్ద కళ్లున్న వాణిని "అవేం మిడిగుడ్లూ, అవేం చూపులూ" అన్నారు.

తమ ఎదురుగా ఓ ఆడపిల్ల పెళ్ళి కోసం కూచున్నదనేసరికి మగ పెళ్ళివాళ్ళు కళ్ళకు ఏదో జబ్బు వస్తుందని రమకు గట్టి నమ్మకం కలిగింది.

రమ బి.ఏ. పూర్తయింది. రెండేళ్ళనుంచీ టైపిస్టుగా ఉద్యోగం కూడా చేస్తోంది.

ఐనా సంబంధం కుదరలేదు. ప్రయత్నాలు ఆగలేదు. ఈ రెండేళ్ళలో ఒకానొక సినిమాతార పుణ్యమా అని ముక్కుపుడకలు మళ్ళీ ఫ్యాషనయ్యాయి. అమ్మాయి లందరూ పొలోమని ముక్కులు కుట్టించుకోసాగారు. తన ముక్కు చిల్లిని చూసి నవ్విన వాళ్ళంతా ముక్కులు కుట్టించుకోటానికి పరుగెత్తుతుంటే రమ ఆశ్చర్యంతో తల మునకలయింది.

ఇవాళ రాబోతున్న సంబంధం గురించి అందరికీ ఆశలున్నాయి. అబ్బాయి లెక్చరరు. కట్నం పాతికవేలు చాలని ఒప్పుకున్నాడు. పెళ్ళికొడుక్కి ఒక్కతే అక్కగారు. ఆ అక్కగారు మూడేళ్ళ నుంచి రమ వాళ్ళ పక్కింట్లో అద్దెకుంటున్నారు. ఆవిడ పేరు సావిత్రి. సావిత్రే చొరవ తీసుకుని ఈ సంబంధం చాలవరకు స్థిరపరచింది. అబ్బాయి ఫోటో అమ్మాయి, అమ్మాయి ఫోటో అబ్బాయి చూశారు. అబ్బాయి ఒకటి రెండుసార్లు సావిత్రి దగ్గరకు వచ్చినపుడు రమ హఠాత్తుగా కనబడి మాయమయింది కూడా. అబ్బాయి సత్యనారాయణ లాంఛనంగా పెళ్ళిచూపులకు రావటమే కాని అమ్మాయి నచ్చలేదని చెప్పటానికి రావటంలేదని అందరికీ నమ్మకంగానే ఉంది.

ఐనా అందరిలో ఏదో బెదురు.

కాస్త రంగుంటే ఇంత బాధ ఉండేది కాదు అని గొణుక్కుంది తల్లి.

రమకి కూడా పెద్ద ఉత్సాహం లేదు. మామూలుగా అన్నిసార్లూ తయారయినట్లే తయారయింది.

తంతంతా ముగిసింది. వాళ్ళు సంతోషంగానే వెళ్ళారు.

పదిరోజుల్లో నిశ్చితార్థానికి ఏర్పాట్లు చెయ్యమన్నారు. రమకు నెత్తిమీద నుండి పెద్ద బరువేదో దిగినట్లయింది.

శుభ్రంగా భోజనం చేసి సాయంత్రం ఐదింటిదాకా గాఢనిద్ర పోయింది.

అయిదింటికి సావిత్రి వచ్చి లేపింది.

"లే లే నిద్రలో మా తమ్ముడిని మించేలా ఉన్నావే" అంటూ

రమ సిగ్గుపడుతూ లేచింది.

"ఇప్పుడు నువ్వు అర్జెంటుగా చెయ్యాల్సిన పని ఒకటుంది" అంది సావిత్రి.

"ఏంటది" అంది రమ బద్ధకంగా ఆవులిస్తూ.

"ముక్కు కుట్టించుకోవాలి".

ఆవులింత అయిపోయినా రమ నోరు మూతపడలేదు.

"మా తమ్ముడికి ముక్కుపుడక అంటే చచ్చేంత ఇష్టం. ముక్కుపుడక లేని ఆడదాని ముక్కుకి అందమే లేదంటాడు. 'అంతా బాగానే ఉంది గానీ ఆ అమ్మాయికి ముక్కుపుడక లేదక్కా' అన్నాడు. 'అదెంతపనిరా' అన్నాను. నీకు రవ్వవేసిన ముక్కుపుడక చేయిస్తానన్నాడు. రెండువేలకు తక్కువకాదు. అదృష్టమంటే నీదే. లే- లే- ముక్కు కుట్టించుకుందాం పద" సావిత్రి గబగబా మాట్లాడేస్తోంది

"నేను ముక్కు కుట్టించుకోను. ఈ పెళ్ళి ఆగిపోయినా సరే"

రోషంతో కోపంతో రమ ముక్కుపుటాలు అదురుతున్నాయి.

అవి అందంగా ఉన్నాయో లేదో చెప్పగల వాళ్ళెవరు?

*13 మే 1990*

ఈనాడు

# 4

# నోర్మూయ్

ఈ మాట పదే పదే చెవుల్లో వినపడుతుంటే భరించలేక చెవులు కూడా మూసుకుంది జానకి. ఈ మాటతో పరిచయం ఒక్కనాటిదీ కాదు. ఒక సంవత్సరానిదీ కాదు. ఊహ తెలిసిన క్షణం నుంచీ ఎప్పుడూ ఎవరో ఒకరు జానకిని ఈ మాట అంటూనే వున్నారు.

చిన్నతనంలో ఎక్కడ ఏం చూసినా, ఏం జరిగినా పట్టలేని సంతోషమో కోపమో బాధో కలిగేవి. వాటిని అమ్మకో నాన్నకో చెప్పాలని పరిగెత్తేది. తన ఆవేశాన్నంతా ప్రదర్శిస్తూ చెప్పబోతే వాళ్ళు వెంటనే -

"నోరు మూసుకుని అవతలకు నడువు, ఎక్కడ లేని సంగతులూ నీకే కావాలి" అని కసిరేవాళ్ళు.

అమ్మా నాన్నలే కాదు. అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మ, అత్త, పిన్ని, మావయ్య, బాబాయి అందరూ అంతే.

ఎందుకట్లా వాగుతావు అనేవారు.

ఆడపిల్లకంత నోరు పనికి రాదు అనేది అత్త. ఎంత నోరు తనది?

వెళ్ళి అద్దంలో చూసుకుంటే ఎర్రని పెదవులతో బుల్లి నోరు కనిపించింది. ఇంత చిన్ని మూతిని పట్టుకుని ఎందుకలా అంటుంది?

ఇంత చక్కని మూతి మీద వాత పెడతానని అమ్మ ఎందుకంటుంది?

ఆడపిల్లలకు నోరు ఎందుకుండకూడదు?

అన్నలూ, తమ్ముళ్లూ ఊరి మీద పడి తిరుగుతుండేవారు. అన్నాల వేళకొచ్చి అన్నం తినడం, నిద్రపోవడం. వాళ్ళు బయట తిరిగి ఆడేటప్పుడు హాయిగా అరుచుకుంటారు, మాట్లాడుకుంటారు.

అన్నలు కాలవలో ఈతకి దూకుతూ ఎల్లా అరుస్తారనీ...!

జానకి ఒక రోజు పెరట్లో తొట్టి నిండా నీళ్ళు వున్నప్పుడు, తొట్టి అంచుమీద నిలబడి పెద్దగా అరుస్తూ తొట్లోకి దూకింది.

తొట్లో నీళ్ళన్నీ ఆనందంతో చిందులేసేసరికి జానకి సంతోషం పట్టలేక మరి రెండు కేకలేసింది. గట్టిగా గొంతు నరాలు పొంగేలా అరిచింది.

నాయనమ్మా, నాన్నా ప్రత్యక్షమయ్యారు.

నాన్న ముఖం అసహ్యంగా చేసుకుని జానకిని తొట్లోంచి ఎత్తి బైటపడేశాడు. బట్టలు లేని జానకిని చూసి చీదరించుకుంటూ 'సిగ్గులేదు' అని తిడుతూ వెళ్ళి పోయాడు. అన్ననూ, తమ్ముళ్ళనూ కాలవకి స్నానానికి తీసికెళ్ళి వాళ్ళు బట్టలు విప్పుకుని ఈత లేస్తుంటే నవ్వి నవ్వి అలసిపోయే నాన్న!

తనను కాలవకెలాగూ తీసికెళ్ళడు. ఇంట్లో తొట్లో దిగకూడదూ! అప్పుడు బట్టలెందుకు? ఈ మాటే నాయనమ్మనడిగితే వీపు మీద రెండు అంటించి "నోరు మూసుకోవే సిగ్గుమాలిన దానా" అన్నది.

మాటలు నోట్లో నుంచి వస్తున్నాయేగాని అసలు పుట్టడం తలకాయలో నుంచి పుడుతున్నాయని వయసు వస్తున్న కొద్దీ జానకి గ్రహించింది. అందుకే -

"నీ నోరు కుట్టెయ్యాలి" అని అత్త అంటే జానకి పకపకా నవ్వింది.

"నీకు తెలియదా? మాటలు పుట్టేది ఇక్కడ. నోట్లో నుంచి వస్తున్నాయంతే" అని తలకాయమీద కొట్టుకుంది.

"నీ తెలివి మండినట్టే వుంది" అని వీపు మీద దబ దబా బాదింది అత్త.

తలకాయలో మాటలు పుడుతున్నప్పుడు వాటిని వెంటనే బైటికి రానీయకూడదనీ, కొన్నింటిని అసలు రానీయకూడదనీ, జానకికి ఆలస్యంగానైనా అర్థమయింది.

మాటల సంగతి సరే - తన మాటలు పెద్దవాళ్ళకు అర్థంకావు. కోపం వస్తుంది. వాళ్ళ మాటలకు తనకు ఏడుపొచ్చినట్లే, తన మాటలకి వాళ్ళకూ కోపం వస్తుందేమో.

కాని నవ్వు - నవ్వేం చేసింది?

నవ్వితే ఎవరికైనా బాధ ఎందుకు? కోపం ఎందుకు? అందునా జానకికి నవ్వు పెదవుల మీదనే వుంటుందా అన్నంత తొందరగా వచ్చేస్తుంది. ఇంటా బయటా ఎన్నో చిత్రాలు. ఎన్నో తమాషాలు. అన్నిటికీ నవ్వు వస్తుంది. ఎట్లా ఆపాలి? నవ్వు వచ్చేవన్నీ ఎదురుగా కన్పిస్తున్నా నవ్వకూడదు. నవ్వితే కొడతారు గదా? కొడితే నొప్పేస్తుంది గదా? నొప్పికి ఏడుపొస్తుందా – ఏడవగూడదు.

నొప్పి పుట్టేలా కొట్టి ఏడవ వద్దంటున్న పెద్దాళ్ళను చూసి ఆశ్చర్యపోయేది జానకి. "కొట్టకపోతే ఏడవడుగా" అనడగింది ఒకసారి తండ్రి తమ్ముడ్ని కొట్టి ఏడవవద్దని గదుముతుంటే.

"నువ్వు నోరు మూయకపోతే నీకూ పడతాయి. వెధవ ప్రశ్నలని వెధవ ప్రశ్నలు. ఏం లేకపోయినా నోరొకటి ఇచ్చాడు దేవుడు" నాన్న కోపం ఇటు తిరిగింది.

దేవుడు నోరిచ్చాడు. నోటితో మాట్లాడతారు, నవ్వుతారు, ఏడుస్తారు.

మరి ఇదేమీ చెయ్యొద్దంటారెందుకు? ఇవన్నీ చెయ్యకూడనివైతే దేవుడు నోరివ్వడం ఎందుకు? జానకి చిన్ని బుర్ర అంతకు మించిన ఆలోచన భరించలేక పోయేది. ఎదురుగా కనబడుతున్న ఏ చెట్టునో పట్టుకుని ఈ విషయం వదిలేసేది.

జానకికి క్రమంగా ఎన్నో చిత్రమైన విషయాలు తెలిశాయి.

ముందు చిన్న పిల్లలను పెద్దవాళ్ళు నోరు ముయ్యమంటారని అర్థమైంది.

తర్వాత చిన్న పిల్లల్లో కూడా ఆడపిల్లలు ఎక్కువసార్లు నోరుమూసుకోవాలని అర్థమైంది. ఐతే ఊహ పెరిగే కొద్దీ ఆడవాళ్ళను కూడా మగవాళ్ళు నోరు ముయ్యమంటారని తెలిసింది. నాన్నా, అమ్మా – ఒకరేమిటి ఇంట్లో ఆడా మగా పిల్లలతో సహా అందరూ అందరికంటే పెద్దాడైన ఎంకటి గాడిని నోరుమూసుకోరా అంటారు. జానకికి కూడా వెంకటిని నోరు మూసుకో అని అందామని చాలా సార్లు అనిపించింది.

కాని ఎంకటి జానకితో చాలా మంచి కబుర్లు చెప్పేవాడు.

దూడలు అరిస్తే వాటి భాషలో అవి ఏమంటున్నాయో చెప్పేవాడు. పిట్టలు జామ చెట్టుమీద మీటింగ్ పెట్టుకుని ఏం మాట్లాడుకుంటున్నాయో చెప్పేవాడు. మబ్బులు తొందర తొందరగా ఇళ్ళకెందుకు పరిగెత్తుతున్నాయో చెప్పేవాడు. మబ్బులు పొట్టల్లో నీళ్ళు పెట్టుకుని గబగబా ఇంటికి పరిగెత్తి కుండల్లో నింపుకోవడం, ఇల్లు చేరలేక పోతే ఆ నీళ్ళన్నీ కారిపోయి వర్షంగా కురవడం ఎంకటి చెబుతుంటే నోరు తెరుచుకుని వినేది జానకి. 'నోరుముయ్ ఏంటా వాగుడు' అనాలని మర్చిపోయేది.

మళ్ళీ ఎంకటిగాడు చెప్పే ఆమాటలే అమ్మకో నాన్నకో చెప్పబోతే వాళ్ళు జానకిని 'నోరుమూసుకో'మనే వాళ్ళు. బీదవాళ్ళనీ, తక్కువ కులం వాళ్ళనీ, ఆడాళ్ళనీ నోరు ముయ్యమని అంటారని జానకి గ్రహించింది.

అప్పట్నించి జానకి అతి తక్కువ మాట్లాడడం ప్రయత్న పూర్వకంగా అలవరచుకుంది.

బళ్ళో, ఇంట్లో నోరు విప్పకుండా పనులు చేయడం నేర్చుకుంది.

జానకిని అందరూ మెచ్చుకున్నారు.

తలకాయలో పుట్టే మాటలను ఆపెయ్యడం కోసం కృషి చేసిన జానకి తన తలకాయలో మాటలు పుట్టడం క్రమంగా తగ్గిపోతోందని గ్రహించలేకపోయింది. మాట్లాడకుండా వుంటే తనలో కలిగే అశాంతి క్రమంగా తగ్గిపోతోందని సంతోషించిందే కాని తనకున్న ఊహాశక్తి పోతోందని తెలుసుకోలేకపోయింది.

చిన్నతనంలో వాడిన కొమ్మలనూ రాలిన పువ్వులనూ చూసి వాటి కోసం బాధపడి వాటి దుస్థితిని నలుగురికి చెప్పాలని ప్రయత్నించే జానకి ఇవాళ తన ఎదురుగా మనుషులు బాధపడుతున్నా ఏమీ మాట్లాడలేని దుస్థితికి వచ్చింది. నిశ్శబ్ధంగా ఏడవటం తప్ప ఏమీ చెయ్యలేక పోతోంది.

పిట్టల అరుపులకూ, లేగదూడల గంతులకూ చిందులు వేసే జానకి ఇప్పుడు తన ఎదురుగా ఎంత సంబరం జరుగుతున్నా చిరునవ్వుతో నిశ్శబ్దంగా నిలబడడం నేర్చుకుంది.

జానకికి పెళ్ళయింది. వరుడు అందగాడు. మంచి ఉద్యోగస్తుడు. జానకి తనలో తాను మురిసిపోయింది.

అయితే ఆ మురిపెం పోయి దాని స్థానంలో భయం ప్రవేశించడానికి ఎంతో కాలం పట్టలేదు.

"ఏంటా చూపులు - ముంగిలా మాట్లాడవేం" జానకి భర్తకు జానకి మౌనంతో చిరాకు వచ్చేది. ఏం చెప్పినా విని ఊరుకునే జానకి, బదులివ్వకుండా చెప్పిన పని చేసే జానకి అతనికి చాలా అసహనం కలిగించింది.

తన భర్తకు మాటలూ కబుర్లూ కావాలని అర్థమయ్యేసరికే జానకి చెంపలు వాచి పోయాయి. జానకి మళ్ళీ మాటలు నేర్చుకోవడం మొదలు పెట్టింది. నోరు విప్పడం మొదలు పెట్టింది. తనకు కలిగిన ప్రతి అనుభూతిని మాటల్లో చెప్పడం ఒకప్పుడెంతో తేలికగా వుండేది.

ఇప్పుడలా కాదు.

ఇప్పుడు మాటల కోసం యుద్ధం చేయవలసి వస్తోంది.

మెదడులో యుద్ధం, గొంతులో యుద్ధం, నాలుకమీదా, పెదవుల పైనా యుద్ధం. ఈ యుద్ధంలో అపజయం కలిగినా అలసట కలిగినా జానకి ప్రయత్నం మానలేదు.

నెమ్మది నెమ్మదిగా నడకరాని బుడతడు పడుతూ లేస్తూ నడక నేర్చినట్లు మాటలు నేర్చింది. జానకిలో మార్పుకి భర్త కూడా సంతోషించాడు.

జానకి అతనికేం కావాలో, అతని ఇష్టాలేమిటో అడిగి కనుక్కుంటున్నప్పుడూ, అతని ఇష్టాలు తీరుస్తానని చెబుతున్నప్పుడూ అతను చాలా సంతోషించాడు.

అతని పనులనూ ప్రవర్తననూ అందాన్నీ జానకి ముచ్చటైన మాటల్లో మెచ్చుకుంటుంటే అతను నిజంగానే సంతోషించాడు. ఐతే జానకి మాటలు అంతటితో ఆగలేదు. జానకి చిలక కాదు. మనిషి. జానకి మరికొన్ని విషయాలు అడగడం, మాట్లాడడం మొదలు పెట్టేసరికి భర్తకు మళ్ళీ చిరాకు మొదలయింది.

కనుబొమ ముడితో ప్రారంభమైన ఆ చిరాకు క్రమంగా జానకి మాటలతో పాటు పెరిగింది. ఒకానొకరోజు బద్ధలయింది.

"నోర్మూయ్ – ఆడదానికంత నోరు పనికి రాదు"

"ఆడదానివి నోరుమూసుకుని పడుండు"

భర్త ఈ మాటలన్న రోజు జానకి పిచ్చిగా నవ్వింది. కళ్ళల్లో నుండి నీరు కారేలా నవ్వింది. నవ్వి నవ్వి నిలబడలేక మంచం మీద పొర్లింది.

"ఏంటా విపరీతపు నవ్వు? ఆడదానివేనా?"

జానక్కి నవ్వాగడం లేదు

ఆ నవ్వు ఏడుపుగా మారేవరకూ ఆగదు కూడా!

"నోర్మూయ్–నోర్మూయ్"

జానకి చెవుల్లో ఆ మాట మారుమోగుతోంది. చెవులు మూసుకున్నా సరే –

ఆ మాట చెవుల ద్వారా వచ్చినప్పటికీ తలకాయలో పుట్టింది. రక్తంలో ఇంకింది.

*8 జూన్ 1990*

*ఆంధ్రజ్యోతి వారపత్రిక*

# 5

# వెన్నెముక

"అబ్బా - ఎంత ప్రయత్నించినా ఈ నడుం అరంగుళం కూడా సన్నబడటం లేదే" అంది రమ పరీక్షగా నడుం ఒంపులను అద్దంలో చూసుకుంటూ.

రమకు కాస్త-కాస్తేమిటి, ఎక్కువగానే వుంది అందం పిచ్చి. ముఖం వరకూ ఆ పిల్లకు పెద్ద సమస్య లెదురవలేదు. చక్కని రంగు, కళగల ముఖం, క్రీములూ అవీ పూసి, కాటుకా తిలకం దిద్ది చక్కని మెరుగులు పెడుతుంది. ఈ నడుమొకటే లొంగటంలేదు.

చీర కట్టినప్పుడు చక్కని ఒంపుతో నడుం అలా జారే బ్యూటీల బొమ్మలు పత్రికల్లో చూసినపుడూ, అందాల పోటీలకు వెళ్ళే మోడల్స్‌ని చూసినపుడూ రమకు ఒకటే దిగులు పట్టుకుంటుంది. అంత సన్నబడాలి తన నడుంకూడా-

ఎక్సర్‌సైజులు మొదలు పెట్టింది.

డయిటింగులు చేస్తోంది - నానా పాట్లు పడుతోంది.

ఇవాళ మధ్యాహ్నం భోజనాలయాక హాస్టల్లో తన స్నేహితుల్ని పదిమందినీ గదికి పిలిపించి తను కొత్తగా కొనుక్కున్న మైసూర్ జార్జెట్ చీరె కాస్త బొడ్డు కిందుగా కట్టి చూపించాలని స్నేహితుల మెప్పుపొందాలనీ అనుకుని పదిమందిని పోగు చేసింది.

తీరా చీరకట్టి నిలువుటద్దం ముందు నుంచుంటే మామూలే - రావాల్సినంత ఒంపు రాలేదు. సుస్మితాసేన్, మాధురీదీక్షిత్, జుహీచావ్లా, ఐశ్వర్యారాయ్ అందరి నడుములూ అద్దంలో అలా కనపడి సుతారంగా జారిపోయాయి తప్పితే రమ నడుంమాత్రం ఎప్పటిలాగానే వుంది. రమ బిక్కముఖం చూసి రాణికి జాలేసింది.

"అసలు సన్నటి నడుం ఎందుకే - పెద్ద నడుం వుంటే ఎక్కువ బంగారం పెట్టి పెద్ద ఒడ్డాణం చేయించుకోవచ్చు" అంది రాణి రాధికను వెక్కిరింతగా చూస్తూ. రాధిక నడుం పెద్దది. పెద్దదంటే అసలు నడుమంటూ విడిగా కనపడదు. స్నేహితులందరూ రాధికను ఆ విషయంలో వేళాకోళాలాడుతూ వుంటారు.

రాధిక వాటినసలు పట్టించుకోదు. ఇప్పుడూ పట్టించుకోలేదు. "రాణీ - నీ బంగారం పిచ్చతోనన్నా నా నడుముని మెచ్చుకున్నావు. థాంక్స్ - కానీ పిచ్చి ముఖాల్లారా యివాళా రేపూ ఆడదానికి అవసరమైంది అందమైన సన్నిటి నడుంకాదే - బలమైన ధృఢమైన వెన్నెముక అది నా దగ్గరుంది" అంది గర్వంగా.

"అలాగలాగా - ఏదండీ తమ బలమైన వెన్నెముక - చూడనివ్వండి" అంటూ శాంతి వచ్చి రాధిక వీపుమీద బలంగా కొట్టింది. రాధిక కెవ్వున అరిచింది.

"చంపుతా వెధవ్వేషాలేశావంటే - నా వెన్నెముక బలం రేపు సాయంత్రం మీ అందరికీ తెలుస్తుంది అప్పటిదాకా ఆగండి" అంది వీపు సవరించుకుంటూ.

వెంటనే పదిమంది అమ్మాయిల్లో కుతూహలం చెలరేగింది.

"ఏంటి-రేపేం చేస్తావు?" అందరూ రాధిక చుట్టూ మూగారు.

"చెప్పను చేసి చూపిస్తా" అంది రాధిక ఎడ్వర్టయిజ్ మెంటుల్లో ప్రకటనలిచ్చే అమ్మాయి గొంతు అనుకరిస్తూ.

"పిచ్చి వేషాలేస్తే అందరం కలిసి నిన్ను యిక్కడే కట్టి పడేసి రేపు రాత్రి దాకా ఒదలం. నువ్వు చెయ్యాలనుకున్నది చెయ్యలేవు. బుద్ధిగా యిప్పుడే చెప్పెయ్. లేకపోతే... ఒసే పట్టుకోండే దీన్ని-" శాంతి రాధిక చెయ్యి పట్టుకోబోయింది. రాధిక గభాల్న వరండాలోకి పరిగెత్తింది. మిగిలిన వాళ్ళంతా ఆ పిల్ల వెంటపడ్డారు.

అసలే ఆదివారపు అతిధులతో కళకళలాడుతున్న హాస్టలు వీళ్ళ నవ్వులతో మరింత సుందరవనమయింది.

చాలాసేపు రాధిక ఎవరికీ దొరక్కుండా అటూ యిటూ పరిగెత్తింది గానీ చివరికి అందరూ కలిసి రాధికను పట్టుకుని బాగా పూతమీద నున్న మామిడి చెట్టుకిందకు లాక్కెళ్ళారు. ఆ చెట్టుకి పూత ఎంత వుందో గండు చీమలు కూడా అన్ని వున్నాయి.

"చెప్తావా? ఈ చెట్టుకి కట్టెయ్యమంటావా?"

పరుగూ, నవ్వూ వల్ల కలిగిన ఆయాసాన్ని అణుచుకుంటూ అడిగింది శాంతి.

రాధిక కూడా అలిసిపోయింది. నవ్వు ఆగటం లేదు. నవ్వు ఆపుకోటానికి విశ్వప్రయత్నం చేస్తూ...

"చెప్తా- చెప్తా- ఒదలండి"

అంటూ చెట్టు మొదలు మీద జారగిలపడింది.

"చీమలు కుట్టి చస్తావు. ఇవతలకి జరుగు" అంటూ వనజ రాధికను యివతలకి లాగింది.

అందరూ రాధిక చెప్పబోయే విషయం కోసం ఊపిరి బిగపట్టారు.

"రేపు సాయంత్రం నాలుగుగంటలకు మన ప్రాక్టికల్ ఎగ్జామ్ అయిపోతుంది".

"అలాగా- మాకు తెలియదే" సుమతి వెక్కిరింతగా సాగలాగింది.

"అపుడు మనందరం వెంటనే హాస్టల్‌కి రాబోవటం లేదు"

రాధిక సస్పెన్స్ సృష్టించిన ముఖం పెట్టింది.

అమ్మాయిల్లో కుతూహలం పెరిగింది. "ఎక్కడికెళతాం! ఎక్కడికెళతాం! - సినిమాకా?" సుందరి చిందులేసినంత పని చేసింది.

"ఛీ-మీ బుర్రలకు అంతకంటే మంచిదేం తోచిచావదు. సినిమాకు కాదు నా పెళ్ళికి వెళతాం".

ఒక్కసారి పదిమంది అమ్మాయిలూ నిశ్శబ్దమై పోయారు.

ముఖాలమీద చిరునవ్వులు సైతం మాయమైపోయాయి.

అందరూ సందేహంగా, భయంగా రాధిక వంక చూస్తూ వుండిపోయారు.

"ఎందుకే అట్లా చూస్తారు?" రాధిక విసుక్కుంది.

"విక్టర్‌తోనేనా నీ పెళ్ళి" శాంతి సందేహంగా అడిగింది.

"కాక -? నీతోననుకున్నావా?"

రాధిక అందరినీ మళ్ళీ నవ్వించే ప్రయత్నం చేసింది గానీ ఎవరూ నవ్వలేదు.

"మరి మీ అమ్మా నాన్నలకు తెలుసా?" రాణి అడిగింది.

"తెలియదు తర్వాత తెలుస్తుంది. ముందు చెబితే ఒప్పుకుంటారేంటి?"

"కొన్నిరోజులు ఆగొచ్చుగా - ఇప్పుడంత తొందరెందుకు?" శాంతికయితే ఎలాగోలా పెళ్ళిని వాయిదా వేద్దామా అనిపించింది.

"ఎన్నిరోజులే - రెండేళ్ళనుంచి ప్రేమించుకుంటున్నాంగదా. మరో పదిరోజుల్లో పరీక్షలై వెళ్ళిపోతాంగదా ఆ వెళ్ళేదేదో పెళ్ళి చేసుకుని వెళ్దామని-"

"మరీ రేపే యెందుకే - పరీక్షలయ్యాక చేసుకో"

"నో - రేపే జరగాలి. ఎందుకంటే విక్టర్‌కి వుద్యోగం వచ్చింది. ఎల్లుండి వెళ్ళి జాయినవ్వాలి. జాయినయ్యాక ఆరునెల్లదాకా ఒక్కరోజు కూడా శలవివ్వరట. ట్రైనింగు పీరియడట - అందుకని మేమిద్దరం రేపు సాయంత్రం మీ అందరి ఎదుటా దండలు మార్చుకుని దంపతులమైపోతాం".

మళ్ళీ అందరూ నిశ్శబ్దమైపోయారు. అందరిలోనూ ఉత్సాహం తగ్గింది. మర్నాడు జరగబోయే పెళ్ళి వార్త ఎవరిలోనూ కలిగించాల్సినంత ఆనందాన్ని కలిగించలేక పోయింది.

రాధిక బ్రాహ్మణ పిల్ల. విక్టర్ వాళ్ళు మాలవాళ్ళు.

కులాంతర వివాహాలు జరుగుతూనే వున్నా తమ కళ్ళ ధగ్గరే జరగటం ఆ పిల్లల్ని కాస్త ఉక్కిరిబిక్కిరి చేసింది.

రాధికా విక్టర్‌ల స్నేహం, వాళ్ళిద్దరూ రెండేళ్ళ నుంచి కలిసి తిరగటం యివన్నీ అందరికీ తెలుసు. కానీ అట్లా కలిసి తిరిగిన జంటలు చదువులయ్యాక విడిపోయి సంప్రదాయబద్ధంగా పెళ్ళిళ్ళు చేసుకోవటమూ వాళ్ళకు తెలుసు. పైగా ఈ రోజుల్లో ఎవరి కులం ఏమిటన్నది తెలుసుకుని గాని ఎవరూ ప్రేమలో పడటం లేదని కూడా వాళ్ళకు తెలుసు. ప్రేమకంటే డబ్బు, కులం పెళ్ళికి ముఖ్యమనే లోక జ్ఞానం అబ్బినవాళ్ళు వాళ్ళు. రాధిక చేసే సాహసం పట్ల ఆ అమ్మాయిలకు గౌరవం కంటే భయమే ఎక్కువ కలిగింది.

మర్నాడు ప్రాక్టికల్ పరీక్షల్లో అవసరం లేకపోయినా అందరి చేతులూ ఒణికాయి. అందరిలో ఏదో ఉద్రిక్తత - నిజంగా ఈ పెళ్ళి జరుగుతుందా? ఇంత తేలిగ్గా హాయిగా రాధిక నిర్ణయించుకోగానే పెళ్ళి జరిగిపోవటమేనా? ఇంత సులభమా పెళ్ళి? కానీ తర్వాత - తర్వాత వచ్చే సమస్యలు? అందరి బుర్రలూ ఏదో ఓ క్షణంలో అటువైపు వెళ్తూనే వున్నాయి. రాధిక మాత్రం అందరికంటే ముందు పరీక్ష ముగించి హడావుడిగా హాస్టలుకి వెళ్ళింది. ఆ వెనకే శాంతి, వనజా వెళ్ళారు. రాధిక జరీ అంచున్న కోరారంగు వెంకటగిరి చీర కట్టుకుని కాస్తంత పెళ్ళికళ తెచ్చుకుందామని ప్రయత్నించింది.

శాంతీ, వనజలు కాస్త అందంగా జడవేసి మల్లెపూలు తెచ్చిపెట్టారు. రమ కాటుక పెట్టింది. లిప్‌స్టిక్ పూస్తానంటే రాధిక చస్తే ఒప్పుకోనంది. పదిమందీ కలిసే అశోకా హోటల్‌లోని ఫంక్షన్ హాలుకి వెళ్ళారు. అక్కడ విక్టర్ స్నేహితులోపదిమంది ఉన్నారు.

అందరి సమక్షంలో దండలు మార్చుకున్నారు రాధికా విక్టర్‌లు. అందరూ వాళ్ళ నభినందించి, మంచి భోజనం చేసి రాధికను ఆ రోజుకు విక్టర్‌తో ఒదిలి వెళ్తున్నామనీ, అదే వాళ్ళకు తాము యిస్తున్న పెళ్ళికానుక అని చెప్పి హాస్టల్‌కి తిరిగి వచ్చేశారు.

బట్టలు మార్చుకుని, ముఖాలు కడుక్కుని మళ్ళీ ఈ లోకంలో పడాలని చూశారు. పుస్తకాలు తెరిచి బలవంతంగా వాటిల్లో తలలు దూర్చారుగానీ అక్షరాలు కనపడటం తప్ప వాటి అర్థాలు బుర్రకెక్కంగాక ఎక్కమని మొండికేశాయి.

రాధిక చేసింది మంచిపనేనా? తామూ ఆపని చెయ్యగలమా? తల్లిదండ్రుల్ని ఎదిరించ గలమా? అసలు ఎదిరించాలా? తల్లిదండ్రుల ప్రమేయం లేకుండా నిర్ణయాలు తీసేసుకో గలమా? ఒక్కొక్కరే పుస్తకాలు మూసేసి ఈ ప్రశ్నల్ని పైకి ఒకరి నొకరు అడగటం మొదలుపెట్టారు.

"నిర్ణయాలు తీసుకునే శక్తి లేకపోతే ఈ చదువులూ, డిగ్రీలూ వుద్యోగాలూ యివన్నీ ఎందుకు?" అంది వనజ ఆలోచనగా.

"బాగుంది-యివన్నీ సుఖంగా బతకటానికి" రాణి ప్రొటెస్టు చేసింది.

"ఎట్లా వుంటే మనకు సుఖమో మనకే తెలుస్తుంది గదా- కాబట్టి మనం ఎట్లా సుఖపడాలో మనమే నిర్ణయించుకోవాలిగదా" శాంతి కూడా వనజను సపోర్టు చేయాలని నిశ్చయించుకుంది.

"అది మనకు తెలుస్తుందా?" రమ అనుమానం వెలిబుచ్చింది.

"రాధికకు తెలిసిందిగదా- విక్టర్‌ని పెళ్ళాడితే సుఖంగా వుంటుందనుకుంది. నిర్ణయం తీసేసుకుంది" వనజ నిలదీసింది.

"కానీ ఆ నిర్ణయం తప్పయిందనుకో-ఆమెకు విక్టర్‌తో సరిపడలేదనుకో-" రమ తనూ పట్టువదల్లేదు.

"అపుడు విక్టర్‌తో విడిపోయే నిర్ణయం కూడా తీసేసుకోవచ్చుగా" శాంతి ఉత్సాహంగా అంది.

"అప్పుడిటు తల్లిదండ్రులూ లేక, అటు భర్తాలేక - అమ్మో - ఎందుకట్లాంటి జీవితం?" రాణి భయపడింది.

"సరే నువ్వు తల్లిదండ్రులు ఎవర్ని చేసుకోమంటే వాడిని చేసుకుంటావు. వాడితో నీకు పడలేదనుకో అప్పుడేం చేస్తావు?" వనజ లేచి నిలబడింది కోర్టులో లా పాయింటు లాగుతున్న లాయర్లా.

"మా అమ్మా నాన్నలు ఏం చెయ్యమంటే అది చేస్తా. వాళ్ళ అండ నాకుంటుంది గదా" రాణి గారాంగా అంది. రమ ఔననట్లు తలూపింది.

"నీ బొంద వుంటుంది. అమ్మా నాన్నలు ఎట్లాగొట్లా రాజీపడి వాడితోనే బతుకమ్మా అని చెబుతూనే వుంటారు. వాడు మనల్ని కిరసనాయిలు పోసి తగలేసేదాకా చెబుతూనే ఉంటారు. ఆ తర్వాత తీరిగ్గా కూచుని ఏడుస్తారు". శాంతి కోపంగా అంది. వాళ్ళక్క స్నేహితురాలి విషయంలో అలాగే జరిగింది.

"అంటే - సరైన నిర్ణయం తీసుకోవటం పెద్దాళ్ళకు కూడా తెలియదనేగా-"

"వాళ్ళకసలు తెలియదు" శాంతి సపోర్టు యధావిధిగా కొనసాగింది.

"అంటే ఏంటి? పెద్దలు కుదిర్చిన సంబంధం చేసుకున్నా కష్టాలు తప్పవు. ప్రేమించి పెళ్ళాడినా కష్టాలు తప్పవు. మరేం చెయ్యాలి?" రమకు విసుగూ, నీరసం వచ్చేశాయి.

"మన అదృష్టాన్ని మనం నమ్ముకోవాలి. షా ఎన్నడో చెప్పాడు పెళ్ళి లాటరీ అని" సుమతి తేల్చేసింది.

"అమ్మబాబో- నేను పెళ్ళిచేసుకోనుగాక చేసుకోను" రాణి అరిచి వెనక్కు పడిపోయింది.

"పెళ్ళి చేసుకోకపోతే వేరే రకం కష్టాలొస్తాయి" సుమతి రాణిని లేవదీసి మరీ భయపెట్టే ప్రయత్నం చేసింది.

"కష్టాలు - కష్టాలు కష్టాలు చంపుతారా ఏంటి?" రమ పెద్దగా అరిచింది.

"ఈ కష్టాల్ని తప్పించుకునే మార్గమే లేదా?" రాణి దీనంగా అడిగింది.

"ఉంది. ఒనిడా టి.వి. కొనుక్కుని అన్ని ఛానల్స్ కనెక్షన్ తీసుకుని పొరుగువాళ్ళను అసూయలో పడేస్తూ ఆనందంగా బతకొచ్చు".

సుమతి ఒక ప్రకటన యిచ్చి వనజ తన్నకముందే పక్కకు తప్పుకుంది.

"అబ్బా - ఊరుకోవే - వెధవ జోకులు. రేపొద్దున మనం యిళ్ళకు వెళ్ళగానే పెళ్ళి సమస్య సిద్ధంగా వుంటుంది. ఆ పెళ్ళి చేసుకోవటమా మానటామా? అమ్మో- నాకేం తెలియటం లేదు. దీనికంటే ఎంత క్లిష్టమైన ఫిజిక్స్ ప్రోబ్లం అయినా తేలిగ్గా సాల్వు చెయ్యొచ్చు" రమకు నిజంగానే భయం పట్టుకుంది.

వనజ అందరికీ కాస్త దూరంగా జరిగి బాసింపట్టు వేసుకుని యించుమించు బుద్ధుడిలా కూచుని అందరినీ నిశ్శబ్దంగా వుండమని సైగచేసింది.

"ఇదేదో ఉపన్యాసం యిచ్చేలా వుంది" సుమతి గొణిగింది. వనజ ఉపన్యాస ధోరణిలో కాక ఉపదేశ ధోరణిలో అన్నది.

"కష్టాలన్నీ తప్పించుకోవటంలోనే కష్టాల్ని కొని తెచ్చుకుంటున్నామని నాకనిపిస్తోందే".

అంత బరువైన వాక్యానికి అందరూ కాస్త కంగారు పడిపోయారు.

"అదేంటీ - ఏంటీ - నాకర్థం కాలేదు. సరిగా చెప్పిచావు" శాంతి హడావుడి పడింది.

"చెప్పాక కూడా చావను" స్థిరంగా అంది వనజ.

"పోనీ చావొద్దులే - పర్మిషన్ యిచ్చాను. బతుకు, ముందు చెప్పేదువు".

"చెప్పాక ఏడవను" మరింత స్థిరంగా అంది వనజ.

"ఒసేయ్–" పెద్దకేకవేసి వనజ జడపట్టుకుని వెనక్కు వంచింది శాంతి.

"అమ్మో– వదులు చెప్తా".

"చెప్పు".

"ఏంటో చాలా అర్థవంతమైన మాట, వివరించాల్సిన మాటా వక్కాణించాను. ఈ గందరగోళంలో అదంతా మర్చిపోయాను, ఏమన్నాను? ఏం చెప్పాలి?"

అప్పటిదాకా వీళ్ళ మాటల్ని వినటం తప్ప ఒక్క మాటకూడా మాట్లాడని సుజాత టక్కున చెప్పింది.

"కష్టాల్ని తప్పించుకుంటున్నామనుకోవటంలోనే కష్టాల్ని కొని తెచ్చుకుంటున్నామని నాకనిపిస్తోందే".

"దేశానికి ఏకసంథాగ్రాహులు యింత అవసరమని నాకింతవరకూ అర్థం కాలేదు - ఏకసంథాగ్రాహులు వర్థిల్లాలి - సుజాతా జిందాబాద్" రాణి తెగ ముచ్చటపడింది సుజాతను చూసి.

"దాన్ని చెప్పనివ్వండే మళ్ళీ మర్చిపోతుంది" శాంతి అందరికీ ఓ దణ్ణం పెట్టింది.

వనజ చెప్పటానికి సిద్ధపడినట్లు గొంతు సవరించుకుంది.

"కష్టాలు ఎలాగైనా వుంటాయే - సముద్రంలో అలల్లాగే - మనం ఎంత సేపటికీ వాటినుంచి దూరంగా వుందామని చూస్తాం. జీవితమంతా ఆ ప్రయత్నంలోనే గడిపేస్తాం.

తిరిగి చూసుకుంటే చివరికి యిదే పెద్ద కష్ట కనిష్ట నికృష్ట జీవితమనిపిస్తుంది. అట్లా కాకుండా కష్టాలతో తలపడ్డామనుకో వాటిని జయించామనుకో–"

"ఇక ఎప్పుడూ ఆ పోట్లాటే అవదా?" రాణిలో సుఖజీవి వనజకు అడ్డం పడింది.

"నన్ను చెప్పనియ్యి – కష్టాల్ని తప్పించుకోవటంలో మనకు ఆనందం దొరకదు. ఉదాహరణకు ప్రేమించిన వాడిని పెళ్ళాడితే కష్టాలొస్తాయని పెద్దలు చూసిన వాడిని పెళ్ళాడతాం. అక్కడ వాడు మంచివాడు కాకపోతే మనకు యింక ఆనందం అన్నమాటే లేదు. ఇక్కడ పెద్దలమీద తిరుగుబాటనే కష్టం వున్నా ప్రేమించినవాడితో ఆనందం దొరుకుతుందిగా".

"తర్వాత అతనూ మంచివాడు కాదని తేలితే"...

"అపుడు అతన్ని ఒదిలేసే కష్టానికి సిద్ధపడతామనుకో అపుడు దొరికే ఆనందం యింకా గొప్పది. అదీగాక మనంతట మనం పెళ్ళాడిన వాడిని మనంతట మనం ఒదిలెయ్యవచ్చు. పెద్దలు చూసినవాడనుకో యిక వాళ్ళ ఏడుపులు, మొత్తుకోళ్ళు – కుదరనే కుదర నివ్వరు".

"భర్తను ఒదిలేస్తే అన్నీ కష్టాలే గదే" రమ ప్రాబ్లంల కీలకాంశాన్ని చూసినట్టు చెప్పింది.

"అన్నిటినీ దాటుతూ ఆనందం పొందుతాం. ఇంతకు ముందు చెప్పిన ఉదాహరణ వల్ల ఏం రుజువయింది? మన కష్టాలు మనం దాటటం తేలిక, దానివల్ల ఆనందం దొరుకుతుందని తెలియటంలా. అదీగాక మనం ప్రేమించినవాడు మంచివాడయ్యే అవకాశం ఎలాగూ వుంది" వనజ మరి తిరుగులేదన్నట్లు చెప్పింది.

"ఆ అవకాశం పెద్దాళ్ళు కుదిర్చిన వాడికీ వుంది" రమ తీసి పారేసింది.

"కానీ అపుడు మనకింత ఆనందం రాదు. క్రెడిట్ అంతా పెద్దవాళ్ళకే పోతుంది" వనజ తన పట్టు ఒదల్లేదు.

"ఇంతకూ కష్టాలకు భయపడగూడదంటావు" రాణి నిష్ఠూరంగా అడిగింది.

"ఔను – అదే సత్యం" బుద్ధుడి ఫోజులోకి మళ్ళీ వెళ్ళింది వనజ.

"కానీ నాకు భయంగా వుందే. ఎలా ప్రిపేరవాలి?" రమ భయంగా అడిగింది.

"రోజూ నీ నడుం సన్నబడటానికి ఎంత కష్టపడుతున్నావు. నీ నడుం మీద పెట్టే శ్రద్ధ జీవితం మీద పెట్టు. వెన్నెముకకి బలం పట్టించు. బలంగా నిలబడతావు ఇక చూస్కో కష్టాల్ని ఒక్కో దెబ్బా కొట్టి ఓడిస్తున్న కొద్దీ నీకు కలిగే ఆనందం చెప్పలేనిది.

అమ్మో కష్టాలని భయపడితే - యిక అంతే. నిజంగానే యివాళా రేపూ ఆడాళ్ళకి కావాల్సింది సన్నటి నడుంకాదు. నిన్నటి నుంచీ రాధిక మాటలే నా మైండ్‌లో నాటుకు పోయాయి. ఆడవాళ్ళకు బలమైన వెన్నెముక కావాలి. మన కాళ్ళమీద మనం నించోగల శక్తినిచ్చే వెన్నెముక. మనం హోమో ఎరక్టస్‌లమని అనుక్షణం గుర్తుచేసే వెన్నెముక. అదుంటే మనం పసిఫిక్ మహాసముద్రంలో పడ్డా హాయిగా ఈదుకుంటూ ఒడ్డుకొచ్చి నిలబడొచ్చు".

"ఐతే నా సన్నటి నడుం గురించి మర్చిపోవాల్సిందేనా" దీనంగా అడిగింది రమ.

"మర్చిపోక పోతే దాన్ని తిప్పుకుంటూ దాని చుట్టే తిరుగు. ఎప్పుడో బొక్కబోర్లా పడతావు. అది కాస్తా విరుగుతుంది. మంచానబడి తీసుకుని తీసుకుని-" శాంతి కచ్చగా పలికింది.

"అమ్మో - ఆపవే. నేనిక డైటింగ్ చెయ్యను. బాగా తింటాను" రమ చేతులెత్తేసింది.

"తిని కొవ్వు పెంచుకోకు" శాంతి కోపం తగ్గలేదింకా.

"ఊహూ కండలు పెంచుతా. పెంచి నిన్ను మట్టికరిపిస్తా" శాంతి మీదకు దూకింది రమ.

శాంతి పక్కకు తప్పుకుంటే వనజ మీద పడింది.

"ఏడిశావుగానీ ముందు వెన్నెముకని గట్టిపర్చు".

"అసలు వెన్నెముక నిర్మాణం దానిలోని కణాలూ, నరాలూ ఏమిటి? వెన్నెముకకి బలం యిచ్చే ప్రొటీన్లూ, విటమిన్లూ ఏమిటి? ఇవన్నీ మనకు పాఠాల్లో వచ్చాయా? మర్చిపోయినట్లున్నాను" రమ కంగారు పడింది.

"అవన్నీ మనకు కావాల్సిన పద్ధతిలో ఎవరూ చెప్పరు. అట్లా చెప్పకపోవటం పెద్ద కుట్ర. చెప్తే మనం మన వెన్నెముకని గట్టిపర్చుకుంటాం గదా" వనజ సీరియస్‌గా అంది.

"మరి ఎట్లా తెలుస్తుంది మనకు?" రమ యధావిధిగా బిక్కముఖం పెట్టింది.

"మనమే తెల్సుకోవాలి. అసలు వెన్నెముక నిర్మాణం మనిషిలో మిగిలిన జంతువుల కంటే భిన్నంగా ఎందుకుంది? కాళ్ళు మాత్రం భూమ్మీద గట్టిగా ఆనించి చేతుల్తో పని చేసుకోవటానికి, కాబట్టి మన కాళ్ళమీద మనం నిలబడి, మనచేతుల్తో మనం పని చేసుకుని సంపాదించి తినటం కోసం వెన్నెముక నిర్మాణం జరిగింది. కాబట్టి ముందు మన తిండి కోసం మనం ఎవరిమీదా ఆధారపడకూడదు. అలా పడ్డ మరుక్షణం వెన్నెముక నిర్మాణం కుప్పకూలిపోతుంది.

ఆ వెన్నెముక బలంగా వుండాలంటే ముందు కావాల్సింది మన గురించి నిర్ణయాలు మనం తీసుకోగలగటం. అదే వెన్నెముకకు విటమిన్లు, ప్రోటీన్లు అన్నీను. అట్లా నిర్ణయాలు తీసుకుంటే మనకు చేతుల్నిండా పనుంటుంది. కాళ్ళకు సరిపడా తిరుగుడుంటుంది. అలా వాటిచేత పనిచేయిస్తున్న కొద్దీ వెన్నెముక బలపడుతుంది".

వనజ ఆయాసంగా ఆగి మంచినీళ్ళకోసం బొటనవేలు చూపించింది.

సుజాత యిక కబుర్లు వినదల్చుకోలేదు. "ఇక ఈ కబుర్లు ఆపి చదువుకోకపోతే పరీక్ష తంతుంది. అపుడు వెన్నెముక విరుగుతుంది. లేవండిక-" సుజాతతో పాటు అందరూ లేచారు. లేచిన రమ అలవాటు ప్రకారం అద్దంలో నడుంచూసుకోబోయి అటు యిటు చూసింది ఎవరైనా గమనించారేమోనని.

ఎవరూ గమనించకపోయినా రమకు తన నడుం చూసుకోవాలనిపించలా.

వెన్నెముక గురించి ఆలోచించాలనిపించింది.

*ఏప్రిల్ 1995*

ఆహ్వానం

# 6

# రాతిగుండెలు

అసుర సంధ్యవేళ. హాస్పిటల్ అంతా కలకలంగా వుంది. రోగులను చూడటానికి హడావుడిగా ఒస్తున్నారు బంధు మిత్రులు. కొందరు ప్రేమగా, రోగుల మీద దయతో వారి బాధలకు తామూ బాధపడుతూ ఒస్తున్నారు. కొందరు విసుగ్గా చిరచిరలాడుతూ ఈ డ్యూటీ యింకెన్నాళ్ళు చెయ్యాలోనన్నట్లు ఒస్తున్నారు. ఇంకొందరు రోగుల బాధలు తమకంటనంత దూరం – వారికీ, తమకూ మధ్య – వుందని తెలియజేస్తున్నట్లు మహా నిర్లిప్తతతో ఒస్తున్నారు.

సుశీల అందరినీ చూస్తోంది.

ఇవాళ తనకోసం ఎవరూరారు. రేప్పొద్దున అందరూ వస్తారు. భర్త, పిల్లలు, ముసలి తల్లిదండ్రులు, తమ్ముడూ, అందరూ వస్తారు. శంకరం మామయ్య కూడా వస్తాడేమో – అందరూ వచ్చాక ఆపరేషన్ చేస్తారు.

తన రొమ్ముల్ని చీల్చేస్తారు. కత్తిరించేస్తారు. అవతల పారేస్తారు.

ఆ తర్వాత ఏం జరుగుతుంది?

ఏమో – ఇన్నాళ్ళూ ఆ గుండెలు తనతోనే వున్నా వాటిమీద తనకేం ప్రేమ లేదు.

అవి తననుంచి పరాయివి అయిపోయి చాలా కాలమే అయింది.

ఇప్పుడు పూర్తిగా తననుంచి వేరయిపోతాయనుకుంటే –

ఏమో – ఎలా వుంటుందో ఆ జీవితం – బాధ ఎందుకుపడాలో అర్థం కావటం లేదుగానీ నీళ్ళు చల్లిన పొయ్యిలోంచి వచ్చే పొగలాగా ఆలోచనలు ఒక్కసారి వచ్చి మళ్ళీ వెంటనే పోతున్నాయి.

వస్తూపోతూ, వస్తూపోతూ, బాధా, దిగులూ –

బాధా, దిగులు ఎందుకు? ఎందుకు?

ఈ రెండింటి అడుగునా ఏదో ఒక నిశ్చింత – ఒకానొక బాధారహిత స్థితి కూడా అనుభూతమవుతోంది.

ఎందుకు? ఎందుకది? తన మీద కసి తీరబోతోందనా?

లోకం మీద తనకున్న కసి తీరబోతుందనా?

కసి తీరటానికి ఏమన్నా అర్థం వుందా? లేదు–ఒద్దు.

"ఏమిటివాళ ఎవరూ రాలేదా?"

డాక్టర్ హేమ నవ్వుతూ వచ్చింది.

"ఇవాళ రారు డాక్టర్ – రేప్పొద్దునే వస్తారు".

సుశీల కళ్ళల్లో దిగులు చూసి హేమ దయగా నవ్వింది.

హేమ కళ్ళల్లో దయ చూస్తే సుశీలకు ఆమెను గట్టిగా కావలించుకుని ఏడవబుద్ధేస్తుంది.

ఆ పని చేయలేక సుశీల హేమకళ్ళ నుండి చూపులు తిప్పుకుంది. "భయపడు తున్నావా?" సుశీల చేతిని తన చేతిలోకి తీసుకుంది హేమ.

లేదన్నట్లు తలూపింది సుశీల.

"ఈ ఆపరేషన్ చేయించుకోవటం మనకు కష్టమే. కానీ తప్పదుగదా. జీవితం మనకు ఏమిచ్చిందో దాన్ని స్వీకరించి దానితోనే తృప్తిగా బతకటం నేర్చుకోవాలి. పుట్టుగుడ్డి వాళ్ళున్నారు. యవ్వనంలో యాక్సిడెంట్‌కి గురై కాళ్ళూ, చేతులూ పోగొట్టుకుని బతుకుతున్న వాళ్ళున్నారు. వాళ్ళందరి కంటే రొమ్ములు పోగొట్టుకున్న ఆడదాని స్థితే దుర్భరమంటావా? కాదుగదా?".

"లేదు డాక్టర్. నాకు దిగులు లేదు".

హేమ మళ్ళీ దయగా నవ్వింది.

"దిగులు లేదని దాన్ని అణిచేసే కంటే వున్న దిగులు పంచుకుంటే మనసు తేలిక పడుతుంది. ధైర్యం వస్తుంది. ఆపరేషన్‌కి ముందు నీతో మాట్లాడాలనే వచ్చాను. ప్రతివాళ్ళతో కాసేపిలా మాట్లాడటం నాకు అలవాటు. ఇంకో రెండు గంటలు నేను నీతోనే ఉంటాను. అలా బైటికెళ్ళి కూచుందామా?"

సుశీల నెమ్మదిగా లేవటానికి సహాయపడింది హేమ.

ఇద్దరూ బయట వరండాలోకి వచ్చి అక్కడున్న కుర్చీల్లో కూచున్నారు.

చీకటి ముసురు కొచ్చేస్తోంది. దీపాల వెలుగులో ఆసుపత్రిని పగటిపూటకంటే ఎక్కువగా ఒంటరితనం దిగులు ఆవరించుకున్నాయి.

"చెప్పు. మీ ఆయన ఏమంటున్నాడు?"

"ఆయన ఏమన్నా నేను బాధపడను డాక్టర్ – అసలాయనేం అనటంలేదు".

"నీకు ఏమనిపిస్తోంది? మన శరీరంలో ఒక ముఖ్య భాగాన్ని కత్తిరించి వేస్తుంటే – అందులో–"

హేమ మాటల్ని ఆపేసింది సుశీల.

"డాక్టర్, మీకు తెలుసా? నేను చాలా సార్లు ఈ రొమ్ముల్ని కత్తిరించేసుకోవాలనుకున్నాను. అందుకే నాకీ కాన్సర్ వచ్చిందేమో – అలా వస్తుందా?"

"రాదు–కాని అట్లా ఎందుకనుకున్నావు?"

"మీరెప్పుడూ అట్లా అనుకోలేదా? మీ గుండెల మీద మీకెప్పుడూ కోపం రాలేదా?"

సుశీల హేమ కళ్ళల్లోకి సూటిగా చూసింది.

"నువ్వు చెప్పు సుశీలా – ఇవాళ నువ్వు మాట్లాడు. ఇంకోసారి నాకు బాగా దిగులనిపించినపుడు నేను మాట్లాడతాను. ఇవాళ నీకు చెప్పాలనిపించిందంతా చెప్పు. నీ గుండెల్లో జ్ఞాపకాలన్నిటినీ బైటికి రానివ్వు. నేను డాక్టర్‌నని మర్చిపో – ఒక ఆడదానిగా స్నేహితురాలిగా చూసి చెప్పు".

డాక్టర్ హేమ సుశీలతో మాట్లాడటం చూసి నర్సులు "చూశావా" అన్నట్లు ఒకరికొకరు సైగలు చేసుకున్నారు.

రొమ్ము కాన్సర్‌కు గురై వచ్చిన ఆడవాళ్ళతో స్నేహాన్ని హేమ తన జీవితంలో చాలా విలువైనదిగా భావిస్తుంది. ఈ ఆడవాళ్ళు హేమతో ఎవరితో చెప్పుకోని తమ భయాలు, బాధలు, ముందు జీవితంలో వచ్చే మార్పులు – వీటన్నిటి గురించి మాట్లాడుతారు. హేమ వారికి ధైర్యాన్నిస్తుంది.

మరునాటి ఆపరేషన్‌కి వారిని శారీరకంగా సిద్ధం చేయటం ఎంత ముఖ్యమో వారికి మానసికంగా బలాన్నివ్వటం కూడా అంత ముఖ్యమేనని హేమ నమ్ముతుంది.

తన ఎదురుగా స్నేహితురాలిలా కూచున్న హేమను చూస్తుంటే సుశీలకు చెప్పాలనిపించింది.

తనకు ఊహ వచ్చినదగ్గర్నించీ తన గుండెలు తనకు పరాయివి అయిన విధమంతా సుశీలకు ఒక్కసారి గుండెల్లోకి తన్నుకొచ్చింది.

అమ్మ తమ్ముడికి పాలిస్తున్న అపూరూపు దృశ్యం.

చిన్నప్పుడు తనకు ఆడదాని రొమ్ముల గురించి వున్న ఒకే ఒక అందమైన జ్ఞాపకం.

అమ్మ తమ్ముడికి పాలిస్తుంటే ఐదేళ్ళ వయసున్న తను అక్కడ్నించి కదిలేది కాదు. ఏ ఆటలో వున్నా అమ్మ దగ్గరకు వచ్చేది. గదిలో, వరండాలో, పెరట్లో, దీపం వెలుగులో, వెన్నెల కాంతిలో, లేత ఎండలో అమ్మ తమ్ముడికి ఎప్పుడు ఎక్కడ పాలిస్తుంటే ఆ స్థలమంతా సుశీలకు ఎంతో అందంగా కనిపించేది. మనసు చాలా హాయిగా, శాంతిగా, స్థిమితంగా మారేది. అమ్మవేసే కేకలూ, తిట్లూ, తన్నులూ ఏవీ ఆ సమయంలో జ్ఞాపకం వచ్చేవి కావు.

ఆ తర్వాత చాలా రోజుల వరకూ సుశీలకేం గుర్తులేదు. తన రొమ్ముల గురించి సుశీల ఆలోచించలేదు. అవీ తనూ వేరన్నట్లు ప్రత్యేకంగా వాటిని గమనించనూలేదు. సుశీలే కాదు ఎవరూ పట్టించుకోలేదు.

చదువులతో, ఆటలతో, స్నేహాలతో, నవ్వులతో, ఏడుపులతో, పండుగలతో బాల్యం గబగబా దొర్లిపోతోంది.

అయ్యో – పోనే పోయింది.

ఆ రోజు – సుశీల ఎన్నటికీ మర్చిపోలేని ఆ రోజు.

క్లాసంతా నిశ్శబ్దంగా వుంది. అందరూ తలలు పుస్తకాల్లో కూరి లెక్కలతో కుస్తీ పడుతున్నారు. మాస్టారు క్లాసంతా తిరుగుతున్నారని మెత్తని అడుగుల సవ్వడి వల్ల తెలుస్తోంది. సుశీల గబగబా లెక్కలు చేస్తోంది. ఒక్కొక్క స్టెప్పే వేస్తున్న కొద్దీ, లెక్కల్లో చిక్కు తీరుతున్న కొద్దీ ఉత్సాహం యినుమడించి మరింత వేగంగా చేతిలో పెన్సిల్ కదులుతోంది. యుద్ధరంగంలో నేల ఈనినట్లు పుట్టుకొచ్చే సిపాయిల్లా తెల్లని కాగితం మీద అంకెలు పుట్టుకొస్తున్నాయి. లెక్క పూర్తి చేసేందుకు సుశీల బుర్రలో పుట్టుకొస్తున్న ఆలోచనలు వువ్వెత్తున తీరాన్ని చేరటానికి వచ్చే అలల్లాగా సందడి చేస్తున్నాయి. ఆ సందడంతా సుశీల ముఖం చూస్తేనే తెలిసిపోతుంది. పెదాలు కొద్దిగా ముడిచినా

ముఖంలో విజయహాసం దాగటంలేదు. కళ్ళూ, చేతిలో పెన్నూ, మెదడులో ఆలోచన– మూడిటి మధ్యా చక్కని సహకారం కుదిరింది. ఏకాగ్రతకు మారుపేరులా వున్న సుశీల చటుక్కున ఆగి తలెత్తి వెనక్కు చూసింది.

తన వీపుని తడుముతూ మాస్టారి చెయ్యి.

అనాలోచితంగా లేచి నిలబడింది.

"ఇంకా బ్రా వేసుకోవటం లేదేం? పెద్దదానివవుతున్నావు. ఆ ఒదులు జాకెట్టేసుకు ముందుకి వంగితే".

మాస్టారు వెకిలి నవ్వుతో కూడిన ముఖం చూడటం తప్ప ఆయన గుసగుసగా చెవిలో అంటున్న మాటలు సుశీలకు వినపడటం మానేశాయి.

"ఇక ఓణీలేసుకోవాలి".

మాస్టారు ముందుకెళ్ళిపోయాడు.

సుశీలకు అవమానంతో ముఖం ఎర్రబడి కళ్ళవెంట నీళ్ళొచ్చాయి. మెదడులోంచి లెక్కలు, అంకెలు, ఆలోచనలు అన్నీ మాయమయ్యాయి. లెక్క చేస్తున్నపుడు వికసించి విస్తరించిన చైతన్యం సిగ్గుతో కుంచించుకుపోయింది. ముడతలు ముడతలు పడిపోయింది. ఒళ్ళంతా మంటలు లేచి దహించుకుపోతోంది.

సిగ్గు, అవమానం, దీనత్వం అన్నీ కలగలసిన చూపు సుశీల కళ్ళల్లో ఆ రోజే ప్రవేశించింది.

మెదడంతా శూన్యంగా ఉంది. పుస్తకంలో అంకెలు కందిరీగల్లా భయపెడుతున్నాయి. వాటికిపుడు ఏ అర్థమూ లేదు. సుశీల భయం భయంగా కళ్ళు కిందికి వాల్చి తన జాకెట్ వంక చూడబోయి ఉలిక్కిపడి తలపైకెత్తింది. ఎవరైనా గమనించారా అని అటూ ఇటూ చూసింది.

సాయంత్రం వరకూ దిగులు దిగులుగా క్లాసులో కూచుని ఇంటి కొచ్చింది. అమ్మతో ఈ సంగతెలా చెప్పాలో అర్థం కాలేదు. ఇంతలో శంకరం మామయ్య ఒచ్చాడు.

మామయ్యంటే సుశీలకు తగని చిరాకు. రాగానే తనని లాక్కుని ఒళ్ళో కూచోబెట్టు కుంటాడు. ఆటలకు వెళ్ళనివ్వడు. "ఏంటే కొంప మునిగినట్లు ముఖం పెట్టుకు కూచున్నావు?" అంటూ వచ్చి సుశీలను చెయ్యి పట్టి దగ్గరకు లాక్కున్నాడు. సుశీల దూరం జరుగుతూ శంకరం చేతిని విసిరి కొట్టింది. శంకరం సుశీల గడ్డం ఎత్తి ఏంటన్నట్లు తమాషాగా కళ్ళెగరేశాడు. ముడుచుకొని వున్న సుశీల మూతిపై చటుక్కున ముద్దు పెట్టాడు. సుశీల చీదరింపుగా తల వెనక్కి లాక్కొనేలోపే శంకరం చేతులు

సుశీల గుండెలమీద పడ్డాయి. సుశీల నొప్పితో కెవ్వుమనబోయి భయంతో నోరు మూసుకుంది. శంకరం వెకిలిగా నవ్వుతూ-

"ఇంకా బాడీలు వేసుకోవటం లేదే - పెద్దదానివైపోతున్నావు" అంటూ సుశీలను పైకెత్తి ఆమె లేత గుండెలను తనకేసి అదుముకుని ఒదిలేశాడు. ఏం జరగనట్టు "అక్కా" అంటూ పిలుస్తూ లోపలికి వెళ్ళాడు.

సుశీల డాబామీదకు వెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది. మామయ్య రాక్షస హస్తాల తాకిడికి మంటపెడుతున్న గుండెల్ని చూసుకుని ఏడ్చింది. పెద్దవుతున్న తన గుండెల్ని తిట్టుకుంటూ శపించుకుంటూ ఏడ్చింది. భయం, అవమానం గుండెలనిండా నిండగా వూపిరాడనంతగా ఏడ్చింది సుశీల.

మర్నాడు బాడీ వేసుకోకుండా స్కూలుకివెళ్ళాలనిపించలేదు. తలనొప్పనే వంక పెట్టి ఇంట్లోనే ఉండిపోయింది. అమ్మ బాడీ ఒకటి తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళి వేసుకోవాలని ప్రయత్నించింది. కుదరలేదు.

అమ్మ పని అయ్యాక బియ్యం ఏరుతూ కూచుంటే వెళ్ళి పక్కన కూచుంది.

"అమ్మా - నిన్న మా టీచరు బాడీ వేసుకోమన్నారు" మాస్టారు చేసినపని చెప్పకుండా ఎందుకు దాచిందో సుశీలకు ఈనాటికీ అర్థంకాదు.

తల్లి చిరాకు పడింది.

"మీ టీచరికింకో పనిలేదూ? పదకొండో ఏటనే మొదలు - ఛీ - అసలు ఆడపుటక పుట్టనే కూడదు - ఇక ఒక్కోటీ వరసగా మొదలు" గొణుక్కుంటూ కూచుంది. మొదటి సారి ఓణీ వేసుకున్న రోజు కూడా సుశీలకు బాగా గుర్తే -

మేనమామగా శంకరమే ఓణీలు తెచ్చాడు. సుశీలతో ఆడవలసిన సరసాలన్నీ వికృతంగా ఆడేశాడు.

సుశీలకు ఆ ఓణీ శంకరం మామ మెడకు బిగించి చంపాలనిపించింది.

అత్త కనకదుర్గను చూస్తే మళ్ళీ జాలేసింది. అత్త చాలా మంచిది. మామయ్య ఎంత ఏడిపించినా ఓర్చుకుంటుంది. నవ్వుతూ వుంటుంది. అత్తయ్యే సుశీలకు ఓణీ వేసుకోవటం నేర్పింది. పమిట జారకుండా భుజం మీద నిలపాలని చెప్పింది. అడుగున బాడీ, పైన జాకెట్, దాని మీద పొరలు పొరలుగా ఓణీ మడతలు పేరుకున్నాయి. వీటన్నిటినీ చీల్చుకుంటూ శంకరం మామయ్య చూపులు లోపలికి గుచ్చుకుంటూనే చీల్చుకుంటూనే ఉన్నాయి. 'శంకరం మామయ్య కళ్ళు పొడిచేస్తే ఈ ఓణీ విప్పి అవతల పారేయొచ్చు' అనుకుంది సుశీల.

ఓణీ కొంగు శంకరానికే కాదు, పక్కింటి పిన్నిగారి భర్తకూ వీధిలోని ఆకతాయిలకు కూడా అనువుగా దొరికింది. ఆ రోజు పక్కింటి పిన్నిగారి కోసం వాళ్ళింటికి వెళ్తే - ఇంట్లో అతనొక్కడే వున్నాడని గమనించి భయంతో గిరుక్కున వెనక్కు తిరిగింది.

వెనకాల పొడుగ్గా వేలాడే పమిటను పట్టుకుని దగ్గరకు లాక్కున్నాడు అతను.

పమిట తీసి కింద పడేసి తనను కదలనివ్వకుండా పట్టుకుని -

సుశీల ఎక్కడ లేని ధైర్యము తెచ్చుకుని అతని మెడమీద ఓ పిడి గుద్దు వేసింది. అతను నివ్వెరపోయి తన గుండెలమీద నుంచి చేతుల్నీ ముఖాన్నీ తీస్తే ఆ లోపలే ఓణీ లాక్కుని బయటకు పరిగెత్తింది.

ఆ తర్వాత సుశీల ఎప్పుడూ ఎవరింటికీ తోడు లేకుండా ఒక్కతే వెళ్ళలేదు. మగాళ్ళని చూసి చీదరించుకోకుండా వుండలేదు.

ఇంకొక రోజు– స్నేహితురాలి ఇంటికి వెళ్ళి అక్కడ ఆమె సల్వార్ కమీజా రహస్యంగా వేసుకున్న రోజు–

తన ఇంట్లో ఆ దుస్తులు వేసుకోనివ్వరు. వాటి పేరు ఎత్తనివ్వరు. అవి బరితెగించిన పిల్లలు వేసుకునేవి. ఇంటి పరువు గంగలో కలిపే ఆడపిల్లలు వేసుకునేవి.

స్నేహితురాలి ఇంట్లో తన లంగా ఓణీ తీసి, బ్రా మీద బాడీస్ వేసుకుని సల్వార్ కమీజు వేసుకుని దాని మీద చున్నీ వేసుకుంది. చున్నీని గుండెలమీద పొరలు పొరలుగా పేర్చుకొని భుజాలమీద పిన్నీసులు పెట్టుకుంది. అద్దంలో చూసుకుంటే ఎంతో అందంగా కనిపించింది తన రూపం. స్నేహితురాలు కూడా బాగుందని మెచ్చుకుంది.

ఇద్దరూ సందడిగా యిల్లంతా తిరిగారు.

పెరట్లో పరుగులు తీసి అలసిపోయాక స్నేహితురాలు తింటానికి ఏదన్నా తెస్తానని వంటింటిలోకి వెళ్ళింది.

ఆయాసం తీర్చుకుంటూ కూర్చుంది సుశీల. పరుగువల్ల గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

హఠాత్తుగా ఆగింది గుండె.

వెనక నుంచీ రెండు చేతులు. ఉక్కు చేతులు–

చున్నీకింద, సల్వార్ మందం కింద, బాడీస్ భద్రత కింద "బ్రా" రక్షణలో వున్న గుండెలను గట్టిగా పిండుతున్నాయి. సుశీల గట్టిగా అరిచింది. మరునిముషం ఆచేతులూ మనిషీ మాయం.

సుశీలకది కలో నిజమో అర్థం కాలేదు. ఎవరు? ఎవరు? స్నేహితురాలితో చెప్పలేక చెప్పింది.

"ఇంట్లో మా బాబాయి తప్ప ఎవరూ లేరు. బాబాయి అలా చేస్తాడా?" ఆలోచనలో పడిందా పిల్ల.

సుశీల ఏడుస్తూ ఆ బట్టలు విప్పి తన లంగా ఓణీ కట్టుకుని ఇంటికి వచ్చింది.

అవమానంతో రాత్రంతా ఏడుస్తూనే ఉంది. మగాళ్ళను ఆకర్షించే తన గుండెల్ని తిట్టుకుంటూ ఏడ్చింది. మరింత జాగ్రత్తగా చీరె కట్టుకోవటం నేర్చుకుంది సుశీల. పమిట జారకుండా, ఒంటిపొర పడకుండా, ఎంత జాగ్రత్తపడ్డా ఏం లాభం. మగవాళ్ళ చూపులన్నీ అక్కడే పాకుతుంటే – ఆ చూపులను అసహ్యించుకుంటూ, తన గుండెలను అసహ్యించుకోవటం అలవాటయింది సుశీలకు.

బస్సులో ఎక్కితే ఎలాగోలా అక్కడ తాకాలని ఆరాపడే చేతులూ, శరీరాలు–

సైకిల్‌పై పోతూ పోతూ ఒక్కసారి ఆడపిల్ల గుండెల్ని తాకిపోయే వికృతపు చేతులు–

ఆటో పక్కగా నడిచివెళ్తుంటే హఠాత్తుగా లోపల్నించి బైటికి వచ్చి విసురుగా గుండెలమీద కొట్టిపోయే చేతులు–

సుశీలకు ఒకోసారి నిగ్రహించుకోలేనంత కోపం వచ్చేది. "ఒరే కుక్కల్లారా–" అని తిడుతూ వాళ్ళని చిత్రవధ చేయాలనిపించేది.

అంత కోపాన్నీ దిగమింగుకుని బతకటం వల్ల తనకేదో అపకారం జరుగుతుందని అనిపించేది గానీ ఏం చెయ్యాలో తెలిసేది కాదు. గుండెలవిసేలా ఏడ్చినా, ధగద్ధాళిగా గుండెల్ని మండించుకున్నా ప్రయోజనం లేదు.

చివరికి తనకు గుండెలే లేనట్లు, తనకు స్పర్శే లేనట్లు మొద్దుబారిపోయింది. ఇంట్లో, వీధిలో, బస్సులో, రైల్లో ఎక్కడ ఎలాంటి చూపులూ తననింక బాధించలేనంతగా ఎలాంటి తాకిడీ తనలో చలనం కలిగించలేనట్లుగా మొద్దుబారిపోయింది.

స్పర్శ లేదు. సున్నితత్వం లేదు. పులకరింత లేదు. జలదరింపు లేదు. రాతి బొమ్మయి పోయింది. గుండెలు రాతి బండలైపోయాయి.

పెళ్ళయ్యాక భర్త తన గుండెల్ని తాకుతుంటే సుశీల చీదరింపుగానే చూసింది. అతను మొరటుగా మూర్ఖంగా సుశీలను పట్టించుకోకుండా, సుశీల నుండి ఆమె గుండెలు వేరైనట్లు అవి ఆమెకు సంబంధించినవి కావన్నట్లు ఆమె గుండెల్ని పిండేశాడు. సుశీల మరింత అవమానంతో దహించుకుపోయింది. తన శరీరంతో భర్త ప్రవర్తించే

తీరుకీ, తనను బట్టల్లేకుండా చూడాలని అతను పడే ఆత్రుతకి ఆమె మనసు అసహ్యంతో ముడుచుకుపోయింది.

జీవితమంతా యితన్తో యిట్లా వుండక తప్పదనుకుంటే వెంటనే చచ్చిపోవాలని పించింది.

ఐతే తనకా చావు త్వరలోనే అలవాటయింది. రోజూ ఒకసారి చావటానికి బతుకుతూనే ఉంది.

ఇంతలో సుశీల తల్లి అయింది.

సుశీలకు అంతవరకూ చావు మాత్రమే తెలుసు. తల్లి అయినపుడు నరకం కూడా చూసింది. నొప్పి భరించలేక జంతువులా అరిచింది.

పదిమంది హవుస్ సర్జన్లకు తన కేసు చూపిస్తూ పాఠం చెబుతున్న ప్రొఫెసర్‌ని చూస్తుంటే ఎక్కడో మానాభిమానాలన్నీ పోయినట్లు బిక్కచచ్చి పోయింది.

నొప్పులొకపక్క శరీరాన్ని చీలుస్తుంటే–

రక్తం ఆగకుండా స్రవిస్తున్న స్పృహ భయపెడుతుంటే –

తన శరీరాన్ని ఆక్రమించుకున్న జీవి ఆ శరీరం మీద దౌర్జన్యం చేసి బయట పడుతుంటే–

ఆ అనుభవమొక చిత్రహింసల కొలిమై సుశీలను కాల్చివేసింది.

పుట్టిన బిడ్డను తెచ్చి నర్సు తన రొమ్ముల దగ్గరపెట్టి పాలివ్వమని చెబుతుంటే అయోమయంగా చూసింది సుశీల. ఎక్కడో ఏ ఆదిమయుగాల అనుభూతో ఎక్కడినుంచో చీల్చుకుని తనమీదకు దూకుతున్న అనుభూతి.

ఒక సాయంత్రపు నీరెండలో జామచెట్టుకింద అమ్మ తమ్ముడికి పాలిస్తుంటే సర్వం మరిచి చూసిన ప్రశాంత క్షణాల అపురూపత ఎక్కడినుంచి వచ్చి తనను చుట్టేసిందో సుశీలకు తెలియదు.

రొమ్ములనుంచి పాలు, కళ్ళనుంచి నీళ్లూ ఉబికి వచ్చాయి. పిల్లవాడు తృప్తిగా, ఆనందంగా, శాంతంగా పాలు తాగుతున్నాడు. క్రూరత్వమూ, క్షుద్రానందమూ, హింసాపరత్వమూ లేని బిడ్డ స్పర్శకు సుశీల గుండెలు మొదటిసారి స్పందించాయి.

ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు.

తను పిల్లవాడికి పాలెప్పుడు యిస్తుందా అని కాచుక్కూచున్నట్లు ఆ సమయంలో దగ్గరకొచ్చి చూసే బావను చూస్తే – మనసు చిరాకుగా చీదరగా అయ్యేది.

ప్రసవించి నెల పూర్తవ్వగానే భర్త హడావుడి చేసి అత్తింటికి ప్రయాణం కట్టించాడు.

రైల్లో బిడ్డకు ఏ ఇబ్బంది లేకుండా అన్నీ సర్దుకుంది. మెత్తని గుడ్డలు, దూది, నీళ్ళూ, బోలెడు పాత గుడ్డలూ అన్నీ బుట్టలో పెట్టింది.

రైలు కూతకి బిడ్డ భయపడకుండా చెవుల్లో దూది పెట్టింది. రైలు కదులుతుంటే బాబు నిద్రపోయాడు.

పక్క స్టేషన్‌లో ఆగితే ఆకలికి లేచి సుశీల గుండెల్ని తడుముతున్నాడు. ఏడుస్తున్నాడు.

"పిల్లాడికి పాలివ్వమ్మా" యాభై ఏళ్ళ వ్యక్తి గొంతులో కుతూహలం.

ఎదురుగా, పక్కనా కూచున్న కళ్ళన్నీ ఒక్కసారిటు తిరిగాయి.

ఏమీ సంకోచం లేకుండా, సిగ్గు లేకుండా, జంకు లేకుండా సుశీల గుండెల్ని చూడటానికి సిద్ధంగా కూచున్నట్లున్నారు.

సుశీలకు బిడ్డకు పాలివ్వాలనిపించలేదు.

పిల్లాడికి ఏడుపు ఎక్కువవుతోంది.

"పాలివ్వు- ఏం చేస్తాం, పమిట నిండుగా కప్పుకుని ఇవ్వు" భర్త కోపంగా గొణిగాడు.

సుశీల జాకెట్ హుక్సు విప్పి రొమ్ము బిడ్డ నోట్లో పెట్టింది. పమిట నిండుగా కప్పింది. చెమటకు చిరాకు పడుతున్నట్లు పిల్లాడు ఆ పమిటను చేత్తో, కాళ్ళతో తంతూ పాలు తాగుతున్నాడు.

సుశీల కళ్ళెత్తి చూసింది. చూపులన్నీ అక్కడే – నంగిగా, దొంగగా, ఆబగా – పిల్లాడికి పాలిస్తున్న తల్లిని వెకిలిగా చూడగలిగిన తమ సంస్కారాలకు సంబర పడుతున్నట్లు–

సుశీల హఠాత్తుగా పమిట తీసేసింది రెండవ రొమ్ము జాకెట్లో నుంచి బైటపడింది. ఉలిక్కిపడ్డా వెంటనే సర్దుకుని కళ్ళప్పగించి చూస్తున్నారు.

సుశీల భర్త సుశీల డొక్కలో ఓ పోటు పొడిచి "పైట వేసుకో" అన్నాడు.

సుశీల కళ్ళు మూసుకు కూచుంది.

భర్త పెద్దగా అరిచాడు. కొట్టాడు. సుశీల కళ్ళు తెరవలేదు. భర్తే పమిట వేసి పిల్లాడిని తీసుకున్నాడు. రైలు ఆగాక సుశీల స్పృహలో లేనట్లు కూచుంటే భర్తే దించాడు.

అత్తగారు జరిగినదంతా విని సుశీలకు గాలి సోకిందని తాయత్తు కట్టించింది.

"నీ పుటకలకి నాకూ యిలాగే జరిగింది. మధ్యాహ్నం నీకు పాలిస్తున్నాను. అందరూ అక్కడే వున్నారు. ఎందుకు నవ్వుతున్నానో తెలియకుండా పకపకా నవ్వాను. ఏంటంటే చెప్పకుండా నవ్వుతూనే వున్నా – ఎంతసేపున్నా ఆపటం లేదు. అరగంట దాటుతుంది

– మా అమ్మ ఎరుకలదాన్ని పిల్చుకొచ్చి ఏదో మంత్రం వేయించింది. అది నాకిక్కడవాత పెడితే అపుడు అణిగింది నవ్వు" అని మణికట్టు మీద వాత చూపించింది. గాలి మాట నిజమే అన్నారందరూ. లేకపోతే సుశీలకు పాలు హఠాత్తుగా లేకుండా పోతాయా? పిల్లవాడు ఎంత చీకినా చుక్క పాలు రాలేదు. పోతపాలకు అలవాటు పడ్డాడు.

పాలు ఎందుకు పడటం లేదో సుశీలకు తెలుసు. తనలో రగిలిన ద్వేషం, కోపం ఆ పాలను యింకించాయని సుశీల నమ్మింది.

పిల్లవాడి నోట్లో మొదటిసారి పాలసీసా పెడుతున్న సుశీల గుండెల్లో సముద్ర ఘోష

"నీకు పాలిచ్చి పెంచలేనందుకు నన్ను క్షమిస్తావో లేదో గాని నాన్నా –

నా కన్నబిడ్డకు పాలిచ్చి పెంచుకోకుండా చేసినందుకు నీ జాతిని మాత్రం నేను క్షమించనురా–".

సుశీల శరీరంలో యింకిన పాలన్నీ కన్నీళ్ళై స్రవహించాయి.

"నా ఇద్దరు పిల్లలకూ పాలివ్వలేదు డాక్టరు గారూ. అందుకే నాకీ జబ్బు వచ్చిందేమో– నిజంగా రొమ్ములు తీసేస్తారంటే నాకు దిగులు లేదు. వీటితో నాకున్న సంబంధంలో ఆనందమేమీ లేదు. చచ్చిపోతానేమోనన్న భయం తప్ప మరో భయంలేదు".

హేమ కన్నీళ్ళు తుడుచుకుంటూ నవ్వే ప్రయత్నం చేసింది.

"లేదు. నీకేం భయంలేదు. నీ రొమ్ముల్లో పాకుతున్న కాన్సర్‌ని తీసేసి శుభ్రం చేసి నీకు ఆరోగ్యాన్ని యిస్తా. దాని గురించి నీకు భయం అక్కర్లేదు. నువ్వు చచ్చిపోవు–

కానీ మనందరం భయపడాల్సిన కాన్సర్ సమాజంలో ముదిరిపోయిందే – దాన్నేం చెయ్యాలి – ఎట్లా నరకాలి – ఆ కాన్సర్ తాకిడి మనందరికి సమానమే – దానికేం చెయ్యాలా అని"

హేమ లేచింది. సుశీల హేమ చెయ్యి పట్టుకుని –

"చెప్పండి – పిల్లలకు పాలివ్వకపోతే కాన్సర్ వస్తుందటగా నాకందుకే వచ్చిందా?"

"లేదు – అందుకు రాలేదు నీ కాన్సర్ – నిజంగా నన్ను నమ్ము".

సుశీల ముఖంలోకి కాస్త వెలుగొచ్చింది.

అముద్రితం

# 7

# అయోని

నేనీ కథ యివాళ ఎందుకు రాయటం మొదలు పెట్టానో ఆ కారణమే ఈ కథ. నాకు కథలంటే చాలా యిష్టం. ఆరుబయట ఆకాశం కింద మంచం వేసుకుని, అమ్మమ్మ పక్కలో పడుకుని పరుగెత్తే చందమామను చూస్తూ అమ్మమ్మ చెప్పే కథలు వింటూ నిద్రపోయేదాన్ని.

వర్షపు రాత్రుల్లో మా అమ్మమ్మ గొంతు చిటపట చినుకుల చప్పుడులోంచి వినబడుతుంటే వెచ్చగా దుప్పటి కప్పుకుని, అది చాలక యింకా అమ్మమ్మ డొక్కలోకి దూరిపోయి కథలు వినేదాన్ని. చలికాలపు రాత్రులన్నీ మా అమ్మమ్మ కథల్లో తెల్లవారిపోయేవి. ఎండాకాలపు రాత్రులు ఆ కథలకు చాలేవి కావు. నాకు అక్షరాలు రాయటం, చదవటం వచ్చాక తెలుగు వాచకం నా అంతట నేను చదువుకోగలిగినపుడు నేను మొదటి కథ రాశాను. ఆ కథ నాకిప్పుడు గుర్తులేదు. తర్వాత మా నాన్న ఎంతో యిష్టంగా తెచ్చి నా చేత చదివించే 'చందమామ' రెండు సంవత్సరాల పాటు చదివాక, నా తొమ్మిదోయేట నేనొక కథరాసి 'చందమామ'కు పంపాను. అది ఎన్నాళ్ళకీ అచ్చుకాలేదు. ఈ సంగతి ఎవరికీ తెలియదు. మా నాన్నకూ, అమ్మకూ, అమ్మమ్మకూ

ఎవరికీ చెప్పలేదు. నా స్నేహితురాలు రాధారాణికి కూడా చెప్పలేదు. ఆరేడు నెలలపాటు ఆకథ అచ్చవుతుందని ఎంతగానో ఎదురుచూశాను. తర్వాత యిక ఆసంగతి మర్చిపోయాను. ఇప్పుడు... ఆ కథ రాసిన మూడేళ్ళ తర్వాత... నాకు మళ్ళీ కథ రాయాలనిపించినపుడు ఆ చందమామ కథ గుర్తొచ్చింది. ఆ కథకూ యిప్పుడు నే రాయబోయే కథకూ ఏమీ సంబంధం లేదు.

ఆ కథ ఎంత మంచి కథ. అ కథలో మనుషులు ఎంత మంచి వాళ్ళు. అందమైన తెల్లని రెక్కలతో తమ మధ్యకు దిగివచ్చిన పక్షిరాజకుమార్తెను ఎంత అపురూపంగా చూసుకున్నారు? ఆమెకు కావల్సినవన్నీ యిచ్చారు. ఆమె ఏ లోకంలో నుండి వచ్చిందో, ఆ లోకం వింతలు విని ఆశ్చర్యపోయారు. ఆ చిన్నారి పాప తెల్లని నున్నని రెక్కలనూ, అమాయకమైన సంతోషంతో వెలిగే ఆ పక్షిపాప కళ్ళనూ, మెత్తని ఆ పాప పాదాలనూ, బుల్లిబుల్లి అరచేతులనూ ఎంత యిష్టపడ్డారు. ఆ పాపకు హంస తూలికాతల్పం చేయించారు. పారిజాతం పూలతో దండలు గుచ్చి వేశారు. తియ్యని కర్పూర పాయసాలు వండి పెట్టారు. ఇన్ని చేసినా ఆ పాపకు వాళ్ళమ్మ నాన్నల మీద దిగులేసింది. తన లోకం వెళ్ళిపోతానంది. అప్పుడిక అందరూ యేడుస్తూ ఆ పాపను తనలోకం పంపించారు. తన తెల్లని రెక్కలను చాచుకుని, వాటిని అలా అలా కదిలిస్తూ ఆకాశంలోకి ఎగిరిపోయింది ఆ పిట్టపిల్ల.

అంత మంచి కథ రాశాక ఈ కథ రాయటానికి నాకు సిగ్గుగా ఉంది. బాధగా ఉంది. ఆ కథ నాకల. ఈ కథ నాకథే. తొమ్మిదేళ్ల వయసులో అంత అందమైన కలగన్ననేను... మూడేళ్ళ తర్వాత ఎట్లా మారిపోయానో, నా బతుకు పీడకలగా ఎట్లా మారిపోయిందో, నేను అంటే యివాళ అర్థం ఏమిటో, అందరికీ చెప్పాలని ఉంది. అట్లా చెప్పటం వల్ల నా చుట్టూ ఉన్న వాళ్ళు అర్థం చేసుకునే నేను నిజం కాదనీ – ఈ కథ రాయగలిగిన నేను నిజమైన నేననీ నిరూపించుకోవాలి. అదీ నా కోరిక. ఆ కోరిక నన్ను ఎంత వేధిస్తున్నదంటే సంవత్సరం నుంచీ నేనీ కథ రాయటం కోసమే బతికున్నాను. ఈ కథ రాసి చచ్చిపోతాను.

ఈ కథలో అవసరమైన పదం నాకు దొరికి వుంటే – తెలిసివుంటే ఈ కథ సంవత్సరం క్రితమే రాసి ఈ పాటికి చచ్చిపోయేదాన్ని. ఎట్లా రాయాలో తెలియని అయోమయంలో ఉన్న నాకు అనుకోకుండా ఆ పదం దొరికింది. నేనూ భాగ్యం అక్కా పడుకుని మాటలు చెప్పుకుంటుంటే రేడియోలో "మీరిప్పుడు లవకుశ సినిమాలో పాట వింటారు" అన్నారు. నేను రెండేళ్ళ నించీ పాటలు వినటంలేదు. పాటలు చాలా బాగుంటాయి. వాటిల్లో ఏదో మంచితనం ఉంటుంది. అందంగా, శుభ్రంగా మనసులోకి తీసుకోగలిగేంత మంచిగా నేను లేనేమో అనే దిగులుతో రెండేళ్ళనించీ నేను పాటలు

వినటంలేదు. దూరంగా వెళ్తాను. ఇపుడూ వెళ్ళబోతుంటే భాగ్యం అక్క ఆపింది. లవకుశ సినిమాలో పాటలు నాకు చాలా యిష్టం. ఆ సినిమా నాలుగైదుసార్లు చూశాను. అపుడా పాటలు కొన్ని పాడేదాన్ని కూడా. ఇపుడు మర్చిపోయాను. "శ్రీరాముని చరితమును తెలిపెదమమ్మా – ఘనశీలవతీ సీత కథ వినుడోయమ్మా" పాట సాగుతోంది. భాగ్యం అక్క పాట గురించీ సినిమా గురించీ చెబుతోంది. రాముడు రావణుడ్ని చంపాడు. "చేరవచ్చు యిల్లాలిని చూసి – శీలపరీక్షను కోరే రఘుపతి" భాగ్యం అక్క కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ "బుద్ధిలేని చచ్చినోడు" అని తిట్టింది రాముడ్ని.

"అయోనిజ పైనే అనుమానమా? ధర్మమూర్తి రామచంద్రుని యిల్లాలికా ఈ పరీక్ష.."

"అయోనిజ అంటే ఏంటో" అన్నాను నేను.

"అంటే నాకు తెల్సు – సీత అందర్లా పుట్టలేదు. అందుకని అయోనిజ అంటారు. నాగేటి చాల్లో దొరికింది".

"అందరూ ఎలా పుడ్తారు?"

భాగ్యం అక్క పడీపడీ నవ్వింది. ఇలా అంటూ నా పొట్టమీదచెయ్యి వేసి పిల్లలు పుట్టే మార్గందాకా ఆ చేతిని నడిపింది.

"ఛీ" అన్నాను నేను నమ్మలేక.

"ఛీ ఏంటి? పిల్లలు అట్లానే పుడతారు. కమల నీళ్ళాడుతున్నపుడు నే చూశా – దాన్ని యోని అంటారు. సీత అక్కడ్నించి పుట్టలేదు. అందుకని అయోనిజ. మనందరం యోనిజలం -- సీత అయోనిజ".

భాగ్యం అక్క మళ్ళీ నవ్వింది.

యోని – యోనిజ – అయోనిజ – నాకేంటో అయిపోతోంది. నా తల్లో పెద్దగా నొప్పి లేచింది.

సీత అయోనిజ. నాకట్లా పుట్టటం గురించి ఏమీ తెలియదు. కానీ నేను యిన్నాళ్ల నుంచీ కోరుకుంటున్నది యిపుడు రాయగలను. నేను అయోనిగా పుడితే ఎంత బాగుండేది. ఈ పదం నాకు ఎంత బాగుందో – అయోని. మీకు కోపంగా ఉందా? చీదరగా ఉందా? అసహ్యంగా ఉందా? కానీ మీకు కోపం గురించీ, చీదర గురించీ ఏమీ తెలియదు. తెలిస్తే నా కోరిక తీరాలని దీవిస్తారు. మీరంతా చల్లని తల్లులు కదూ–

ఇక చెబుతాను నా కథ. ఆ రోజు – నా మంచి రోజులకు ఆఖరి రోజు నాకు బాగా గుర్తుంది. మిగిలిన చాలా రోజులు మర్చిపోయాను గాని ఆ రోజును పనిగట్టుకుని

గుర్తు పెట్టుకున్నాను. ఎక్కడ మర్చిపోతానో అనే భయంతో పదే పదే జ్ఞాపకం తెచ్చుకుంటూ ఉంటాను. ఆ రోజు జనవరి నాలుగో తారీఖు. ఆ రోజుతో పరీక్షలైపోయి సంక్రాంతి శలవలు యిచ్చారు. సంక్రాంతి నెలంతా నేను తెల్లవారు ఝామునే లేచేదాన్ని. నాకు ముగ్గు లెయ్యటం సరదా. పెద్ద పెద్ద ముగ్గులు వేసేదాన్ని. ఆ ముగ్గులో పసుపూ కుంకుమా బంతిపూల రేకులూ చల్లేదాన్ని. అమ్మమ్మ గొబ్బెమ్మల గురించి చెబితే వినటమే గాని నేను గొబ్బెమ్మలు పెట్టలేదు. ఆవుపేడ దొరికేది కాదు. ఆరోజు పాము ముగ్గేశాను. జంటసర్పాలు. ఎంత పొడవున, ఎంత వెడల్పున – ఎన్ని మెలికలు తిరిగి పెనవేసు కున్నాయో! ముగ్గంతా వేశాక చూస్తే నాకే భయం వేసింది. వాటికి ప్రాణం వచ్చి నన్ను గనుక చుట్టుకుంటే అనే వూహవచ్చి భయంపుట్టి యింట్లోకి ఒక్క పరుగుతీశాను. కానీ ఆ పాములు నా ఊహలు పసిగట్టాయా అన్నట్టు ఆ సాయంత్రం నిజంగానే నన్ను పట్టుకున్నాయి.

ఎట్లాంటి పాములని – నల్లగా పెద్దపెద్ద పడగల్లాంటి తలల్తో విషం చిమ్ముతూ కార్లో వచ్చాయి. నేను కారు పక్క నడిచి వెళ్తున్నాను. చలికాలం కదూ ఆరింటికే చీకటి పడిపోయింది.

నేను పరీక్షలైపోయిన సంతోషంతో, రాధారాణి వాళ్ళింట్లో క్యారమ్స్ ఆటలో ఓడినందుకు వుక్రోషంతో, ఆలస్యమైనందుకు అమ్మ తిడుతుందనే భయంతో నడుస్తున్నాను. కారు నల్లని కారు -- తళ తళ మెరుస్తోంది. నేను ఆ కారు అద్దాల్లో నా నీడ చూసుకుంటూ దాటబోతున్నాను. రెండు పాములు నన్ను చుట్టేసి కార్లోకి లాగేశాయి. నా మీద విషం చిమ్మాయి. నేను చచ్చిపోయాననే అనుకున్నాను.

చచ్చిపోతే ఎంత బాగుండేది. కానీ నేను చచ్చిపోలేదు. ఈ నాగుబాములు నన్నెత్తు కొచ్చాయని తెలిసింది. అదంతా ఒక నరకం. ఆకలి, భయం, చీకటి వీటికున్న భయంకర మైన అర్థాలు నాకప్పుడే తెలిశాయి.

అంతకుముందు ఆకలివేస్తోందంటే రుచిగా అన్నం తినొచ్చనే ఆనందమే తెలుసు.

భయం వేసిందంటే అమ్మఒడో, అమ్మమ్మపొట్టో తెలుసు.

చీకటి పడుతోందంటే దీపాలు వెలుగుతాయనీ, చందమామ, చుక్కలతో ఆకాశం నిండిపోతుందన్న సంబరమే తెలుసు.

ఆకలివేస్తే అన్నం దొరక్క, అన్నం కోసం యేడుస్తుంటే చీకటి గదిలోవేస్తే కలిగే భయం – ఎట్లా చెప్పను దాన్ని గురించి, ఆ ఆకలి తీరాలంటే, ఆ చీకటి పోవాలంటే వాళ్ళు చెప్పిన పని చేయాలి. ఒక దున్నపోతులాంటి మగాడు నా మీద పడి నా యోనిని చీల్చాడు.

నాకు స్పృహ పోయింది. రక్తం వరదలైంది.

కానీ అన్నం దొరికింది. నేను తింటున్నది అన్నమో రక్తమో తెలియని స్థితి.

ఇక వారానికి మూడురోజులు అదే పని. నాకు నా 'యోని'ని చూస్తే అసహ్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ దానిని చాలా జాగ్రత్తగా దాచేవారు. స్నానం చేసేప్పుడు తప్ప నేనైనా చూడలేను గదా. దానిని గురించి నాకు ఏమీ తెలియదు. ఎవరూ చెప్పలేదు. దానిని నేనైనా సరే ముట్టుకోకూడదనీ, ఎవరినీ ముట్టుకో నివ్వకూడదనీ, చూడనివ్వకూడదనీ అమ్మ, అమ్మమ్మ రకరకాలుగా చెప్పారు. అది 'షేమ్ షేమ్' అని మాత్రం తెలుసు. కానీ నాకు అదంటే యిష్టంగానే ఉండేది. ముఖ్యంగా మగపిల్లలను బట్టల్లేకుండా చూసినపుడు నేను ఆడపిల్లనైనందుకూ, నాకు అట్లా కాళ్ళమధ్యలో వేలాడే అసహ్యమైన తోక లేనందుకూ  చాలా నిశ్చింతగా అనిపించేది. పెద్ద ప్రమాదం తప్పినట్లనిపించేది. మగపిల్లలమీద జాలివేసేది. పాపం జీవితాంతం వాళ్లట్లా ఆ అసహ్యమైన తోక వేళ్ళాడుతుండగా బతకాలి గదా అనుకునేదాన్ని. అంతకుమించి నాకు ఈ అవయవాల గురించి ఏమీ తెలియదు. వాటి పేర్లు కూడా తెలియవు. ఒకసారి రాధారాణి తనకు తెలుసుననీ, నాకు చెప్తానని అన్నది కానీ ఎందుకో చెప్పలేదు.

ఇక్కడికొచ్చాక నాకు మగవాళ్ళమీద జాలిపోయింది. వాళ్ళు ఆ తోకను విషం పూసిన కత్తిగా, ఖడ్గమృగపు కొమ్ముగా మార్చగలరని తెలిశాక మగవాళ్ళంటే భయంతో చచ్చి పోతున్నాను.

నాకప్పుడు పదేళ్ళు. వారానికి మూడురోజులు మగవాళ్ళు వచ్చేవాళ్ళు. వాళ్ళకి జబ్బులున్నాయట. నన్ను చీలిస్తే వాళ్ళ జబ్బు తగ్గుతుందట. వాళ్ళు రాగానే నాకు ఏడుపు, భయం-- ఏడవకూడదు. ఏడిస్తే చీకటి గదిలో పడేసి అన్నం పెట్టకుండా మాడుస్తారు. ఏడవకుండా కళ్ళు మూసుకుందామంటే ఆ మగవాడు మూసుకోనివ్వడు. చూడమంటాడు. నేను చూస్తుంటాను.

అప్పుడు నేను చిన్నపిల్లను కాదు, మనిషిని కాదు, ప్రాణినికూడా కాదేమో, ఒక యోనిని. అంతే. అదొక్కటే. ఒక చిన్న కంతను. ఆ కంతకావాలి అక్కడికి వచ్చేవాళ్ళకు. వాళ్ళ రోగాలను అక్కడ పూడ్చి వెళ్ళిపోతారు. నేను, నేను ఎవరు? నేను ఏమిటి? అన్నం కలిపే చేయి నేనా? అన్నంతినే నోరు నేనా? అన్నం చేరగానే నిండే పొట్ట నేనా? ఈ అన్నం నాకు పెట్టే ఆ యోనే నేనా?

అందరూ నన్ను యోనిగానే చూశారు. నాకు అదంటే అసహ్యం కలిగేలా చేశారు. నేనది కాదు, నేను వేరేగా ఉన్నాను. నాతో మాట్లాడండి, నన్ను మనిషిలా చిన్నపిల్లలా చూడండి - వినేవాళ్ళెవరున్నారు? అమ్మమ్మ, అమ్మ, నాన్న ఎక్కడున్నారు?

ఇక్కడ వీళ్ళందరికీ నేనంటే ఒక యోనిని - -

మగవాళ్ళు వస్తున్నారంటే నా గుండె కడుపులోకి జారిపోతుంది. మగ గొంతులు కోపంగా అరుస్తున్నా, పెద్దగా నవ్వుతున్నా నా చెవుల్లో ఏవో పేలిపోతున్నట్లుంటాయి. నేను లో లోపలికి ముడుచుకుపోతాను. ఇంకా యింకా నా లోపల ఈ భయం ఎక్కడి నుంచి పుడుతోందో ఆలోపలికి ముడుక్కుపోవాలని చూస్తాను. కానీ ఎంత ముడుచుకు పోయినా నేను వాళ్ళకు కనిపిస్తాను. వాళ్ళ నుంచి తప్పించుకుని దాక్కునే స్థలం యింత వరకూ నాకు కనిపించలేదు. చిన్నప్పుడు దాగుడుమూతలాటలో ఓ రోజు నేను పెరట్లో బాత్‌రూం వెనక వేసి వున్న బొగ్గులబస్తా చాటున దాక్కున్నాను. ఎవరూ కనిపెట్టలేక పోయారు. ఇంకా వస్తారు. ఇంకావస్తారని ఎంతోసేపు ఎదురుచూసినా ఎవరూ రాలేదు. చివరికి నాకే భయంవేసి బైటికొచ్చాను. అప్పుడా ఒంటరితనానికి భయంవేసింది గానీ యిప్పుడలా ఎవరికీ కనపడని ప్రదేశం నాకు కనపడితేనా?

ఇక్కడ చాలా మంది పెద్దవాళ్ళున్నారు. వాళ్ళు రాత్రిళ్ళు సరదాగా గడుపుతారని అంటారు. భాగ్యం అక్క అంటుంది "సరదాలేదూ పాడూ లేదూ - పొట్టతిప్పలు".

నా బాధ భాగ్యం అక్కకు తెలుసు.

"పెద్దదానివైతే నీకు అలవాటవుతుందిలే - ఇంతబాధ ఉండదు" అని ఏడుస్తుంది.

సంవత్సరాలు గడిచిపోతున్నాయి. నేను పెరుగుతున్న కొద్దీ నా కోరిక కూడా పెరుగుతోంది. ఈ ఒక్క అవయం లేకుండా పోతే!

భాగ్యం అక్కతో చెబితే నవ్వుతుంది. అది లేకపోతే ప్రపంచమే లేదంది. అంటే బాధతోనే ప్రపంచం ఉందా? హింసతోనే ప్రపంచం ఉందా?

"ఈ బాధ మనలాంటి వాళ్ళకేగా - చాలామంది హాయిగా ఉన్నారుగా. తల్లిదండ్రుల దగ్గర హాయిగా పెరిగి పెద్దయ్యే పిల్లలకు ఈ బాధ ఉండదుగా" అంటుంది భాగ్యం అక్క

ఏమో - ఉండదా? ఏదో ఒక బాధ లేకుండా ఒదుల్తారా అని నాకు అనుమానం. ఐనా మిగిలిన అదృష్టవంతుల సంగతి నాకెందుకు. నాకిది ఒద్దు. దీనివల్లనే నన్ను ఎత్తుకొచ్చారు. అసహ్యంగా, మురికికూపంగా, రోగాల పుట్టగా చేశారు. నా శరీరం నిండా జబ్బులు తెచ్చి పెట్టారు. నాకు అప్పుడపుడూ బైటకుచూస్తే కనిపించే చిన్నారి పాపల్ని చూస్తే కూడా భయం.

వాళ్ళలో ఎవరు నాలాగా మారతారో? ఇట్లాంటి నరకాలు ఎన్ని ఉన్నాయో - ఎంతమంది పిల్లలు నాలాగా చచ్చిపోవాలనుకుంటున్నారో -- ఇంకెంత మంది నాలా తయారవుతారో? ఇదంతా ఆగాలంటే ఏం చెయ్యాలి?

నాకు మాత్రం వెంటనే అయోనిగా మారాలని ఉంది. నా కోరిక అసహ్యంగా ఉందనీ, మంచిది కాదనీ మీరు అనుకుంటుంటే, ముందు ఈ హింసను ఆపండి. చిన్న చిన్న పాపలను వాళ్ళ యోనుల కోసం ఎత్తుకొచ్చే నాగుబాముల్ని పొడిచిపొడిచి చంపండి. ఈ వ్యాపారాన్ని ఆపండి. అదిచేతగాక నన్ను చూసి అసహ్యించుకుంటారు మీరు. నా కథ చీదరగా ఉందంటారు.

కానీ మీకు తెలుసా? నేను "చందమామ" కోసం రాసిన కథలో పక్షుల లోకం నుంచి వచ్చిన రెక్కల పాపాయికి యోని వుందా లేదా అన్న సంగతే రాయలేదు. ఆ పాప అయోనిజా? అయోనా? అన్న ప్రశ్నే రాలేదు. ఆ పాపాయి ఎంత అందమైంది! ఆ పాపాయి వచ్చినప్పుడు లోకం ఎంత మంచిగా ఉంది!

అట్లాంటి లోకం ఉంటే యిప్పుడూ నాకీ కోరిక ఉండేది కాదేమో.

ఇప్పుడు నేనా కథరాస్తే ఆ పాప రెక్కలకు మనుషులు ముళ్ళ తీగలు చుట్టారని రాస్తానా? ఆ పాప అమాయకమైన కళ్ళలో కారంపొడి చల్లారని రాస్తానా? ముద్దబంతి పూవులాంటి ఆ పిట్టపాప ముక్కుని చిదిమేశారని రాస్తానా? వేడి కన్నీటి నదులు ఆ పాప కళ్ళలోంచి పొంగాయని రాస్తానా? ఆ పాప చివరికి బాధ ఏడుపులు కలగలసిన ముద్దగా మారిపోయి ఎగరలేక దుమ్ములో బురదలో పడి చచ్చిపోయిందని రాస్తానా?

ఏమో – ఎలా రాస్తానో –

ఐనా ఈ అసహ్యమైన కథ తప్ప యిపుడు నేనా అందమైన కథ రాయలేను.

ఈ కథ రాశాను గదా-- ఇక చచ్చిపోతాను. చందమామలో నా కథ అచ్చవు తుందేమోనని ఆరేడు నెలలు ఎదురుచూశాను.

ఇపుడీ కథ ఎక్కడా అచ్చవదు గనక ఎదురు చూడాల్సిన పనిలేదు.

వెంటనే చచ్చిపోవచ్చు. చచ్చిపోతున్నాను.

మే *1994*

ఆహ్వానం

(అందరికీ తెలిసిన చిన్నారి శ్వేతకు, గతనెలరోజులుగా హైదరాబాద్‌లో లైంగిక అత్యాచారాలకు గురై చనిపోయిన పాపలకు, ప్రపంచ వ్యాప్తంగా ఈ లైంగిక వ్యాపారానికి బలైపోతున్న చిన్నారి పాపలందరికీ రక్తపు కన్నీళ్ళతో అంకితం ఈ కథ).

# 8

# ఒక రాజకీయ కథ

నేను చేసిన తప్పేమిటో అర్థం కావటం లేదు. జరిగినదానిలో ఏ కొంచెం పొరపాటున్నా దానిని ఆపటం, మరింకో విధంగా మార్చటం నా చేతుల్లో ఉన్నా నాకింత కోపం రాదని చెప్పగలను.

ఇలాంటి కష్టమే నా భర్తకు వస్తే ఆయనకెంత సహకరించాను. ఎంత ఓదార్చాను. ఎలా గుండెల్లో దాచుకున్నాను. ఆ రోజు సాయంత్రం నాకింకా గుర్తుంది. మామూలు గుర్తు కాదు. కళ్ళకు కట్టినట్టు ఉంది.

మా పెళ్ళి జరిగి అప్పటికి సంవత్సరమయింది. ఆ సంవత్సర కాలంలోని నా జీవితాన్ని పరామర్శించుకుంటూ ఆయన చొక్కాలకు గుండీలు కుడుతున్నాను.

ఆయన పేరు మొదటిసారిగా మా పెదనాన్న నోటిమీదుగా విన్నాను. మా పెదనాన్నే నాకీ సంబంధం తెచ్చారు. మధుసూదనరావనే పేరు ఎంత అందంగా మధురంగా, పవిత్రంగా, మనసుకెంత ఉల్లాసంగా వినిపించింది. పదే పదే ఆ పేరు నా మనసులో ప్రతిధ్వనించింది. నేనిన్నాళ్లూ ఎదురు చూసిన నా జీవిత సాఫల్యం ఈ పేరులోనే ఉందని నాకనిపించింది. మూడేళ్ళుగా ఏ పేరు నా పేరుకి జత కలుస్తుందా అని

నిరీక్షిస్తున్నానేమో, నా నిరీక్షణ ఫలించిందని సంబరపడ్డాను. ఆ క్షణం నుంచీ నేను పుట్టి పెరిగిన ఇంటిని పరాయి ఇల్లుగా భావించాను. మరో నెలలో నేను మా ఇంటికి వెళ్ళిపోతానని నిశ్చింతగా నిట్టూర్చాను. అది హఠాత్తుగా అనుకున్న మాట కూడా కాదు. అప్పటికి మూడేళ్ళుగా మా అమ్మ ఇంటిలో నేనే చిన్న మార్పు చేసినా అది తనకు నచ్చకపోతే "మీ ఇంటిలో నువ్వలా చేద్దువుగానిలే, ఈ ఇంట్లో ఇలా జరిగిపోనీ" అంటుండేది. నా ఇష్టం వచ్చినట్లు అమర్చుకోటానికి నాకో ఇల్లు వేరుగా ఉంటుందని క్రమంగా అర్థమై ఆ ఇంటి కోసం ఎదురు చూడసాగాను. చివరికి ఆ ఇల్లు హైదరాబాదు లోనని తెలిశాక నా ఆనందం ఏమని చెప్పను. హైదరాబాదు, మధుసూదన్ – ఈ రెండు పేర్లూ మనసులో మెదిలినప్పుడల్లా నా పెదవుల మీదకి చిరునవ్వు ఎలా పాకేదో మా చెల్లి ఎగతాళి చేస్తూ చెప్పేది. అది విని నా ముఖం సిగ్గుతో ఎరుపెక్కేది.

మధుసూదన్‌కి యాభైవేలు కట్నం ఇవ్వటానికి మా వాళ్ళు ఒప్పుకున్నారు. ఆ సంగతి నా స్నేహితురాళ్ళందరితో చెప్పుకున్నాను. బి.ఎ. పరిక్షలు రాసి పెళ్ళి కోసం ఎదురు చూస్తున్న నా స్నేహితుల మధ్య ఎప్పుడూ పెళ్ళి కబుర్లే దొర్లేవి. అందరిలో నాకే ముందు సంబంధం కుదిరిందేమో, నాకు కాస్త గర్వంగా ఉండేది. కట్నం సంగతి విని నా స్నేహితురాళ్ళలో కొందరు "అమ్మో అంతా!" అన్నారు. మరికొందరు "చౌకలో మంచి మొగుడ్ని కొట్టేశావ"న్నారు. ఒకమ్మాయి మాత్రం "కట్నం ఎందుకం"టూ వితండవాదం చేసింది. పెళ్ళి చేసుకుని నేనతనికి సుఖాన్నిస్తానట, చాకిరీ చేస్తానట, పిల్లల్ని కంటానట, వాళ్ళకు మళ్ళీ అరవ చాకిరీ చేస్తానట, ఇన్ని పనులు చెయ్యాల్సిన నీకు, ఇన్ని బాధ్యతలు నెత్తినేసుకుంటున్న నీకు అతను కట్నం ఇస్తే అర్థముందిగానీ, నువ్వెందుకివ్వాలి కట్నం అని వితండవాదం మొదలుపెట్టింది. అసలు పెళ్ళి విషయాన్ని, నాకతనితో ఏర్పడబోయే పవిత్రబంధాన్ని అంత మొరటుగా అర్థం చేసుకుంటున్న ఆ పిల్లను చూస్తే నాకు ఒళ్ళు మండిపోయింది. "నేను మాత్రం సుఖపడనా, చాకిరి నా కోసం కూడా కాదా? పిల్లలు పుడితే వాళ్ళు నా పిల్లలు కాదా" అని అడిగాను, ఆమె వక్ర దృష్టి ఎంత దూరం పోతుందో తెలుసుకుందామని. "అలా అయితే మరి యాభైవేలెందుకు ఇద్దరూ సుఖపడటానికి" అంది లాపాయింటు లాగుతున్న దానిలా. ఇలాంటి కుతర్కం చేసేవాళ్ళకేం చెబుతాం, చెబితే మాత్రం వాళ్ళ తలకెక్కుతుందా అనుకుంటూ, "అది ఆచారం – నాకూ మా వాళ్ళకూ లేని అభ్యంతరం నీకెందుకు" అన్నాను. ఆ పిల్ల "ఎందుకో పెళ్ళయ్యాక నీకే తెలుస్తుందిలే" అని వెళ్ళి పోయింది.

కానీ, పెళ్ళయ్యాక నాకేం తెలియలేదు. పెళ్ళి సలక్షణంగా జరిగిపోయింది. పెళ్ళి పీటల మీద ఆయనను మొదటిసారిగా చూసిన మధురక్షణాన్ని నేనెప్పటికీ మరచి

పోలేను. ఆయన ఫోటోలో కంటే అందంగా ఉన్నారు. అయినా, ఆయన పేరు, ఆయన తోడు, నా జీవితం అంతా మధురమేనని నాకు నమ్మకంగా అనిపించింది. పెళ్ళిలో ప్రతి పనీ ఎంతో పవిత్రంగా – త్రికరణశుద్ధిగా అంటారే, అలా చేశాను. మాంగల్యాన్ని భక్తిగా కళ్ళకద్దుకుని నా గుండెల్లో దాచుకున్నాను. నా జీవితానికి పట్టిన మహా అదృష్టం, నాకు లభించిన అపురూప వరం ఆ మాంగల్యమేననుకున్నాను. ఆయన జీవిత సహచరిగా కష్టసుఖాలలో భాగం పంచుకోవాలని ఎంత చిత్తశుద్ధితో అనుకున్నా నంటే తర్వాతి రోజుల్లో ఏ కొంచెం బాధకలిగినా పెళ్ళిరోజు నేను తీసుకున్న నిర్ణయం గుర్తు తెచ్చుకుని, ఆ కష్టాన్ని దిగమింగి సంతోషంతో ఆయనకు సహకరించేదాన్ని. భార్యాభర్తల అనురాగాన్ని గురించీ భర్త యెడల భార్య పాటించాల్సిన ధర్మాల్ని గురించీ నాకప్పటికే చాలా తెలుసు. "ప్రేమ నిండిన ఇల్లే నవ స్వర్గముగా విలసిల్లు" అనీ, "మల్లెతీగ వంటిదీ మగువ జీవితం. చల్లని పందిరి ఉంటే అల్లుకుపోయేను" అనీ చిన్నప్పటి నుంచీ పాడుకుంటూనే ఉండేదాన్ని. అలాంటి విషయాలతో నిండిన పాటలూ, కథలూ, నవలలూ నాకెంతో ఇష్టం. నేను కూడా మధుసూదన్‌ని లతలా అల్లుకుపోయి నిశ్చింతగా, భద్రంగా బతుకుతున్నాననే తృప్తి కంటే కావలసిందేముంది?

అయితే ఇదంతా చాలా తేలికగా, సునాయాసంగా జరిగిపోలేదు. పెళ్ళి రోజున ఉన్న పవిత్ర భావాన్ని నిలబెట్టుకోటానికి నేను చాలా యుద్ధం చేశాను. ఆయన అలవాట్లు నా అలవాట్లకు పూర్తిగా భిన్నం. ఆయనకు శుభ్రత తక్కువ, తన పరిసరాలన్నీ గందర గోళంగా, చెత్తతో ఉంచుకోవటం అలవాటు. నా శుభ్రత ఆయనకు విసుగ్గా ఉండేది. ఆరునెలల్లో నేనూ, ఆయనలా తయారవటానికి చాలా ప్రయత్నం చేశాను. మా పక్కింటావిడకు నాలా శుభ్రం గురించి పిచ్చిలేదు. వాళ్ళాయనకు మాత్రం ఏకాస్త దుమ్మూ, మురికీ చూసినా పిచ్చెక్కిపోతుంది. ఆమె హడలిపోతూ అన్నీ ఆయనక్కావల్సినట్టు ఉంచటానికి యాతన పడేది. మేమిద్దరం కల్సినప్పుడు ఈ విషయాలే మాట్లాడుకునేవాళ్ళం. నేనామెకు నా పద్ధతులన్నీ నేర్పి నేను ఆవిడ బద్దకాన్ని కాస్త ఒంటబట్టించుకున్నాను.

ఆయన నన్ను ప్రేమగానే చూసేవారు. ప్రేమకు కొలమానం ఏమిటి – పువ్వులు తేవటం, సినిమాలకూ షికార్లకూ తీసుకెళ్ళటమయితే నాకు ప్రేమకేమీ లోటులేదు. అయితే, నాకిష్టమైన కనకాంబరాలు పెట్టుకున్నా, హిందీ సినిమాకు వెళ్దామన్నా ఆయనకు చాలా చిరాకు వచ్చేది. ఆయనకు చిరాకు కలిగించనని నేను పెళ్ళినాడు ఒట్టేసుకున్నాను గదా – అందువల్ల మేం చాలా ప్రేమగా ఉండేవాళ్ళం. మా అత్తమామలు కూడా మంచి వాళ్ళే. పెళ్ళినాటి కట్నం, లాంఛనాలు తప్ప మరేం గొంతెమ్మ కోరికలు కోరలేదు.

అది చాలలేదని నన్నెప్పుడూ సతాయించనూలేదు. వాళ్ళు వేరే ఊళ్ళో ఉండటం వల్ల నాకు కోడంట్రికం లేదు. అంతా హాయిగానే జరిగిపోతోంది.

ఆ రోజు – మా పెళ్ళయి ఏడాది నిండిన రోజు. గడచిన ఏడాదిలో నాకు దొరికిన పందిరినీడ ఎంత చల్లనిదో, ఎంత వెచ్చనిదో పరామర్శించుకుంటూ ఉండగా, ఆయన చొక్కాగుండీలు కుడుతున్న సూది కసుక్కున నా చూపుడు వేలిలో దిగబడింది. "అబ్బా" అని అరవకముందే మా వాకిట్లో పెద్ద కలకలం వినపడింది. నాకు భయం వేసి ఒక్క ఉదుటున బైటికి పెరిగెత్తాను. ఆగిన ఆటో చుట్టూ మనుషులు మూగారు. స్కూటర్ల మీద మనుషులు దిగుతున్నారు. ఆ గుంపులోంచి దారిచేస్తూ మా ఆయనను నలుగురు మనుషులు ఆటోలోంచి కిందకి దించారు. నీరసంగా అడుగులేస్తూ వస్తున్న ఆయన్ని చూడగానే ఏమైందో తెలియకుండానే బావురుమని ఏడ్చాను.

"ఏం లేదమ్మా, ఏం లేదు. మనందరం అదృష్టవంతులం" అంటూ ఒక పెద్దాయన మధుసూదన్‌ని మంచం మీదకు చేర్చాడు. అప్పుడు చూశాను. ఆయన కుడి చేతికి పెద్ద కట్టు. రక్తసిక్తమైన బ్యాండేజి. నాకు కళ్ళు తిరిగాయి. నిస్సత్తువ ఆవరించి నిలబడలేక కుప్పకూలిపోయాను. "ఏమైందీయనకు – నా దేవుడు నాకు దక్కుతాడా?" వెక్కి వెక్కి ఏడుస్తున్న నన్ను సముదాయిస్తూ వాళ్ళంతా జరిగిన విషయం చెప్పారు.

ఆయన రోజూ ఫ్యాక్టరీలో నడిపే మెషిన్ పేరు చెప్పారు. ఆ మెషిన్ ఎంత నేర్పరితనంతో నడిపితే వస్తువులు ఉత్పత్తి చేస్తుందో చెప్పారు. ఆయన ఆ పని ఏడేళ్ళుగా ఎంత నైపుణ్యంతో చేస్తున్నాడో చెప్పారు. అయినా, ఇవాళ ఆ మెషిన్ మా ఆయన కుడిచేతి వేళ్ళనెలా కత్తిరించిందో చెప్పారు. అదేమీ ప్రమాదం కాదనీ, చేయవలసిన చికిత్స చేశారనీ. ఇంకా చేయిస్తారనీ చెప్పారు.

మధుసూదన్‌కి విశ్రాంతి, బలమైన ఆహారం కావాలనీ, దానికి ఖర్చు పెట్టమనీ కొంత డబ్బు నా చేతిలో పెట్టారు. వాళ్ళు మా వారు పనిచేసే ఫ్యాక్టరీలోని యూనియన్‌లో పని చేసేవాళ్ళట. దేవతలే నా కష్టంలో నన్నాదుకోటానికి ఈ రూపంలో వచ్చారా అనిపించింది వాళ్ళ మాటలు వింటుంటే. నేను కన్నీళ్ళు తుడుచుకుని ధైర్యంగా మధుసూదన్ చూపుల్లో చూపులు కలిపి, అందరికీ కాఫీలు ఇచ్చేదాకా వాళ్ళు మా ఇంట్లోనే ఉన్నారు. వాళ్ళు వెళ్ళకుండా అలాగే ఆ రోజంతా ఉంటే బాగుండుననిపించింది నాకు. నా కష్టంలో ఆదుకోటానికి నా అన్నదమ్ములు వచ్చి కూర్చున్నట్టే అనిపించింది. వాళ్ళ ధైర్యవచనాలు లేకపోతే నేను ఏమైపోయేదాన్నో. కష్టం కలిగిందన్న స్పృహ కలిగీ కలగకముందే ఆ కష్టంలో మనం ఒంటరిగా లేమనీ, గట్టెక్కించే చేతులు మనచుట్టూ ఉన్నాయనీ తెలవటం ఎంత బాగుంటుందో నాకారోజు అనుభవ మయింది.

వాళ్ళను పంపించి వీధి తలుపు వేసి వస్తుంటే మళ్ళీ నా బాధంతా నా గుండెల్లోకి వచ్చి కూర్చున్నట్లయింది. కానీ, నేను ఏడవలేదు. మళ్ళీ ఏడ్చే అవకాశం మధుసూదన్ నాకివ్వలేదు. నేను లోపలికి వచ్చేసరికి తను ఏడుస్తున్నాడు. తన మొండిచెయ్యి చూసుకుని కుళ్ళీ కుళ్ళీ ఏడుస్తున్నాడు. నేను ఎక్కడ లేని ధైర్యమూ తెచ్చుకుని, నా కన్నీళ్ళు దిగమింగి ఆయన కన్నీళ్ళు తుడిచాను. తల్లి పసిపాపను అక్కున చేర్చుకున్నట్టు ఆయన్ని అక్కున చేర్చుకుని బుజ్జగించాను. ఎంతో ధైర్యం నూరిపోశాను. వేళ్ళు లేకపోవటం వల్ల ఆయన జీవితంలో ఏ మార్పూ రాకుండా చేసే పూచీ నాదని చెప్పాను. ఆయన ఎంత బేల అయిపోయాడంటే, ఆ వేళ్ళు లేకపోతే ఆయనమీద నా ప్రేమ కూడా తగ్గిపోతుందను కున్నాడు. "ఎంత పిచ్చిగా ఆలోచిస్తున్నారో తెలుసా?" అని మందలించాను. ఆయనెలా వున్నా నా మనిషనీ, నా ప్రేమకు ఇలాంటి పరీక్షలు ఒక లెక్క కాదనీ చెప్పాను. రక్తంతో, మందులతో తడిసిన ఆ చేతికట్టుకి ప్రేమగా, సున్నితంగా నా పెదవులానించి ముద్దు పెట్టుకున్నాను. కానీ, ఆయనకు మరో పెద్ద దిగులు పట్టుకుంది. వేళ్ళు లేకుండా ఆ ఉద్యోగం ఎలా? ఆ ఉద్యోగంలోంచి తీసేస్తే ఏం చెయ్యాలి? అసలే ఉద్యోగమైనా ఎవరైనా ఇస్తారా? నేనెంత ధైర్యం చెప్పినా, ఆయన దిగులు తగ్గలేదు. నిద్రమాత్రలిచ్చి ఆయన్ను నిద్రపుచ్చాను గానీ నేను మాత్రం తెల్లవార్లూ జాగారం చేశాను.

మర్నాడు కబురు తెలిసి మా అత్తమామలు వచ్చారు. మళ్ళీ ఏడుపులు. ఇక ఈ ఏడుపులకంతం లేదా, ఆయన్ని తేరుకోనివ్వరా అనుకుంటుండగా మళ్ళీ యూనియన్ వాళ్ళొచ్చారు. వాళ్ళ రాకతో ఇల్లు కాస్త ధైర్యం తెచ్చుకుంది. ఉద్యోగం గురించి భయపడటానికేమీ లేదన్నారు వాళ్ళు. "నిన్ను ఉద్యోగంలోంచి పంపేసేటట్లయితే మన యూనియన్ దేనికంట"అన్నారు. కాంపెన్సేషన్ విషయం, ఉద్యోగం విషయం – అన్నీ తమకొదిలేసి ఆరోగ్యం చక్కబరుచుకోమన్నారు. ఆయనకెంత ధైర్యం వచ్చిందో చెప్పలేను. నన్ను పిలిచి యూనియన్ నాయకుడిని పరిచయం చేసి ఆయన పాదాలకు నమస్కరించ మన్నారు. నేను కంగారుగానే అయినా మనస్ఫూర్తిగా నమస్కరించాను. అప్పుడాయన కాళ్ళు వెనక్కు లాక్కుని నేనంత పనిచేసినందుకు నొచ్చుకుంటూ కొన్ని మాటలు చెప్పాడు. ఇవాళ మధుసూదన్ ఉద్యోగం నిలబడుతుందంటే కేవలం ఈ యూనియన్, ఈ యూనియన్ నాయకుడి మహత్యం కాదట. ఎప్పుడో నూటపాతిక సంవత్సరాల క్రితం మొదలైన కార్మికుల చైతన్య వికాసం యొక్క ఫలితమట. కార్మికుల ఐక్యత, పోరాటాలు, ఉద్యమాలు లేనప్పుడు ఇలాంటి సమస్యలొచ్చినవాళ్ళు చచ్చిపోవలసిందే తప్ప ఏ ఫ్యాక్టరీ ఉత్పత్తి కోసం ప్రమాదానికి లోనయ్యాడో ఆ ఫ్యాక్టరీ వాళ్ళు ఏమీ పట్టించుకునే వాళ్ళుకాదట. కార్మికులు కలిసికట్టుగా ఉండి ఎన్నో చట్టాలు తెచ్చుకున్నారట. అందుకే

మధుసూదన్ సమస్య తేలికగా పరిష్కారమవుతుందట. ఇంకా ఇంకా కార్మికుల క్షేమం కోసం, యాజమాన్యాలను అదుపులో ఉంచటం కోసమే ఈ యూనియన్లు అని ట్రేడ్ యూనియన్ల గురించి చాలా సేపు చెప్పాడు. ఆయన చాలా నిజాయితీగా చెబుతున్నాడని పించి నేను చాలా శ్రద్ధగా విన్నాను. నాకు అర్థమైనంత వరకూ మా ఆయనగానీ, ఆయనలా సమస్యలో ఇరుక్కున్న మరింకొకరెవరైనా గానీ ఒంటరిగా ఉండనవసరం లేదనీ, వాళ్ళకు అండగా యూనియన్ ఉందనీ ఆయన చెబుతున్నాడనిపించింది. అది నాకూ, మా ఆయనకూ కొండంత ధైర్యాన్నిచ్చింది.

నెల రోజులలో ఆయన చెయ్యి నయమయింది. కట్టు విప్పించుకుని వచ్చిన మొదటి రోజు రాత్రి ఆ మొండిచెయి నా శరీరాన్ని తాకుతుంటే నా ఒళ్ళు జలదరించిన మాట నిజమే గానీ, అతికొద్ది సమయంలో ఆ జలదరింపును పులకరింతగా చేసుకున్నాను. ఆ మొండి చేతిని ప్రేమావేశంతో ముద్దులాడాను. యూనియన్ వాళ్ళ పట్టుదలతో ఆయనకు సహాయంగా ఒక అసిస్టెంట్‌ని వేశారు. కాంపెన్సేషన్‌గా మాత్రం పదివేలిచ్చారు. ఉద్యోగంలో ఏ మార్పూ లేదు కనుక అంతకంటే ఎక్కువ ఇచ్చేది లేదన్నారు. యూనియన్ వాళ్ళు ఇక దానిమీద వివాదం వద్దు, వాళ్ళిచ్చిన దానితో తృప్తిపడదాం అన్నారు. ఆయనా అంగీకరించారు. నాలుగు నెలల్లో మళ్ళీ మా పాత జీవితం మాకు తిరిగొచ్చి నట్టయింది. అప్పుడే నేను గర్భవతిననే అనుమానం వచ్చింది. ఆ అనుమానం ఇంకో నెలలో రూఢి అయింది. డాక్టరు దగ్గరకు వెళ్ళి చెబితే ఆమె పరీక్ష చేసి, బరువు చూసి టానిక్కులు రాసిచ్చింది. ఆ తర్వాత రెండు నెలలూ ఆయన నన్ను ఎంతో అపురూపంగా చూసుకున్నారు. నాకు కావాల్సినవన్నీ కొనిచ్చారు. పాలూ, పళ్ళూ తినమని పదే పదే చెప్పారు.

నాకు లెక్క ప్రకారం మూడు నెలలు నిండాయి. ఆ రోజు సాయంత్రం తలంటు పోసుకుని జుట్టు చిక్కు తీసుకుంటున్నాను. హఠాత్తుగా పొత్తికడుపులో విపరీతమైన నొప్పి వచ్చింది. ఏంచెయ్యాలో తెలియలేదు. ఓర్చుకుందామని చూశాను కానీ, బాగా సెగ తగుల్తున్నప్పటి అన్నం పొంగులాగా పైకి బుస్సున తన్నుకొస్తోంది. కడుపంతా కుతకుత ఉడికిపోతోంది. ఇక నావల్ల కాదనిపించింది. మా పక్కింటామెను కేకేశానని నాకు లీలగా గుర్తు. ఆమె రావటం, ఆమెతో నేను ఏం చెప్పానో, ఎలా చెప్పానో ఇవేవీ నాకు గుర్తులేవు. స్పృహతప్పి పడిపోయాను. మళ్ళీ నేను కళ్ళు తెరిచేసరికి ఆస్పత్రిలో ఉన్నాను. నా చుట్టూ మా వాళ్ళంతా ఉన్నారు. మా అమ్మానాన్నలు వచ్చారంటే నాకేమై ఉంటుందా అని భయమేసి చూస్తే నా ఒక చేతికి సెలైను, రెండో చేతికి రక్తమూ ఎక్కి స్తున్నారు. పొట్ట పచ్చిపుండులా ఉంది. తర్వాత నాకు కాస్త ఓపిక వచ్చాక అమ్మ నాకు

మెల్లగా చెప్పింది. నా బిడ్డ గర్భసంచిలో పెరగలేదట. గర్భసంచికి ముందుండే ట్యూబులో పెరిగిందట. అదేమిటో, అలా ఎలా జరిగిందో నాకప్పుడేమీ అర్థం కాలేదుగానీ, జరగరానిది జరిగిందని మాత్రం తెలిసింది. ఆ పెరిగే అండం పగిలి నా పొత్తి కడుపు లోపలంతా రక్తపు మడుగైపోయిందట. డాక్టర్లు ఆపరేషన్ చేసి, లోపలంతా శుభ్రం చేసి మళ్ళీ కుట్టటానికి ఆరుగంటలపైగా పట్టిందట. ఆ ఆపరేషన్ వల్ల నాకు మరి పిల్లలు పుట్టే అవకాశంలేదట. "ఎలాగైతేనేం ప్రాణాలతో బతికి బైటపడ్డావు. మరి ముందు జీవితం ఏం కానుందో" అంది అమ్మ. నాకా మాటలు చాలా చిత్రంగా తోచాయి. అయినా, ఒకసారి నా స్థితి పరామర్శించుకునే ప్రయత్నం చేశాను.

పెద్ద ప్రళయం తర్వాత కూలిపోయిన కొంపలా ఉన్నాననిపించింది నన్ను నేను చూసుకుంటే. సాయంత్రం మధుసూదన్‌ని చూస్తూనే దుఃఖం పట్టలేకపోయాను. "ఊ- ఇంక ఏడ్చి ఏం లాభం? మన తలరాత అలా ఉంది" అన్నాడాయన నిష్ఠూరంగా. నా కొచ్చిన ఈ ఆపదకు ఆయన తల్లడిల్లిపోతాడనుకున్నాను. నా తల నిమురుతాడను కున్నాను. నా కన్నీళ్ళు తుడుస్తాడనుకున్నాను. "నేనున్నాను నువ్వెందుకు ఏడుస్తావని" నా చెయ్యి పట్టుకుంటాడను కున్నాను. ఇవేమీ లేకపోగా అతని కళ్ళల్లో నా మీద నిష్ఠూరం గూడు కట్టుకోవటం ఎందుకో నాకర్థం కాలేదు.

"నువ్వు పిల్లల్ని కనవని మీ అత్తగారికి నీ మీద నిష్ఠూరంగా ఉంది" అని మర్నాడు సాయంత్రం మా అమ్మ చెప్పేదాకా నాకు ఆయనలా ఎందుకున్నారో అర్థంకాలేదు, అర్థమయ్యాక అంతులేని భయం వేసింది. "అమ్మా-ఎట్లాగే-నేనేం చెయ్యనే" అన్నాను బెదిరిపోతూ. "ఏం చేస్తావు? ఎంత పాడు బతుకైపోయింది. బిడ్డనెత్తుకునే అదృష్టం లేకపోయె, ఇక వాళ్ళేం అన్నా భరించటం తప్ప ఏం చేస్తాం" అని అమ్మ నిస్సహాయతతో కూడిన నిష్ఠురత్వంతో ఏడవడం మొదలు పెట్టింది.

నాకు కన్నీళ్ళు కూడా రానంతగా భయం వేసింది. ఆ భయంలో నాకు అర్థమైందేమి టంటే నేను ఒంటరిదాన్ని. నాకొచ్చిన ఈ కష్టంలో నాతో పాటు సానుభూతి చెందటానికి ఎవరూ సిద్ధంగా లేరు. వీళ్ళందరికీ ఇక పిల్లల్ని కనలేననే విషయం తప్ప, నాకు జరిగిన ఘటన ముఖ్యమనపించటంలేదు. ఆఖరికి మా అమ్మతో సహా దిగులంతా పుట్టని, పుట్టలేని పిల్లల గురించే. ఇప్పటి నా బాధ, నేను కోలుకోవల్సిన స్థితి, నేనూ, నా శరీరం పొందుతున్న ఈ అనుభవం – వీటి గురించి ఎవరికీ శ్రద్ధలేదు. ఆసక్తిలేదు.

"ఎంత గండం గడిచిందమ్మా" అని హాస్పిటల్లో ఆయా అంటుంటే, "ఎవర్ని ఉద్ధరించ డానికీ? మొదల్లే వాడికి పడి ఏడవటానికి కాకపోతే ఎందుకు బతికినట్టు" అని గొణుక్కుంది మా అత్తయ్య.

పిల్లలు పుట్టకుండా ఉండడం నాకు కూడా బాధేననీ, నాకు కూడా లోటేననీ గుర్తుకు రానంతగా నా వల్ల మధుసూదన్‌కి వచ్చిన కష్టం పెరిగిపోయింది. అతనికి పిల్లలు లేకుండాపోతారు. అతని వంశం, అతని ఇంటిపేరు, అతని ఆస్తీ ఇవన్నీ నిష్ఫలమవు తున్నాయి. దానంతటికీ కారణం నేను. అందరూ ఈ రకంగానే ఆలోచిస్తున్నారు. నాకు వైద్యం జరుగుతోంది. మందులిస్తున్నారు కానీ, అన్నీ యాంత్రికంగా జరుగుతున్నాయి. నన్నొక పనికిరాని యంత్రంలా చూస్తున్నారు. మా ఇంట్లో పనికిరాకుండా అందరికీ అడ్డం వస్తూ పడివున్న పాత కుట్టుమిషన్‌ని విసుక్కుంటున్నట్టు విసుక్కుంటున్నారు.

నేను హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చాను. అమ్మానాన్నలు పనులున్నాయని వెళ్ళిపోయారు. వాళ్ళు నన్ను తమ వెంట తీసుకువెళ్ళటానికి భయపడుతున్నట్టు కనిపించారు. ఎందుకో నాకర్థం కాలేదు. వాళ్ళు నన్ను తీసుకెళ్ళనందుకు మా అత్తయ్య ఎన్నో నిష్ఠూరాలాడింది. ఈ గొడవంతటిలో మా ఆయన ప్రవర్తన నన్ను మరీ బాధించింది. నేనెందుకూ పనికిరానిదాన్నని ఆయన ఎలా అనుకుంటారు. పిల్లల కోసమేనా నన్ను పెళ్ళాడింది. స్నేహం, ప్రేమ, సాహచర్యం వీటికి అర్థమేలేదా? ఇన్నాళ్ళలాగానే నేను ఆయన చెప్పే కబుర్లు వింటూ, ఆయనకు కావల్సినవన్నీ అమర్చిపెడుతూ, ఆయనకు విశ్రాంతిని, సుఖాన్నీ ఇస్తూ ఆయనతో సినిమాలకూ, షికార్లకూ వెళుతూ ఉండకూడదా? అలా ఉండటానికి ఏమిటి అభ్యంతరం? పిల్లలు లేని ఆడవాళ్ళు ఎవరున్నారా అని గుర్తుతెచ్చుకున్నాను. వెంటనే రుక్మిణత్త గుర్తొచ్చింది. ఆమెకు పిల్లలు లేరు. ఆమెకు నలభై ఏళ్ళు వచ్చేంతవరకూ పిల్లలకోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. మొక్కని దేవుడులేడు. చూడని డాక్టరులేడు. పరీక్షలు, ఆపరేషన్‌లు, మందులూ ఒకపక్కా పూజలూ, వ్రతాలూ, నోములూ మరోపక్కా ఆమె జీవితమంతా ఆక్రమించేశాయి. ఆమె ఆలోచనలూ, పనులూ, ధ్యాస అంతా పిల్లల కోసమే. ఆమెను అందరూ జాలిగా చూసేవాళ్ళు. చివరకు పిల్లలు పుట్టరని తీర్మానించుకున్నాక మా మామయ్య తన తమ్ముడి కొడుకుని తెచ్చి పెంచుకున్నాడు. ఏమైనా పిల్లలులేని ఆడదానికి కష్టాలు తప్పవు.

అయితే, పెళ్ళి పిల్లల కోసమేనా? ఆడది పుట్టి పెరిగేది పిల్లల్ని కనడం కోసమేనా? మగవాడికి పిల్లల్ని కనివ్వటమేనా ఆడదాని జన్మ సాఫల్యం? ఆడదంటే ఒక గర్భసంచి, రెండు ఓవరీలేనా? అవి లేని నేనెందుకూ పనికిరాని దాన్నేనా?

ఆలోచించిన కొద్దీ నాకు తెలిసిన స్త్రీలలో ఎవరూ శాంతిగా లేరని అర్థమవుతోంది. కట్నం ఇచ్చి నేను పెళ్ళి చేసుకోగలిగాను గానీ, నా స్నేహితుల్లో కొందరు కట్నాలివ్వలేక పెళ్ళి కాకుండా ఉండిపోయారు. పెళ్ళికాక పోవటం వల్ల అందరూ చిన్నచూపు చూస్తుంటే

భరించటానికి చాలా యుద్ధం చేస్తున్నారు. ఇచ్చిన కట్నం చాలలేదనే అత్తింటి ఆరళ్లు భరించలేక నిర్మల, సరోజ ఆత్మహత్య చేసుకున్నారు. కమలను భర్తే చంపేశాడు. ఇద్దరినీ ఆడపిల్లలనే కన్నందుకు మా పక్కింటావిడ ఎంత చిత్రహింసో అనుభవిస్తోంది. ఇన్నాళ్ళూ వీటన్నిటికీ నేనెందుకింత గుడ్డిగా ఉన్నాను? దేశమంతా స్త్రీల ఆర్తనాదాలతో మారు మోగుతుంటే నేను అనురాగ దాంపత్యం గురించీ, ప్రేమనిండిన ఇల్లు గురించీ ఎలా కలలు కన్నాను? నాలాంటి లక్షలాది అజ్ఞానులు అలాంటి కలలు కంటూ, ఎక్కడా దొరకని ఆ ప్రేమకోసం వాళ్ళ రక్తాన్ని ఎలా ధారపోస్తున్నారు. ఎందుకిదంతా ఇలా జరుగుతోంది? ఈ ప్రశ్నలు నన్ను వేధిస్తున్నాయి.

ఇలా రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు మా అత్తయ్య నామీద హఠాత్తుగా దాడి మొదలుపెట్టింది. నా మూలంగా ఆమె కొడుక్కి శాంతిలేకుండా పోతోందట. చిక్కి శల్యమవుతున్నాడట. దిగులుతో కుంగిపోతున్నాడట. ఇది పెద్ద అబద్ధం. ఆయన నాతో ముభావంగా ఉంటున్నాడు తప్పితే మిగిలిన విషయాల్లో శుభ్రంగా ఉంటున్నాడు. ఆఫీసులో పనితగ్గింది. ఆరోగ్యం బాగుంది. కాస్త లావయ్యాడు. చిక్కి శల్యమవుతున్నది నేను. అలాంటిది మా అత్త ఈ దాడి నామీద ఎందుకు ప్రారంభించిందో తెలియలేదు. క్రమంగా ఇరుగు పొరుగు ఆడవాళ్ళు కూడా వచ్చి మా అత్తతో కలిసి మా ఆయన దిగులు గురించీ, చిక్కి పోవడం గురించి మధనపడడం ప్రారంభించారు. నేను ఒంటరిగా ఉన్నాను. ఒక్కదాన్నే కుమిలిపోతున్నాను. ఒకరోజు మా అత్త పరోక్షంగా కాక స్పష్టంగా తన అభిప్రాయం చెప్పింది. మా ఆయనకు వేరే పెళ్ళి చేస్తుందట. నేను భయంతో కంపించిపోయాను. సరిగా చూసినా, చూడకపోయినా నా ఇంట్లో నేనెలాగో పడి ఉంటున్నాను. నన్ను నా ఇంట్లోంచి పంపి, ఆయనకు పిల్లల్ని కంటానికి మరో ఆడదాన్ని తెస్తారట. నా భర్తనడిగితే "అమ్మ మనవలు కావాలంటోంది ఏం చెయ్యను" అన్నాడు కానీ, వాళ్ళమ్మను రెచ్చగొట్టింది ఈయనే అని అర్థమయింది ఆయన ధోరణి చూస్తే. "ఏం చేస్తారయితే" అనడిగితే నాకు విడాకులిచ్చి వేరే పెళ్ళి చేసుకుంటానన్నాడు. మొదటి మామూలుగా మొదలైన ఈ మాటలు చివరికి బెదిరింపులలోకి దిగాయి. నా అంతట నేను మర్యాదగా విడాకులిచ్చానా సరే లేకపోతే ఏ పద్ధతుల్లో విడాకులు తీసుకోవాలో తెలుసంటూ కొన్ని పద్ధతులు చెప్పాడు. అవి వింటే నాకు ఒణుకు పుట్టుకొచ్చింది.

మా అమ్మానాన్నలను పిలిపించారు. నన్ను తీసుకుపొమ్మన్నారు. వాళ్ళు నిస్సహాయంగా తలవంచటం తప్ప మరేం చెయ్యలేకపోయారు. నేనీ ఇంట్లోంచి వెళ్ళి పోవాలిట. ఇది నా ఇల్లు కాదట. అతనికి ఎవరు పిల్లల్ని కంటే ఆమె ఇల్లట. పెళ్ళినాడు చెప్పిన పవిత్రమైన మాటలకు అర్థం అతని వంశాన్ని పెంచినప్పుడేనట.

అంటే అతనికి పిల్లల్ని కనిపెంచే ఉద్యోగమిది. యాభైవేల రూపాయల లంచంగా ఇచ్చి కొనుక్కున్న ఉద్యోగమిది. ఆ ఉద్యోగానికి పనికిరాకుండా పోయాను గాబట్టి నన్ను తీసేసి వేరేవాళ్ళను పెట్టుకుంటాడు. ఇదీ అసలర్థం పెళ్ళికి. దాన్ని దాచి, మధ్యపెట్టి ప్రేమ, అనురాగం, దాంపత్యం – ఎందుకీ మోసం? ఎందుకంటే ఉద్యోగమంటే హక్కు లడుగుతారు. ప్రతిఫలం అడుగుతారు. బోనస్సు లడుగుతారు. ఇది దాంపత్యమంటే, ఇది పాతివ్రత్యమంటే, ఇది మాతృత్వమంటే ఒళ్ళు విరుచుకుని సేవలు చేస్తారు. ఏమీ అడక్కుండా ఇచ్చినదాంతో తృప్తిపడతారు.

మంచివాడై కాస్త ప్రేమ చూపించాడా, నెత్తిన పెట్టుకుని ఊరేగుతారు. అదీ ఇదీ కావాలని పోరితే గయ్యాళి అనే పేరెక్కడ వస్తుందో నన్న భయంతో ఉంటారు. ఇన్ని లాభాలుండగా దీన్ని పెళ్ళి అనక ఉద్యోగమనో, వ్యాపారమనో ఎందుకంటారు?

ఇది అర్థమైనకొద్దీ నాకోపం పెరుగుతోంది. ఇది అన్యాయం అని ఎలుగెత్తి అరవాలని ఉంది. అన్నింటికంటే ఆశ్చర్యం నా ఒంటరితనాన్ని గురించి, నాకొక కష్టమొస్తే పంచుకుని నాకు అండగా ఉండటానికి ఎవరూ లేరేం? నాతోటి ఆడవాళ్ళకు కూడా నా బాధ అర్థంకావటంలేదెందుకు? ఆ రోజు మధుసూదన్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ వేళ్ళు నరుక్కుని వస్తే ఎంతమంది యూనియన్ వాళ్ళొచ్చారు? ఎంత ధైర్యం చెప్పారు. యజమానుల దగ్గర వైద్యానికయ్యే డబ్బు తెచ్చిచ్చారు. మేమంతా నీకండగా ఉన్నామన్నారు. మాకు కష్టం వస్తే నువ్వురావా అన్నారు. మనమంతా ఒకటన్నారు. తిరిగి అదే ఉద్యోగం నిలిచేలా యాజమాన్యంతో పోట్లాడారు. కాంపెన్సేషన్ వచ్చేవరకూ కాళ్ళరిగేలా తిరిగారు. నాకు సైతం ధైర్యం చెప్పారు. అదంతా ఎంత బాగుంది. ఆయన దిగులు, వేదన ఒక్క రోజులో ఎలా మాయమయ్యాయి. ఉత్పత్తి కార్యక్రమంలో ఉన్నప్పుడు పనికిరాకుండా పోయినందువల్ల ఆ చేయి ఎన్ని రాయితీలు పొందింది. ఎంత సహకారం ఆ చేతిచుట్టూ వెల్లివిరిసింది. దాని వెనక ఎంత చరిత్ర ఉంది. ఎన్ని పోరాటాలూ, ఉద్యమాలూ ఉన్నాయి.

మరి నేను బిడ్డను కనబోతూ, ఆ పనిలో అనుకోకుండా యాక్సిడెంటల్‌గా ఒక ప్రమాదానికి గురైతే నాకీ ఒంటరితనమేమిటి? బహుశా నాకు జరిగిన ప్రమాదానికి కూడా ఆయనే కారణం కావచ్చు. ఆ కణం కలవకపోతే నా అండం ప్రతి నెలా విడుదలైనట్లే విడుదలై నిష్ఫలంగా రాలిపోయేదేమో. అతని కణమొకటి కలవటం వల్ల నా శరీరం శిథిలమయింది. ఒక ముఖ్యభాగం నా శరీరంనుంచి కత్తిరించబడింది. నా నెత్తిన గొడ్రాలనే పెద్దనింద పడింది. ఇదంతా బిడ్డను కనేక్రమంలోనే జరిగింది. భవిష్యత్తులో ఫ్యాక్టరీ యంత్రాలు నడిపో, బ్యాంకుల్లో లెక్కలు రాసో, ప్రాజెక్టులు కట్టో,

వైద్యం చేసో సమాజానికి ఉపయోగపడే ఒక బిడ్డను కనే క్రమంలోనే జరిగింది. సంతానాన్ని ఉత్పత్తి చేసే పనిలోనే జరిగింది.

అయినా నాకే రాయితీలూలేవు. నాకెవరి సహకారమూ లేదు. నా ఉద్యోగంలోంచి నన్ను తీసేశారు. నన్ను ఓదార్చేవారూ, నాకు ధైర్యంచెప్పేవారూ లేరు. నేను ఒంటరిగా ఉన్నాను. ఎందుకు? ఎందుకు? ఎందుకు? నా ఒంటరితనం వెనక ఉన్న కుట్ర ఎలా మొదలయింది? ఆడవాళ్ళందరూ ఒకటిగా ఎందుకులేరు? తల్లులుగా, భార్యలుగా, కూతుళ్ళుగా, అత్తలుగా, కోడళ్ళుగా, ఆడబిడ్డలుగా ఎందుకు విడిపోయారు. ఎవరు విడగొట్టారు? దాంపత్యం పేరిట, మాతృత్వం పేరిట ఎందుకింత మోసం చేస్తున్నారు? ఈ మోసం ఎవరికేలాభాలను ఆర్జించి పెడుతుంది? ఇది తెలుసుకోవాలి. ఒక పిడికిలిలా బిగుసుకోకుండా ఆడవాళ్ళు మొండిచేతుల్లా ఒకరొకరే ఎందుకైపోయారో తెలుసుకోవాలి.

నాలాగే ఆక్రోశించేవారూ, ఆత్మహత్యలకు తరమబడుతున్న వారూ ఎందరో - వారందరితో కలవాలి. అదే నా జీవిత గమ్యమని ఇవాళ నాకు నిశ్చయంగా తెలిసి పోయింది. నా జీవిత సాఫల్యం ;ా మాంగల్యంలో లేదు. నా పతి సేవల్లో లేదు. నేను కనలేని సంతానంలో లేదు. నా తోటి స్త్రీలందరితో చేయికలపటంలోనే ఉంది.

*డిసెంబర్ - జనవరి 1992*

ఇండియా టుడే

9

# కేసు

"కేసు విషయం తెలిసిందా? విన్నారా?"

రంగారావు ఊపిరితీసుకునే వ్యవధానం కూడా లేకుండా మెట్లెక్కివచ్చాడని తెలుస్తోంది.

రంగారావే కాదు. ఆ హాల్లో వున్న పదిమంది మగవాళ్ళూ మెట్లెక్కి వచ్చి పదిహేను యిరవై నిమిషాలైనా ఎవరూ సరిగా వూపిరి పీల్చుకోవటం లేదు.

"ఇక దేశానికి మోక్షం లేదండి" విశ్వనాథ్ నిట్టూర్చాడు.

"ఇప్పుడేమిటి ఆడవాళ్లకు చదువులని ఎప్పుడు మొదలెట్టారో అప్పుడే దేశం నరకంవైపు నడవటం మొదలైంది" సత్యనారాయణ తేల్చి చెప్పేశాడు.

"ఎంతధైర్యం".

"ధైర్యమా? సిగ్గులేనితనం".

"ఏదో ఒకటి – ఆమెగాని నెగ్గిందంటే రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే".

"ఆమె రొట్టె ఏమిటి – ఆడవాళ్ళందరి రొట్టె" అప్పుడే ఆ హాల్లోకి వస్తున్న అమితను చూసి కావాలనే పెద్దగా అన్నాడు సుందరం.

వాళ్ళే విషయం గురించి అంత కలవరంగా మాట్లాడుకుంటున్నారో అమితకు ముందుగానే తెల్సుగనుక పెద్దగా ఆశ్చర్యపడకుండా తన చేతిలో కాగితాలతో విశ్వనాథ్ టేబిల్ దగ్గరికి నడిచింది. విశ్వనాథ్ అది చూసి తప్పనిసరై తన టేబిల్ దగ్గరకు నడిచాడు.

"ఏంటమ్మా – తెల్లారిందా సందేహాలకు" అంటూ.

అమిత నవ్వి తన సందేహం అడిగింది. విశ్వనాథ్ చెప్పాడు. అమిత వెళ్ళటానికి లేచింది. విశ్వనాథూ లేచాడు. సత్యనారాయణ టేబిల్ దగ్గర చేరిన గుంపు పెద్దగా నవ్వింది.

"ఏంటయ్యా – నాక్కూడా చెప్పండి".

విశ్వనాథ్ హడావుడిగా అటువైపు నడిచాడు.

"ఏం లేదు సామెతలన్నీ మార్చాలి. కొత్త సామెతొకటి కనిపెట్టాం విందురు గాని రండి". అందరూ మళ్ళీ పెద్దగా నవ్వారు.

అమిత వాళ్ళను పట్టించుకోకుండా వెళ్ళబోయింది.

"అమిత గారూ – మీరూ వినండి" రంగారావు ఆహ్వానించాడు.

"నేను వినను" అమిత కోపంగా సీరియస్‌గా అంది. అందరూ ఒక్కసారి నిశ్శబ్దమై పోయారు.

"ఇప్పుడు టైము ఎంతయింది? పదకొండు గంటలు. ఇంతవరకూ మీరెవరూ పనిలో వేలు పెట్టలేదు. మరో రెండు గంటలిలా గడిపేస్తే లంచ్ టైం అవుతుంది – రోజులో ఎన్ని గంటలు పనిచేస్తున్నారు? మీకు రమ్య పెట్టిన కేసు గురించి హాస్యంగా మాట్లాడే హక్కేం ఉంది? ఆ నెపం మీద మీరు ఆడవాళ్ళందరినీ ఎగతాళి చెయ్యటం ఏమీ బాగోలేదు" అమిత మాట పూర్తవుతూనే అక్కడి నుంచి బైటికి పోయింది.

"దీనమ్మ... ఎంత పొగరు" అన్నాడు రంగారావు.

అందరూ కేసు సంగతి పక్కనపెట్టి అమిత తలపొగరు గురించి కాస్త నెమ్మదిగా మాట్లాడటం మొదలెట్టారు.

* * *

"రమ్యా" సుధాకర్ కోపంగా పిలిచాడు.

నిద్రపోతున్న బాబు ఉలిక్కిపడ్డాడు. రమ్య వాడిపొట్టమీద చెయివేసి జోకొట్టింది.

బాబు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. రమ్య హాల్లోకి వచ్చింది.

"రమ్యా నువ్వు వెంటనే కేసు విత్‌డ్రా చేసుకో"

రమ్యను చూస్తూనే ఎగిరిపడ్డాడు సుధాకర్.

"అదేంటి - ఎందుకు విత్‌డ్రా చేసుకోవాలి?" చిత్రంగా చూసింది.

"ఎందుకంటే నేను కాస్త నలుగురిలో తిరగాలి కాబట్టి. అందరూ మన గురించి అనే మాటలు వినలేక చస్తున్నాను కాబట్టి. నా మీద - కేవలం నామీద జాలితో ఆ కేసు ఎత్తెయ్"... ఆవేశంగా అరుస్తున్న సుధాకర్‌ని విస్తుపోయి చూసింది రమ్య.

"ఏంటట్లా చూస్తావు? రేపొద్దునే లాయర్ దగ్గరకు వెళ్ళి చెప్పు. లేదా యిప్పుడే వెళ్దాం పద".

"నేను కేసు విత్‌డ్రా చేసుకోను" స్థిరంగా అంది.

"చేసుకోవూ?"

"ఊహూ"

సుధాకర్ కోపంతో వూగిపోతూ ఏంచెయ్యాలో తెలియక టీపాయ్‌మీద వున్న వస్తువులన్నీ కిందికి దొర్లించి పడకగదిలోకి వెళ్ళి పడుకున్నాడు. రమ్యకు బాబు కదిలిన అలికిడి వినిపించి వాడి గదిలోకి వెళ్ళింది. వాడు బట్ట తడుపుకున్నాడు. ఇబ్బందిగా అటూ యిటూ కదుల్తూ బద్ధకంగా ఆవలిస్తున్నాడు. రమ్య వెళ్ళి తడిచిన నాప్‌కిన్ తీసేసి వాడి తొడలూ పిర్రలూ పొడిగుడ్డతో శుభ్రంగా తుడిచి కాస్త పౌడర్ జల్లి మళ్ళీ వేరే నాప్‌కిన్ కట్టింది. వాడు మళ్ళీ నిద్రకు పడ్డాడు. రమ్య వాడికి వెచ్చగా కప్పి వంటింట్లోకి వెళ్ళింది. బాబు లేస్తాడనే హడావుడితో పనులు చేసుకోవటం వల్ల ఈ మధ్య వంటిల్లు పద్ధతీ పాడూ లేకుండా తయారయిందనిపించింది రమ్యకు.

ఇపుడు సర్దే అవకాశం లేదు - బాబు ఏ క్షణాన్నయినా లేవచ్చు. గబగబా వంటపనిలో పడింది. అంతా అరగంటలో ముగించటానికి నరాలన్నిటినీ విపరీతంగా అలవగొట్టుకుని చివరికి ముగించి, రాబోతుంటే మర్నాడు టిఫిన్‌కి పప్పు నానబోయాలని గుర్తొచ్చింది. పెసలు తీసి రెండుసార్లు శుభ్రంగా కడిగి నానబోసింది. పనయిపోయిందనుకుంటే పాలు కాచి తోడెయ్యాలని గుర్తొచ్చింది. దగ్గరుండి కాచకపోతే పొంగిపోతాయి. పాలుకాచి, మళ్ళీ మర్చిపోతానులే ఆలస్యం ఎందుకని వాటిని వెంటనే చల్లార్చి తోడేసింది.

స్నానానికి నీళ్ళు పెట్టింది స్టవ్ మీదనే - అంతలో బాబు లేవనే లేచాడు. వాడిది పెద్ద గొంతు. ఆకలైందా యిక ఒక్కక్షణం వూరుకోడు. ఇల్లంతా అదరగొడతాడు. రమ్య గబగబా వెళ్ళి వాడిని పక్కలో వేసుకుంది.

"సుధా - నీళ్ళు పొయ్యిమీద పెట్టాను. ఒక పదినిమిషాల్లో వెళ్ళి స్నానం చెయ్యి" కేకేసి చెప్పింది.

"నేను చెయ్యను. నన్నడక్కుండా ఎందుకు పెట్టావు"

సుధాకర్ కోపం యింకా తగ్గలేదు.

"ఐతే స్టవ్ ఆర్పేయ్"

"నేనార్పను. నాకా స్టవ్‌తో సంబంధంలేదు" మొండితనం చేస్తున్న పిల్లాడిలా అన్నాడు. రమ్యకు నవ్వొచ్చింది - "సరే నేను చేస్తాలే. వుంచెయ్".

సుధాకర్ విసురుగా వెళ్ళి స్టవ్ ఆర్పి రమ్య దగ్గరకు వచ్చాడు.

"ఇక్కడ అరవకు. వీడు ప్రశాంతంగా పాలు తాగుతున్నాడు" మెల్లిగా చెప్పింది రమ్య.

సుధాకర్ తల్లీ కొడుకులకు ఎదురుగా కూచున్నాడు.

బాబు పాలు తాగటం, రమ్య ఆనందం, వాడి తృప్తి - యివన్నీ చూస్తూ సుధాకర్ కోపం మర్చిపోయాడు. రమ్యంటే ఆ క్షణంలో అంతులేని ప్రేమ కలిగింది. మెల్లిగా రమ్య వీపు మీద చేయివేసి -

"రమ్యా - ఐ లవ్ యూ" అన్నాడు.

రమ్య మధురంగా నవ్వింది. ఐదు నిముషాలు ఆ గదిలోని ముగ్గురు ప్రాణులూ అదొర రకమైన అలౌకికానందంలో ఉండిపోయారు.

ముందుగా తేరుకుంది బాబే - వాడి చిన్న బొజ్జ నిండిపోయింది. పాలు తాగడం మాని తల్లి రొమ్ములతో ఆడుతున్నాడు. రమ్య వాడిని లేపి భుజాన వేసుకుని మెడమీద సవరిస్తే తేన్చాడు.

పెద్దభారం దిగినదానిలా ఫీలయింది రమ్య -

వాడు పాలుతాగాక తేన్పు రాకపోతే, మూడు పూటలా విరోచనం కాకపోతే రమ్యకు భయం, టెన్షన్, అవి సక్రమంగా జరిగిపోతే నిశ్చింతగా హాయిగా ఉంటుంది.

బాబు మళ్ళీ పక్క తడిపాడు.

"వీడు రోజుకెన్నిసార్లు పోస్తాడు" విసుగ్గా అన్నాడు సుధాకర్. రమ్య కిలకిలా నవ్వింది.

"పాపం చలికాలం కదా".

"ఐతై మటుకు పదినిమిషాల కోసారా?"

"నీ మొదటి చలికాలంలో నువ్వెన్నిసార్లు పోసేవాడివో మీ అమ్మనడుగుతాలే - మా అబ్బాయికి దిష్టి పెట్టకు" రమ్య ఉచ్చగుడ్డల్ని అంత యిష్టంగా ఎట్లా పట్టుకుంటుందో సుధాకర్‌కి అర్థంకాలేదు.

"అన్నం తిందామా?" అడిగింది రమ్య.

"అప్పుడే" -

"అప్పుడే ఏంటి - ఏడున్నరవుతోంది. నాకు ఆకలిగా ఉంది. వాడికిపాలిస్తాను కదూ. ఒకటే ఆకలి, దాహం. ఎంత తినూతాగూ హరించుకుపోతున్నాయి" రమ్య వంటింట్లోకి వెళ్ళి అన్నాలు పెట్టింది. ఆకలితో ఆమె ఆవురావురుమని తింటుంటే సుధాకర్‌కు వాదించాలనిపించలేదు.

"రమ్య పాపం చాలామంచిది. ఆ కాస్త చాదస్తమూ లేకపోతే" అనుకున్నాడు. భోజనా లయ్యాక బాబుతో ఆడుతుంటే కాలం ఇట్టే గడిచిపోయింది.

"నాకు నిద్ర వస్తోంది గానీ కాస్త నిదానంగా నే చెప్పిన విషయం ఆలోచించు" అని పడుకోటానికి వెళ్ళాడు.

బాబు నిద్రపోయేవరకూ రమ్యనిద్రపోటానికి లేదు. వాడి నిద్రవేళ పదకొండు గంటలు. అప్పుడు పాలుతాగి పడుకుంటే తెల్లవారి ఐదు గంటలు దాకా లేవడు. "చాలా అదృష్టం తల్లీ - మా పాప అరగంటకోసారి లేస్తుంది. ఏదో చికాకు పెడుతుంది. ఎందుకో అర్థంకాదు. రాత్రిళ్ళు నిద్రలేక చస్తున్నాను" అంటుంటి పక్కింటి మీనాక్షి.

రమ్య బాబు గుప్పిళ్ళలో చూపుడు వేళ్ళు దూర్చి వాటిని మెల్లగా తన బుగ్గలకు రాసుకుంది. బాబు నవ్వుతున్నాడు కాళ్ళు సైకిల్ తొక్కుతున్నట్లు వేగంగా కదిలిస్తూ. వాడిని చూస్తుంటే ఒక పక్క సంతోషం మరోపక్క ఏదో బరువు రమ్య మనసులో -

రమ్య సుధాకర్‌లది ప్రేమ వివాహం. పెద్దవాళ్ళ నెదిరించి కులాంతర వివాహం చేసుకున్నారు. పెళ్ళయిన రెండోయేట బాబుపుట్టాడు. రమ్యకు పనంటే ఎప్పుడూ వెరపులేదు. సుధాకర్‌కు మాటలు చెప్పటం తప్ప పనిచేయటం రాదు. సుధాకర్ కన్నవారింట్లో మగవాళ్ళను గారాబం చేసి చెడగొడతారు. తల్లీ అక్కచెల్లెళ్ళు కలిసి సుధాకర్‌ను పూర్తిగా చెడగొట్టారు. రమ్య మూడేళ్ళలో సుధాకర్‌ని చాలా మార్చింది. అంటే తన పనులు తను చేసుకునేలా చేసింది. సహజంగా కష్టపడే స్వభావం గనుక ఒకోసారి సుధాకర్ బద్ధకాన్ని చూసీ చూడనట్టు వూరుకునేది. గారాంమటుకు సాగనిచ్చేది కాదు. రమ్యకు చాలా విషయాల్లో నిశ్చితాభిప్రాయాలు ఉన్నాయి. స్త్రీల విషయంలో, కులాల విషయంలో ఆమెవి చాలా అభ్యుదయ భావాలు. సుధాకర్‌కు భావాలవరకూ

పేచీలేదు. నిజానికి ఆ భావాలు నచ్చే ఆమెని ప్రేమించాడు. కానీ ఆచరణ దగ్గరకు వచ్చేసరికి అతనికి శక్తి చాలేది కాదు. ఏదో బలహీనత ఆవరించేది. ఏదో ఒకమాట స్త్రీలను కించపరిచేది అతని నోటినుండి రానే వచ్చేది. రమ్య వెంటనే పోట్లాటకు దిగేది. సుధాకర్ తప్పు ఒప్పుకుని చెంపలేసుకునేవాడు. రమ్య శాంతించేది. కానీ ఈ సారి సుధాకర్‌ని శాంతింపజేయటం కష్టమే. 'ఇది పబ్లిక్‌లోకి వెళ్ళిపోయింది. ఎట్లాగో' – రమ్య ఆలోచనలో పడింది.

* * *

"నీ స్వంత సమస్యల్ని ఆఫీసుతో ముడిపెట్టి కోర్టుకెక్కటం మంచిదికాదు. ఈ కేసుకు అర్థంలేదు" అన్నాడు ఆమె కలిసిన మొదటి లాయరు కళ్యాణ చక్రవర్తి. వూళ్ళో చాలా పేరున్న లాయరు. ఎలాంటి గడ్డుకేసునైనా వాదించి గెలిపిస్తాడని అంటారు. అందుకే అతని దగ్గరకు వెళ్ళింది. అతని మాటలు వింటే అతనికి 'లా' పాయింట్లు తెలుసుగానీ కొత్త 'లా'లు తయారు చేసేంత శక్తి లేదని అర్థమైంది. ఆడవాళ్ళంటే చులకన అని ముందే తెలిసింది. ఇక మగ లాయర్లు ఒద్దని ఆడవాళ్ళ దగ్గరకు వెళ్ళింది రమ్య. వాళ్ళూ "ఇదేం కేసూ" అన్నారు.

చివరకు కల్పన దొరికింది. రమ్య చెప్పింది వినగానే ఎగిరి గంతేసింది. లేచి రమ్యను కావలించుకుంది.

"అసలు మీకీ ఆలోచన ఎలా వచ్చిందండీ" అని తెగ మురిసిపోయింది. "మీకెందుకు నేను రాస్తాను చూడండి పిటిషన్" అని ఆకాశాన్ని అందుకున్నట్లు సంబరపడిపోయింది.

రమ్య, కల్పనా ఇద్దరూ ఒక రోజంతా కలిసి కూర్చుని పిటిషన్ తయారు చేశారు. సారాంశం ఇది.

"నేను ఆగస్టు నెలలో తల్లినయ్యాను. అక్టోబర్ వరకూ నాకు మెటర్నిటీ లీవు ఉంది. ఐతే పిల్లవాడు నా పాలే తాగుతున్నాడు. అవే బిడ్డ ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లు చెప్పారు. ఆరు నెలల వరకూ బిడ్డ ప్రధానంగా నా పాలమీదే ఆధారపడతాడు. ఆ తర్వాత బిడ్డ ఆరోగ్య పరిస్థితిని బట్టి నా పాలు ఎన్నిసార్లు యివ్వటం అనేది నిర్ణయించు కోవాలి. కాబట్టి నాకు ఆరు నెలలు పూర్తి శలవు కావాలి. నాకే కాదు ప్రతి తల్లికీ కావాలి. తల్లిపాల గురించి ఎంతగానో ప్రచారం చేస్తున్న ప్రభుత్వానికి నా కోరికలోని ఔచిత్యం బాగా అర్థమవుతుందని ఆశిస్తాను.

తర్వాత, బిడ్డకు సంవత్సరం దాటే వరకూ తల్లి సంరక్షణ ఎక్కువ కావాలి గనుక నా పని గంటలు ఎనిమిది నుంచి నాలుగుకు తగ్గించాలి. సంవత్సరం దాటిన తర్వాత

మా ఆఫీసులో క్రష్ వుంటే నేను ఎనిమిది గంటలు పనిచేయగలుగుతాను. లేని ఎడల బిడ్డ మూడేళ్ళు నిండేవరకు నాల్గు గంటలు మాత్రమే నా పనిదినంగా ప్రకటించాలి. నాకే కాదు ఉద్యోగం చేసే స్త్రీలందరికీ యిట్లాగే నిర్ణయించాలని వాళ్ళందరి తరపునా కోరుతున్నాను. తల్లిపాలు, సంరక్షణా బిడ్డకు జన్మహక్కని, బిడ్డ ఆరోగ్యానికవి అత్యవరమనీ ప్రభుత్వం అంగీకరిస్తుంది గనుక బిడ్డకు అవి అందేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను గుర్తుచేస్తూ నేను న్యాయస్థానం ముందుకి వస్తున్నాను".

ఇది చదివిన రోజు సుధాకర్ "ఫూలిష్‌నెస్" అన్నాడు.

"ఇది ఎక్కడా జరగదు" అన్నాడు.

"ఎందుకు జరగదు. ఆరునెలల మెటర్నిటీ లీవు చాలా దేశాల్లో ఉంది".

"వుందేమో – గవర్నమెంటు ఆ డిమాండ్లను విధిలేక ఒప్పుకున్నా, ఆ తర్వాత ఆడవాళ్ళను పనిలోకి తీసుకోదు".

"యాభైశాతం రిజర్వేషన్ కోసం ఆందోళన చేస్తాం"

"ప్రైవేటు ఉద్యోగాలు చచ్చినా యివ్వరు"

"ప్రైవేటు సంస్థల్లో కూడా రిజర్వేషన్ అమలు జరిగేలా చేయాలని పోట్లాడతాం"

"అసలు యిదెక్కడిగొడవ. నువ్వు పిల్లాడ్ని కన్నావు. ఎన్ని కష్టాలైనా పడి వాడిని పెంచుకుంటావు. అది నీ వ్యక్తిగత సమస్య. లాస్ ఆఫ్ పేనో, ఉద్యోగం మానేస్తావో అదంతా నీ తలనొప్పి. మధ్యలో ప్రభుత్వం ఏంచేస్తుంది. ఏదో మూడు నెల్లు శలవు యివ్వనే యిచ్చింది".

"పిల్లాడ్ని కనటం నా వ్యక్తిగత విషయమా?" రమ్య గొంతులో సీరియస్‌నెస్‌కి అదిరి పోయాడు సుధాకర్.

"నీదంటే – పోనీ మనది" అని నీళ్ళు నమిలాడు.

"దాంతో ప్రభుత్వానికేమీ సంబంధం లేదా?"

"ఏముంది...? లేదు" ఈ మాత్రం తెలియదూ అన్నట్లు నిశ్చింతగా చెప్పాడు.

"ఎవరికీ సంబంధం లేదా?"

రమ్య అజ్ఞానానికి సుధాకర్‌కి జాలేసింది.

"లేదు– ఎందుకుంటుంది? మనిద్దరం పిల్లలు కావాలనుకున్నాం, కన్నాం. అంతే – మిగిలిన వాళ్ళకేం సంబంధం?"

"మనం ఎవరం?" రమ్య గొంతు కంగుమంది.

"అదేంటి? అదేం ప్రశ్న" నవ్వాడు సుధాకర్

"మనం ఎవరం? సూటిగా చెప్పు – కాస్త మెదడు ఉపయోగించు"

"మనం ఎవరం అంటే – ఇద్దరు మనుషులం" అయోమయంగా చూశాడు.

"ఫూల్ – రాజ్యాంగంలో మనిద్దర్నీ ఏమంటారు?"

"అదా? పౌరులు అంటారు".

"అమ్మయ్య – వెలిగిందా బల్బు. మనం పౌరులంగదా, సమాజంలో భాగం కదా – సమాజానికీ మనకీ సంబంధం ఉంది గదా".

"ఊ ఐతే" రమ్య ఎటు తీసుకుపోతోందో సుధాకర్‌కి అర్థం కాలేదు.

"మనం సమాజంలో భాగం కాబట్టి మనం చేసే పనులకూ, సమాజానికీ సంబంధం ఉంటుంది. నేను పిల్లాడ్ని కన్నాను అంటే ఆ పిల్లాడు నా ఒక్కదానికేనా? మనింట్లో ఆవు కాదు గదా ఆ పిల్లాడు. మన పెరట్లోని జామచెట్టు కాదుగదా ఆ పిల్లాడు. వాడు పెరిగి పౌరుడవుతాడు. సమాజంలో భాగమవుతాడు. వాడు నాకు వ్యక్తిగతంగా ఏం చేస్తాడో చెయ్యడో గానీ సమాజానికి మటుకు కొంత చేస్తాడు. అలాంటి పిల్లాడిని కని పెంచటం నా సొంత సమస్యా?"

"నువ్వు చెప్పేదాంట్లో నాకేం అర్థం కనిపించటంలేదు" సుధాకర్ మొండిగా అన్నాడు.

"అర్థవంతంగా మాట్లాడితే అర్థం కానపుడు అడ్డం తిరిగి మాట్లాడటమే మందు. ఆడవాళ్ళందరూ మేం పిల్లల్ని కనం అంటారనుకో ఏం చేస్తారు?"

"ఛా – అలా ఎందుకంటారు?"

"అనక చస్తారా? పిల్లల్ని పెంచలేకపోతే అంటారు. అంటే ఏంచేస్తారు? సమాజం ఏమవుతుంది? ప్రపంచం ఆగిపోదూ? సృష్టి సర్వనాశనం కాదూ? ఆడవాళ్ళు సృష్టిని కొనసాగించటంలో బరువైన బాధ్యత ఉన్న పాత్ర వహిస్తుంటే వాళ్ళకు సౌకర్యాలు కల్పించటం మీ విధి కదూ – అట్లా కల్పించరు. ఇళ్ళల్లో భార్యలకు కనీసం సహాయం చెయ్యరు. ఆడవాళ్ళు తమ స్వంత పూచీకత్తు మీద తమ శరీరాన్ని కష్టపెట్టి మనసుని అలవ గొట్టుకుని ఎందుకు కనాలి? పెంచాలి? వాళ్ళు పిల్లల్ని ఎందుకు కంటారు? కనరు – కనరు" రమ్యకు కోపం పెరిగిపోయింది. సుధాకర్‌కి కూడా రమ్య మాటల్లో కొంత న్యాయం ఉందనిపించింది. అప్పటికావాదం అలా ముగిసింది.

* * *

రమ్య కేసు యింకా కోర్టు కెళ్ళకుండానే చాలామందికి తెలిసింది. కల్పన స్నేహితుడు ఒక జర్నలిస్టు. కల్పన మాటల సందర్భంలో యిలా కేసు పెట్టబోతున్నాం, చాల

కొత్తకేసు అని చెబితే దానిని ముందే వార్తగా రాశాడు. ఆ పత్రికలో రమ్య ఇంటర్వ్యూ ఒకటి వేశారు. అది చదివిన కొందరు మగవాళ్ళు, ముఖ్యంగా తన కొలీగ్స్ చేసిన కామెంట్స్ వినలేక సుధాకర్ రమ్య మీద ఎగిరిపడ్డాడు.

ఆ కామెంట్స్ రమ్య వూహించనివి కాదు. తన ఆఫీసులో మగవాళ్ళు తాము వాళ్ళతో సమానంగా పనిచేసి వాళ్ళతో సమానంగా జీతాలు తీసుకుంటుంటేనే చూడలేక పోతున్నారని తెలుసు. ఆడవాళ్ళ సంపాదన గురించి మగవాళ్ళ అభిప్రాయాలు సేకరిస్తే స్త్రీ పురుష విభేదాల మీద మంచి రీసెర్చి గ్రంథమవుతుంది. ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళు అవివాహితలైతే–

"రాజుల సొమ్ము రాళ్ళపాలు, మగువల సొమ్ము మఫత్‌లాల్ పాలు".

"మఫత్‌లాలేమిటి – విమల్, గార్డెన్, మైసూర్ సిల్కు – అబ్బో ఫస్టు తారీకున చూడు చీరెల కొట్లల్లో జనం – యిసుక వేస్తే రాల్తుందా?"

"కట్నం కోసం మరి కష్టపడొద్దూ"

"డబ్బంతా మూటగడితే లాభం లేదురోయ్ – అసలైంది పోతుందిగా–" వెకిలి మాటలు. పెళ్ళయిన ఆడవాళ్ళనైతే –

"రెండు జీతాలు. ఇంట్లో తిని కూచోలేక ఉద్యోగాలకు బయల్దేరతారు".

"ఉద్యోగాల్లేక మగాళ్ళేడుస్తుంటే ఎక్కడి ఉద్యోగాలకూ వీళ్ళు ఎగబడతారు".

"ఆఫీసర్ని యిట్టే బుట్టలో వేసేస్తారు. హొయలు గుమ్మరిస్తే సరి పని చెయ్యనక్కర్లేదు".

"రుచిగా ఏమన్నా వండి తెచ్చిపెడుతుంటే సెక్షన్ హెడ్లూ ఏమనరు".

"కట్టిన చీరెకట్టకుండా, ఇస్త్రీ మడత నలక్కుండా – ఏం హొయి – ఏం హొయి"

ఈ మాటలన్నీ రమ్య స్వయంగా విన్నది.

ఇప్పుడు తను పెట్టిన కేసుతో పురుష ప్రపంచం యావత్తూ పిడుగుపడ్డట్టు తల్లడిల్లి పోతుందనీ తెలుసు. పురుష ప్రపంచం సంగతి తర్వాత, ముందు తన పురుషుడే తట్టుకునేలా లేడు. రమ్య ఆలోచనలు తెగకుండానే బాబు మళ్ళీ ఉచ్చ పోశాడు. రమ్య మళ్ళీ ఆ పనిలో పడింది. రాత్రంతా నిద్రకాచి తెల్లారి యింటెడుపనీ చేసుకుని, పిల్లాడికి పాలిచ్చి, యివ్వని పాలు రొమ్ముల్లో సలపరిస్తుంటే నిలవరించుకుని స్త్రీలు పనిచేస్తుంటే, వాళ్ళకూ మగవాళ్ళకూ ఒకటే రూల్సా? ఒకటే పని గంటలా? ఇదన్యాయం కదూ!

ఎవరికీ ఎందుకర్థం కాదు? ఆడవాళ్ళక్కూడా ఎందుకర్థం కాదూ? ఎందుకంటే – ఆడవాళ్ళూ మనుషులనే నమ్మకం మానవజాతికింకా పూర్తిగా కలగలేదు గనక అనిపించింది రమ్యకు.

మర్నాడు ఉదయం సుధాకర్ ముభావంగానే తన పనులు చేసుకుని రెడీ అయివచ్చాడు.

"ఇవాళ ఆఫీసుకు శలవపెట్టాను. ఇద్దరం వెళ్ళి కల్పనగారితో మాట్లాడి కేసు మానేస్తున్నామని చెప్పి వద్దాం" అన్నాడు యిక దానికి తిరుగులేదన్నట్లుగా.

"సుధా – నా దృష్టిలో కేసు చాలా ముఖ్యమైంది. గెలుస్తానో ఓడుతానో అది వేరే విషయం. ఆడవాళ్ళకు సంబంధించి ఒక విషయాన్ని చర్చకు పెడుతున్నాను. అందర్నీ మాట్లాడనివ్వు. ఎవరి సంస్కారాలను బట్టి వాళ్ళు మాట్లాడుతారు. ఆ మాటల్ని బట్టి మనం నడుచు కోవాలంటే కుదిరే పనేనా? మనల్ని అడుగు తీసి అడుగు వెయ్యనిస్తారా? అంతెందుకు – మన పెళ్ళి గురించి ఎంతమంది వ్యతిరేకంగా మాట్లాడలేదూ? మనం ఆగామా? ప్లీజ్ – ముందు నువ్వు అర్థంచేసుకో నీకు సానుభూతి ఉంటే ఎదటివాళ్ళ నోళ్ళు మూయించ గల్గుతావు. అసలు నీకే నా మీద సానుభూతి లేదంటే, నేనడుగుతున్నది అన్యాయంగా కనపడుతోందంటే నాకు చాలా బాధగా ఉంది".

రమ్యకు కన్నీళ్ళు వచ్చి మాటలు ఆగిపోయాయి.

సుధాకర్ నిస్సహాయంగా రమ్య వంక చూస్తూ నిల్చుండిపోయాడు. ఇవాళ పిటిషన్ ఫైలు చేస్తే కొద్ది రోజుల్లో కేసు హియరింగ్‌కి వస్తుంది. మళ్ళీ పేపర్లన్నీ రాస్తాయి. అందరూ చెత్తగా మాట్లాడతారు. ఇదంతా ఎన్ని రోజులు జరుగుతుంది? ఎప్పటికి, ఎలా ముగుస్తుంది? సుధాకర్ కోపాన్ని తగ్గించుకోలేకా, పెంచుకోలేకా కుర్చీలో కూలబడ్డాడు.

రమ్య పనులన్నీ ముగించుకుని బాబుని నిద్రపుచ్చి ఒక గంటలో వస్తానని సుధాకర్‌కి బాబు గురించి లక్ష జాగ్రత్తలు చెప్పి బైటపడింది.

ఆ సమయంలో బాబు దాదాపు రెండు గంటలు నిద్రపోతాడు. ఆ నమ్మకంతోనే తను ఆ లోపు వస్తుందనే ధైర్యంతోనే రమ్య కల్పన దగ్గరకు వెళ్ళింది. కల్పనకు ఆ రోజు పెద్ద పనిలేదు. తన స్నేహితురాలు వసంతతో మాట్లాడుతోంది. రమ్యను చూడగానే ఉత్సాహంగా వసంతకు పరిచయం చేసి మరింత ఉత్సాహంతో కేసు విషయం చెప్పింది. అది విని వసంత చాలా సంతోషిస్తుందని ఆమె ఉద్దేశం. కానీ కల్పన ఆశించిన ఉత్సాహం వసంతలో కనిపించలేదు. ఆమె ఆలోచనలోపడింది.

"ఏంటీ తల్లీ – స్త్రీల హక్కుల గురించి యింత ఎక్సయిటింగ్ వార్త చెబితే ఏదో వేదాంత విషయం విన్నట్లు ముఖం పెట్టావు" అని కసురుకుంది కల్పన.

"కేసు బాగానే ఉంది గానీ – దీనివల్ల ఆడవాళ్ళ మీద మాతృత్వ భారం మరింత పెరిగిపోదా అని – పిల్లల్ని పెంచటం వాళ్ళ పనే అని స్థిరపడిపోదూ? మూడునెల్లు

పిల్లల్ని రాత్రింబగళ్ళూ చూసుకునే సరికి పిచ్చెక్కిపోయే ఆడవాళ్ళకి ఆఫీసు పెద్ద రిలీఫ్‌గా ఉంటుందేమో. క్రష్‌లోనో, పెద్దవాళ్ళుంటే వాళ్ళదగ్గరో, పనివాళ్ళ దగ్గరో ఎలాగో పెరుగుతారు పిల్లలు. ఆరు నెలల మెటర్నిటీ లీవు రీజనబుల్. ఆ తర్వాత నాలుగ్గంటల పనిదినం - ఏమోనబ్బా నాకు నచ్చటంలా. ఆడవాళ్ళే పిల్లల్ని పెంచాలా? మగవాళ్ళెందుకు పెంచగూడదు? ఆరునెలలు పెంచి ఆడవాళ్ళు ఆఫీసులకు వచ్చేస్తారు. ఈ నాలుగ్గంటల పనిదినం మగవాళ్ళకు అడిగితే - రెండేళ్ళపాటు మగవాళ్ళు పిల్లల్ని పెంచాలి. నాకైతే మనం అడగాల్సింది అదే అనిపిస్తోంది. పిల్లల్ని పెంచటం ఆడవాళ్ళ పని మాత్రమే కాదు". కల్పన, రమ్య ఆలోచనలో పడ్డారు. నిజమే కదా అనిపించింది.

"కానీ మగవాళ్ళు పెంచుతారా? నాలుగ్గంటలు వూరిమీద బలాదూర్ తిరుగుతారు గానీ పిల్లల్ని చూసుకుంటారా?" రమ్యకు ఆ విషయం చాలా సందేహంగా ఉంది.

"పిల్లల్ని పెంచాలని డిమాండ్ చెయ్యాలి. ఇళ్ళల్లో తల్లులు వూరుకోకూడదు. ఎందుకూరుకోవాలి? నీళ్ళు పొయ్యటం, పాలుపట్టడం మిగిలిన పనులన్నీ చూడాలి" వసంత గట్టిగా అంది.

"అమ్మో-చేస్తారా? నేను మాత్రం నా పిల్లాడిని మా ఆయనకిచ్చి నిశ్చింతగా ఉండలేను".

పూర్తిగా సుధాకర్‌కి పిల్లాడిని ఒదిలేయాలనే వూహకే భయపడిపోయింది రమ్య. స్నానం సరిగా చేయించలేడు. వేళకు పాలుపడతాడా? ఉచ్చపోయగానే గుడ్డలు మారుస్తాడా? ఏడుస్తుంటే విసుక్కోకుండా ఎందుకేడుస్తున్నాడా అని ఆలోచిస్తాడా - ఏమో -

"మీవన్నీ పిచ్చి ఆలోచనలండీ. ఆ చాదస్తాలు ఒదుల్చుకోవాలి. వాళ్ళకి మాత్రం పిల్లలు కాదా? మొదట్లో కొత్తగా ఉన్నా అలవాటు పడతారు. మీ బాబు పుట్టే వరకూ మీకు తెల్సా పిల్లల్ని పెంచటం. నేర్చుకుంటున్నారు. ప్రేమ ఉంటే అన్నీ అవే వస్తాయి. సొంత పిల్లల మీద కూడా ప్రేమ లేకపోతే యిక ఆ మగజాతి ఎందుకంటా?" వసంత రమ్య భయాలను తీసి పారేసింది. "అసలు వాళ్ళకి కూడా ఆ బాధ్యత ఉంది అని చెప్పాలి మనం. అట్లా చెప్పటం మొదలుపెడితే క్రమంగా మారతారు. కొందరు దుర్వినియోగం చెయ్యొచ్చు ఈ నాలుగ్గంటల శలవుని. కానీ కొందరైనా నేర్చుకుంటారుగా. పైగా యిక్కడ అసలు విషయం ఏమిటంటే -

ఆ చట్టం వస్తే ఆడవాళ్ళే పిల్లల్ని పెంచాలని లేదు. ఆ పని యిద్దరూ చెయ్యొచ్చు. అది ఇద్దరి పనీ, గౌరవప్రదమైన పనీ అనే ఆలోచన సమాజంలో వస్తుంది. ఆ ఆలోచన

చాలా అవసరం. అదివ్వాళ చిన్నగా మొదలైనా తర్వాత తర్వాత చాలా మార్పు తెస్తుందని నా అభిప్రాయం".

వసంత మాటలు కల్పనకూ రమ్యకూ నిజమే ననిపించాయి. ఒక విషయం అడిగితే చాలా విషయాలు చర్చకు వస్తాయి గాబట్టి. కొత్త ఆలోచనలు కలిగించటానికైనా ఈ కేసు పెడదామనుకున్నారు. గెలుస్తామనే ఆశ పెట్టుకో వద్దనుకున్నారు.

ముగ్గురూ ఆలోచించి మళ్ళీ కొత్త పిటీషన్ రాశారు. 'తల్లికీ ఆరునెల్ల మెటర్నిటీ లీవు. ఆ తర్వాత తండ్రికి రెండేళ్ళు నాలుగు గంటల పనిదినం కావాలి పిల్లల్ని పెంచటానికి' అని అడిగారు. వెంటనే ఆ పిటీషన్ కోర్టులో పడేస్తానని బయల్దేరింది కల్పన.

రమ్యకు యింటికి వచ్చే దారిలోనే అర్థమైంది సుధాకర్ ఈ విషయం విని ఎంత విలవిలలాడిపోతాడో. నచ్చ చెప్పాలి. ఎంత కష్టమైనా సుధాకర్‌ని ఒప్పించాలి అనుకుంది ధైర్యం కూడగట్టుకుని.

బాబు నిద్రలేచాడేమో అని గుండె దడదడలాడుతూనే ఉంది. అదృష్టవశాత్తూ బాబు నిద్రపోతూనే ఉన్నాడు.

సుధాకర్ కూడా వాడెప్పుడు లేస్తాడోననే టెన్షన్‌తో ఉన్నాడేమో రమ్యను చూడగానే బరువు దిగిన వాడిలా నిట్టూర్చాడు.

రమ్య ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని సుధాకర్ దగ్గరకు వచ్చింది.

"ఆ పిటీషన్ కోర్టుకి పంపలేదు" మెల్లిగా చెప్పిన మాటలకు సుధాకర్ ముఖం విప్పారింది.

"కొత్త పిటీషన్ తయారు చేసి పంపాం".

సుధాకర్ ముఖంలో మనసులో అనుమానాలు మొదలయ్యాయి.

రమ్య చాలా మెల్లిగా, ఒప్పించాలనే ప్రయత్నమంతా చేస్తూ మొత్తం విషయం చెప్పింది. రమ్య ఒక్కొక్క విషయం చెబుతుంటే సుధాకర్ కోపం ఒక్కొక్క డిగ్రీ పెరిగింది.

రమ్య చెప్పటం పూర్తయ్యే సరికి సుధాకర్ లేచి నిలబడ్డాడు. "నువ్వు వెంటనే ఆ కేసు ఆపేస్తావా? లేదా ? తేల్చి చెప్పు" తీవ్రంగా అడిగాడు.

రమ్య ఆ కోపానికి భయపడుతూనే ఏదో చెప్పబోయింది.

"నువ్వింక ఏం మాట్లాడొద్దు. ఈ పని మానేస్తావా? లేదా?" రమ్యకేం చెప్పాలో అర్థం కాలేదు.

"నేను కాస్త మంచాడినయ్యే సరికి నీకు ఒళ్ళూ పై తెలియటంలేదు. నేను దీనికి మాత్రం చస్తే ఒప్పుకోను. నేను ఆడంగివెధవలా యింట్లో పిల్లల పీతిగుడ్డలు మారుస్తూ, వాళ్ళ ముక్కులూ, మూతులూ తుడుస్తూ కూచుంటే నువ్వు ఆఫీసులో ఉద్యోగం వెలగ బెడతావా? నేనా పని చెయ్యాలని నా మీద కేసు పెడతావా? ఏంటి నీ పొగరు?" సుధాకర్‌కి ఆవేశంలో ఒళ్ళు తెలియటంలేదు.

"కేసు నీమీద కాదు. నీ తరపున ప్రభుత్వం మీద".

"నాన్సెన్స్ – నా తరపున నువ్వు పెట్టేదేంటి బోడి. నేను ఈ కేసుకు చస్తే ఒప్పుకోను. నువ్వు విత్ డ్రా చేసుకుంటావా లేదా" సుధాకర్ రమ్య జడ మొదట్లో గట్టిగా పట్టుకుని అటూ యిటూ వూగించాడు.

నొప్పితో అవమానంతో రమ్య కళ్ళనీళ్లు కిందికి జారాయి.

"నేను విత్ డ్రా చేసుకోను"

"చేసుకోవూ? ఏంటి నీ వుద్దేశం? నా గురించి ఏమనుకుంటున్నావు? నువ్వెలా ఆడిస్తే అలా ఆడే వెధవననుకుంటున్నావా?"

"ఆలోచిస్తే నీకూ నేను చేసింది మంచిదని తెలుస్తుంది".

రమ్యకు వాదించే శక్తీ, బలం అన్నీ క్రమంగా పోతున్నాయి. సుధాకర్ రూపం, కోపం అన్నీ ఆమెకు భయాన్ని కలిగించి బలహీనతను పెంచుతున్నాయి.

"ఏంటి? దానికిచట్టం కావాలని కోర్టుకెక్కటం ఏంటి?" జుట్టుని యింకా గట్టిగా వూపాడు.

"పిల్లల్ని పెంచటం నీచమైన పనైతే ఆడాళ్ళందరూ పెంచటంలా – ఆ పని చాలా మంచిది. బాగుంటుంది" ఏడుపు రమ్య మాటలను వెనక్కు నెట్టేస్తోంది.

"బాగుంటే నువ్వే పెంచు. నా జోలికొచ్చావో – మర్యాదగా ఉండదు. చెప్పు కేసు విత్ డ్రా చేసుకుంటావా?"

రమ్య గొంతు పెగల్లేదు. ఐనా లొంగటం ఆమెకిష్టంలేదు. తల అడ్డంగా ఊగించింది ఏడుస్తూనే.

సుధాకర్‌కి యింకేం తెలియలేదు. రమ్య చెంపలు పగిలిపోతున్నాయి. ఆమె కింద కూలబడింది. మోకాళ్ళలో ముఖం దాచుకుంది దెబ్బలనుంచి తప్పించుకోటానికి. సుధాకర్ వీపు మీద బాదుతున్నాడు బలంగా కోపంగా. రమ్య కోపంతో అవమానంతో దుఃఖంతో ప్రయత్నిస్తోంది అతన్ని నిలవరించటానికి. సుధాకర్ ఆగటంలేదు. పిచ్చెక్కిన కుక్కలా వెర్రెక్కిన ఆబోతులా రమ్య మీదకు దూకుతున్నాడు. అరుస్తున్నాడు.

ఎన్నడో ఆదిమ యుగాలలో స్త్రీ శరీరాన్ని లొంగదీసుకుని అణిచిపెట్టిన పురుషుల రక్తం - యిన్నాళ్ళూ నిద్రాణమై ఉన్న పురాతన రక్తం ఒక్కసారి నిద్రలేచి విజృంభిస్తోంది.

ఈ సుధాకర్ వేటగాడైపోయాడు. కిరాతకుడైపోయాడు.

రమ్య అతిదీనంగా హీనంగా పడిపోయింది. ఇంతలో బాబు లేచాడు. అమ్మ కష్టం తెలిసిందా అన్నట్లు యిల్లు అదిరిపోయేలా కేకలు వేస్తున్నాడు, ఏడుస్తున్నాడు. సుధాకర్ స్పృహలో కొచ్చి కొట్టడం ఆపి ఒక ఛీత్కారం చేసి యింట్లో నుంచి బైటికి వెళ్ళిపోయాడు.

రమ్య లేచి నిలబడే లోపు మళ్ళీ వచ్చాడు.

"ఈ కేసు విత్ డ్రా చేసుకోకపోతే - విడాకుల నోటీసు అందుకుంటావు. జాగ్రత్త" - అని గర్జించి మళ్ళీ అదే వేగంతో వెళ్ళిపోయాడు.

రమ్య ఆ నొప్పినీ బాధనూ లెక్క జెయ్యకుండానే బాబు దగ్గరకు పరుగెత్తింది. అరుస్తున్న వాడి నోటిని తన స్తన్యంతో తడిపి మూసేసింది.

వాడు ఆకలిగా ఆత్రంగా పాలు తాగుతున్నాడు. ఆ పాలు వాడినోట్లోకి కురుస్తున్నంత వేగంగా రమ్య కళ్ళనుంచి కన్నీళ్ళు కురుస్తున్నాయి

'సుధాకర్ తనను కొట్టాడు. తను దెబ్బలు తిని ఏడుస్తోంది'.

ఇది ఎట్లా జరిగింది? తను ఎట్లా సహించింది? నువ్వు నా ప్రాణం. నా దేవత అని ముద్దాడే సుధాకర్ తనను ఎట్లా కొట్టగలిగాడు? అతనికాబలం, ధైర్యం, హక్కు ఎట్లా వచ్చాయి?

తను ఏడవటం తప్ప ఏం చెయ్యలేకపోయింది. ఈ బలహీనత ఎంత భయంకర మైనది? తనను పూర్తిగా చంపేసింది. ఇక రమ్యలేదు. ఆత్మగౌరవంతో, ధైర్యంతో, హుందాగా, గౌరవంగా ఉందనుకున్న రమ్య లేదు. ఒక్క నిమిషంలో చచ్చిపోయింది. ఎన్నటికీ తను ఆ రమ్య కాలేదు.

రమ్యకు దుఃఖం ఆగటంలేదు. వెక్కివెక్కి ఏడుస్తుంటే బాబు అర్థంకాక తడుము కుంటున్నాడు.

ఒక హక్కు కోరింది తను. ఆ హక్కు వస్తుందనే నమ్మకం కూడా లేదు. ఊరికే అడిగింది. అంతే. ఆలోచించవచ్చుగదా అంది. అయిపోయింది తన పని. వ్యక్తిగా తను సంహరించబడింది. స్త్రీలు యింతవరకూ యిన్ని హక్కులు ఎలా పొందారో! ఎందరు యిలా సంహరించబడ్డారో! చచ్చిపోయారో! ఈ నాగరిక సమాజంలో చదువుకుని సంపాదిస్తున్న స్త్రీ కోర్టుకి వెళ్లాలంటే -

ఒక హక్కు కావాలంటే - కుదరదు. వీల్లేదు.

దానికోసం చావు బతుకుల పోరాటం చెయ్యక తప్పదు.

విడాకుల నోటీస్ యిస్తాడు తనకు.

ఇద్దరం కలిసి ప్రేమఫలంగా పొందిన బిడ్డకు కాస్త సంరక్షణ చూడమని అడిగితే - అసలునువ్వే నాకు ఒద్దు పొమ్మంటున్నాడు.

అతను పొమ్మనటం సరే - కానీ అతనెందుకు తనకు? తన బిడ్డను తనే పెంచుకో గలిగినపుడు అతనెందుకు తనకు? తన్నుల కోసమా?

భార్య యిచ్చే సుఖం, చేసే చాకిరి, అందించే జీతం, పెంచే కొడుకు అన్నీ తీసుకుని-

అట్లా తీసుకోవటమే ప్రేమ అని నమ్మించి - అట్లా అన్నీ అతను స్వీకరించటమే తనకు భద్రత అని నమ్మించి -

కొంచెం యివ్వమంటే - అది కూడా తనకు కాదు, అతని యింటిపేర చలామణి అయ్యే బిడ్డకు నాలుగు గంటలు టైమివ్వమంటే - సేవ చెయ్యమంటే పశువులా కుమ్మే అతను తనకెందుకు?

రమ్య దుఃఖం క్రమంగా తగ్గుతోంది. ఆలోచన పెరుగుతోంది.

మగవాళ్ళ మంచితనం, భర్తల మంచితనం, భార్యల విధేయత మీద ఆధారపడి ఉంటుందని ఆమెకు అర్థమవుతోంది.

ఒక గంట తర్వాత లేచిన రమ్య బీరువాలో దేనికోసమో వెతుకుతోంది.

ఇల్లు అద్దెకు తీసుకున్నప్పుడు ఇంటి ఓనర్‌తో చేసుకున్న కాంట్రాక్టు కాగితాల మీద రమ్యే సంతకం చేసింది. కాకతాళీయంగా చేసిన ఆ సంతకం యిప్పుడు ఉపయోగ పడుతోంది.

ఈ యిల్లు అద్దెకు తీసుకుంది తను. అద్దె చెల్లిస్తోంది తను.

సుధాకర్‌కి తెలివిరాకపోతే ఈ ఇంటి నుంచి బైటికి వెళ్ళాల్సిందెవరో అతనికి తెలియజెప్పటానికి ఆ కాగితాలు చాలా అవసరం. అతనే అర్థరాత్రో వచ్చి బైటికి నడవమంటే పసిగుడ్డుతో వీధులు పట్టకుండా యింట్లో నిలబడటానికి ఆ కాగితాలు చాలా అవసరం. రమ్యకు ఆ కాగితాలు దొరికాయి.

*20 ఏప్రియల్ 1994*

సుప్రభాతం

# 10

# ఆర్తి

నేను ఆడదానిగా పుట్టినందుకు యెన్నడూ విచారించలేదు.

నాకు ఊహ తెలుస్తున్న దగ్గరి నుంచీ ఆడపిల్లనైనందుకు సంతోషించాను.

ఏ వయసుకు తగ్గ కారణాలు ఆ వయసుకు ఉండవచ్చు. తరువాతి కాలంలో ఆ సంతోషం పెద్ద విలువైనది కాకపోవచ్చు. కానీ అప్పటికి ఆ సంతోషం నిజమైనదే. విలువైనదే. నా చిన్నతనపు సంతోషాలు అలాంటివే కావచ్చు. నేను ఆడపిల్లనైనందుకు నా జీవితంలోని ప్రతి దశలోనూ సంతోషించాను. గర్వించాను. అయితే ఆ సంతోషం యెక్కువ కాలం నిలిచేది కాదు. నా చుట్టూ వున్న ప్రతి మనిషీ నా సంతోషాన్ని నేలపాలు చేయటానికీ, నా గర్వాన్ని హరించటానికీ సిద్ధంగా వుండేవారు. అయినా నేను నీరసపడేదాన్ని కాదు. నిరుత్సాహం చెందేదాన్ని కాదు. ఆ విషయానికి కాకపోతే యింకో విషయానికి, నన్ను చూసి నేను సంతోషపడటానికి, నన్ను చూసి నేను గర్వపడటానికీ ఎప్పటికప్పుడు ఏదో కొత్త విషయం, కొత్తశక్తీ కనిపించేవి. నా జీవితోత్సాహం నశించేది కాదు.

రెండు పెద్ద పెద్ద జడలటూ యిటూ వేసుకుని రంగు రంగుల గౌనులు పరికిణీలూ తొడుక్కుని పరిగెత్తుతూ ఎగురుతూ నవ్వుతూ ఎంతో హాయిగా వుందనుకునేదాన్ని. బోడి తలలతో మోకాళ్ళదాకా జారిపోతున్న లాగుల్ని పైకెగ లాక్కుంటున్న అబ్బాయిల్ని చూసి జాలిపడటం నాకింకా గుర్తుంది. నాకు నడవటం యిష్టం వుండేదికాదు. ఎప్పుడూ పరిగెత్తుతుండేదాన్ని. గోడలెక్కి దూకటం, చెట్లెక్కటం నాకు చాలా సరదాగా వుండేది. మంచం మీద నుంచైనా సరే, నెమ్మదిగా దిగేదాన్ని కాదు. ఎగిరి దూకేదాన్ని. ఎప్పుడూ ఉత్సాహంగా నవ్వుతూ, గంతులేస్తూ పరిగెత్తుతూ వున్న నన్ను చూస్తే అందిరికీ ఆశ్చర్యంగా వుండేది. ఆ ఆశ్చర్యం తొందరలోనే కోపంగా మారేది. అమ్మకూ నాన్నకూ మరీ కోపంగా వుండేది. దువ్విన తల దువ్వినట్లు ఉంచుకోననీ, బట్టలన్నీ మాపేసుకొస్తున్నాననీ అమ్మ నన్ను కొట్టేది. కొట్టినప్పుడు యేడ్చేదాన్నే గానీ మళ్ళీ మామూలే. మా చుట్టుప్రక్కల నా వయసేవున్న ఆడపిల్లలు స్నానం చేసి, శుభ్రమైన బట్టలు వేసుకుని బొట్టూకాటుక పెట్టుకొని బొమ్మల్లా కూచునేవారు. వాళ్ళను చూసి అందరూ ముచ్చటపడేవారు గానీ నాకు చాలా చిరాకేసేది. నన్నూ అట్లా బొమ్మలా కూచోమనేది అమ్మ. నేనాడుకోవటానికి బొమ్మలు కావాలిగానీ, నేనే బొమ్మనైతే యేం బాగుంటుంది? అందుకని నేనెప్పుడూ రైలు పట్టాలవతల ఉన్న ఖాళీ స్థలానికే పోయేదాన్ని. అక్కడ నాకన్నా మురిగ్గా ఉన్న మగపిల్లలూ ఆడపిల్లలూ, రకరకాల ఆటలు ఆడేవాళ్ళు. నాకు కర్రాబిళ్ళా అంటే ఎంతో యిష్టం. నా శక్తంతా పెట్టి బిళ్ళను కొడితే అది కనిపించనంత దూరం పోయేది. నా చేతుల్లో ఉన్న బలాన్నీ శక్తినీ చూసి నాకంటే పెద్ద పిల్లలు కూడా ఆశ్చర్యపోతుంటే గర్వంగా ఆడేదాన్ని. ఆ ఆటలో బాగా ప్రావీణ్యం సంపాదించేసరికి మా నాన్న నన్నక్కడకు పోనివ్వకుండా కట్టుదిట్టం చేశాడు. మా అన్న పోలీస్ పెరేడ్ గ్రౌండుకి వెళ్ళి క్రికెట్టు ఆడేవాడు. మా నాన్న అన్నయ్యకి మంచి బ్యాటూ, బంతీ, వికెట్లూ కొనిచ్చాడు. నేనూ అక్కడికి పోతానంటే అందరూ నవ్వారు. ఎగతాళి చేశారు. చివరికి తిట్టారు. రైలు పట్టాలవతలకు వెళ్ళి ఆడుకుంటే వీళ్ళకేం నష్టమో, అన్నయ్యతో పాటు క్రికెట్ ఆటకు ఎందుకు పోకూడదో తెలుసు కోవాల్సిందేనని పట్టుబడితే నాకు దొరికిన సమాధానం “నువ్వు ఆడముండవి”. అది నాకు ఆ వయసులో అర్థంకాలేదు. కాసేపు ఆలోచించి రైలుపట్టాలవతల నా స్నేహితుల్ని తలుచుకుని దిగులుపడుతూ ఇంటిదగ్గరే నా వయసున్న మగపిల్లలతో గోలీలాడటం ప్రారంభించాను. అదీ తప్పయిపోయింది. నాకెంత ఆశ్చర్యం కలిగిందంటే అసలేమీ అర్థంకాలేదు. నేను గోలీలాడితే యెవరికేం నష్టం? నేను గోలీలెందుకు ఆడగూడదు?

“నీ తోటి ఆడపిల్లలెవరైనా గోలీలాడుతున్నారా?” నా బుగ్గలు పిండుతూ అడిగింది అమ్మా.

"ఎందుకాడరు? వాళ్ళాడకపోతే నేనాడగూడదా?"

"అది ఆడపిల్లలు ఆడే ఆటకాదు"

నాకు అర్థం కాలేదప్పుడు. ఏడుస్తూ కూచున్నాను.

నేను గెలుచుకున్న నూటయాభై గోలీలూ అమ్మ కాలవలో పారేసింది. మళ్ళీ గోలీ ముట్టుకుంటే చేతులు విరగ్గొడతానంది. నాన్న చేత నాకు క్యారమ్ బోర్డు తెప్పించింది. నాన్నకు అది కొనుక్కురావటం ఇష్టంలేదు గానీ అమ్మ పట్టుబట్టి తెప్పించింది. నాకు ఆ బోర్డు చూస్తే చిరాకేసేది. కదలకుండా ఒకచోట కూచుని ఎదురుగా కనపడుతున్న కాయలను కొడుతూ ఉండటం ఎంత విసుగ్గానో ఉండేది. దూరం నుంచీ సూటిగా చూసి చిన్న గోలీ కొట్టడంలో ఉండే గొప్ప ఈ ఆటలో ఏముంటుందనిపించేది. కష్టమైన ఆట ఆడితే మెచ్చుకోకుండా తిడతారెందుకో అర్థమయ్యేదికాదు. ఆడపిల్లలు కష్టమైన ఆటలు ఆడగూడదా? ఎందుకని? నా చిన్న బుర్రకు సమాధానం దొరికేదికాదు. ఎన్ని తిట్లు తిన్నా నా ఉత్సాహం అణిగేది కాదు. వయసు పెరిగేకొద్దీ తిట్లు యెక్కువయ్యేవి. ఒక రోజు నాన్న ఏదో పెద్ద పాకెట్టు పుచ్చుకుని, వాకిట్లో రిక్షా దిగటం చూసి నేను పెరట్లో నుంచి ఒక్క పరుగున వాకిట్లోకెళ్ళాను. నాన్న చేతిలో పాకెట్టు లాక్కోబోయాను.

'ఏంటా పరుగు నడువు లోపలికి' నాన్న గద్దించాడు. నా ఉత్సాహమంతా నీరుగారి పోయింది. లోపలెక్కడో గాయమయింది. ఆ గాయాన్ని లెక్కచెయ్యకుండానే మళ్ళీ లోపలకు పరిగెత్తాను.

"నడవలేవా? ఏంటా పరుగులు?" నాన్న కోపం ఎందుకో నాకర్థంకాలేదు. నడిస్తే ఏం? పరిగెత్తితే ఏం? పరిగెత్తుతూ పడితే, పోనీ దెబ్బతగిలితే, ఏడుస్తుంటే అనుకోవచ్చు.

చక్కగా పరిగెత్తుతున్నందుకు తిట్టడం దేనికి?

"పరిగెత్తితే యేం?" అన్నాను అమాయకత్వంతో.

నా చెంప పగిలిపోయింది.

"ప్రతిదానికీ ఎందుకూ ఏమిటీ అని వెధవ ప్రశ్నలేశావంటే చంపేస్తాను. ఆడముండవి నీకు అక్కరలేని విషయంలేదు. బోడి ఆరాలు" నాన్న మండిపడ్డాడు. అమ్మ కూడా వచ్చిందక్కడికి. ఫిర్యాదులు పెరిగిపోయాయి.

"దీని పరుగులు ఆపలేక చస్తున్నాను. ఒక్క నిమిషం కూచోదు. ఒకటే గంతులు. పొద్దున ఆ అటకమీద నుంచి కిందికి దూకింది. కాళ్ళు విరుగుతాయని చచ్చే భయం వేసింది. అదేమో దూకి పకపకా నవ్వుకుంటూ అదే పరుగున వెళ్ళిపోయింది. ఆ

బళ్ళో కదలకుండా ఏం కూచుంటుందోగాని, ఇంట్లో ఉందంటే గంతులూ, పరుగులూ, కాళ్ళలో స్ప్రింగులున్నట్టే".

నా నేరాల జాబితాతో పాటు నాన్న కోపం కూడా పెరిగింది.

"ఇదిగో... సీతా... ఇక నువ్వు పరిగెత్తావంటే ఊరుకోను. ఆడపిల్లలలా పరిగెత్త కూడదు. నెమ్మదిగా నడిచిరావాలి. వెర్రిగంతులూ, పిచ్చి నవ్వులూ కట్టిపెట్టి నిదానంగా ఉండకపోయావో కాళ్ళు విరిచేస్తాను జాగ్రత్త".

నేను బిక్కచచ్చి పోయాను. నేను పరుగుని ఆపుకోటానికీ, నా కాళ్ళలో పుట్టుకొస్తున్న శక్తినీ ఉత్సాహాన్నీ కట్టేసుకోటానికీ యెంత కష్టపడ్డానో. కదలకుండా నుంచోవడమంటే కాళ్ళు తెగిపోయినట్టే వుండేది. పరుగు మాత్రం ఒక పట్టాన ఆగేది కాదు. కాస్త దూరం పరిగెత్తి హఠాత్తుగా ఆగిపోయేదాన్ని. ఇక నడవబుద్ధయ్యేది కాదు. అక్కడే కాసేపు కూచుని మళ్ళీ యే విషయానికో సంబరపడుతూ వెళ్ళేదాన్ని. ఆడపిల్లలు పరిగెత్తకూడదని నాన్న చెప్పిన మాట నా బుర్రలో మేకులా గుచ్చుకునేది. ఎందుకని? ఎందుకని?

అమ్మ ఒకరోజు బస్టాండులో కదిలిపోబోతున్న బస్సుని అందుకోటానికి పరిగెత్త బోయింది. కాస్తదూరం పరిగెత్తి, మరి పరిగెత్తలేక ఆయాసంతో రొప్పుతూ నడిచింది. బస్సు వెళ్ళిపోయింది. ప్రయాణం ఆగిపోయింది. నాకప్పుడు స్పష్టంగానే తెలిసింది. పరిగెత్తటం కష్టం. పరిగెత్తితే ఉపయోగం. అయినా ఆడపిల్లలు పరిగెత్తకూడదు. ఎందుకని? అమ్మలాగా ఆయాసపడుతూ ప్రయాణం నష్టం చేసుకుని ఇంటికి వచ్చిన వాళ్ళే ఆడవాళ్ళా? పరిగెత్తుకెళ్ళి బస్సెక్కేస్తే, ప్రతి పనీ తొందరగా చేసేస్తే వాళ్ళు మంచి ఆడవాళ్ళు కాదా?

ఒకరోజు నాన్న అన్నయ్యని సిగరెట్టు పెట్టె తెమ్మని పంపాడు. పది నిముషాలు గడిచినా అన్నయ్య రాకపోతే నాన్న చిరాకుపడుతూ వాకిట్లో కెళ్ళి నుంచున్నాడు. అన్నయ్య నెమ్మదిగా తలవంచుకుని ఏదో ఆలోచించుకుంటూ నడిచి వస్తున్నాడు. వాకిట్లోకి వచ్చేవరకూ నాన్నను చూడలేదు.

"ఆడముండలా తలొంచుకుని ఆ కాళ్ళీడ్చుకోవటం యేమిట్రా. ఒక్క పరుగున వెళ్ళి రాలేవూ?"

నా తలలో ఇంకో మేకు దిగింది. పదేళ్ళ నా తలకి ఇన్ని మేకుల్ని ఎక్కువ సేపు భరించే శక్తి ఉండేదికాదు. సమాధానాలు వెలికితీసే స్థిమితమూ వుండేది కాదు.

ఒక రోజు నాన్న పేపరు చదువుకుంటూ తీరికగా పడక కుర్చీలో కూచుని ఉన్నాడు. నేను పక్కనే కూచుని కథల పుస్తకం చదువుకుంటున్నాను. ఆ కథలో కోతి చేసిన

తమాషాకు తెగ నవ్వొచ్చింది. పెద్దగా పగలబడి నవ్వాను. నా నవ్వు ఆగకముందే నా వీపుమీద పెద్ద దెబ్బపడింది. నవ్వుతున్న కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

"ఏంటా విరగబడి నవ్వటం" నాన్న గద్దింపుకు నవ్వు పూర్తిగా మాయమయింది.

మర్నాడే అన్నయ్య కొత్త గుడ్డలకోసం పేచీ పెట్టాడు.

"దీపావళికేగా కొత్తవి కుట్టించుకున్నావు. రెండు నెలలన్నా కాలేదు. మళ్ళీ కొత్త గుడ్డలంటావేం" అని అమ్మ విసుక్కుంటే అన్నయ్య ఏడుపుముఖం పెట్టాడు. గొణుగుతున్నాడు.

నాన్న వచ్చి "ఆడదానిలా ఆ ఏడుపేంటీ – ఆ గొణుగుడేంటీ... కావలసిందేదో తిన్నగా అడగలేవూ" అని కసిరాడు. ఆడవాళ్ళను నవ్వొద్దనటమూ, ఏడిపించటమూ, మళ్ళీ ఏడవటం ఆడదాని దుర్లక్షణంలాగా మాట్లాడటం – ఇవన్నీ నాకు అయోమయంగా కనిపించేవి. మా మేనత్త ఒకావిడుండేది. ఆవిడకు పిల్లలు లేరు. సంవత్సరానికి ఆరునెల్లు మా యింట్లోనే ఉండేది. అమ్మ మీదా, నామీదా కేకలెయ్యటం తప్ప ఆమెకేం పనుండేది కాదు. నేను కాస్త హుషారుగా కనిపించానంటే ఆమెకు ఒంటికి కారం రాసుకున్నట్లుండేది. చిటపటలాడుతూ చిరాకు పడుతుండేది.

"దేనికే దీనికింత పొంగు. ఏం జూసుకుని గాల్లో ఎగురుతుందిది" అందోసారి అత్త నన్ను చూసి.

"అదా? అది పుట్టినప్పట్నించీ అంతే. మహా హుషారు" అంది మా పిన్ని. మా పిన్ని ఒక్కతే నన్నేమీ అనేది గాదు. అందరూ తిట్టినప్పుడో కొట్టినపుడో నేనేడుస్తుంటే, బుజ్జగించి "అలా చెయ్యకూడదమ్మ, యిలా చెయ్యకూడదమ్మా" అని చెప్పేది. "ఎందుకు చెయ్యకూడదని" నేనడిగే ప్రశ్నలకు "పెద్దయితే నీకే తెలుస్తుందిలే" అనేది. మా పిన్ని నన్ను సమర్థిస్తూ నా హుషారును మెచ్చుకుంటూ యిచ్చిన సమాధానానికి మా అత్త మరింత మండిపడింది.

"అదే – ఆ హుషారే ఎందుకూ అని. అసలే ఆడపిల్ల. ఆడపుటక పుట్టి ఆ విరగబాటేమిటి? వినయం వందనం లేకుండా" అంటూ రుసరుసలాడింది.

"అందుకే నేనాడపుటక పుట్టినందుకే ఆ హుషారు" అని రాగం తీస్తూ, చేతిలో ఉన్న పుస్తకం దూరంగా విసిరి ఎగురుకుంటూ తూనీగలా, పిల్లగాలిలా, గాలిపిల్లలా పరిగెత్తటం నాకెంతో బాగా జ్ఞాపకం.

ఆడపుటక పుట్టాక సంతోషపడటం, అదీ ఆడపుటక పుట్టినందుకు సంతోషపడటం మా అత్తకు అర్థం కాలేదు. నేనన్న మాటలు కూడా పూర్తిగా అర్థమై అన్నవికావు. మా అత్త అన్న మాటలకు కోపం కసీ పట్టలేక అన్నమాటలే –

ఓ రోజు మా యిరుగు పొరుగు పిల్లలందరం ఆడుకుంటున్నాం. ఆడపిల్లలందరం వేగంగా అల్లాబిల్లీ తిరిగి, బుట్టల్లా లేచిన పరికిణీలతో చటుక్కున కుచుంటున్నాం. ఆ పరికిణీలు నేలమీద యింతమేర గుండ్రంగా పరుచుకుని ఎంతో అందంగా వున్నాయి. రంగురంగుల పరికిణీలు బుట్టల్లా లేవటమూ, నేలమీద పడటమూ, మా సంతోషానికి మేరలేదు. ఇంకా వేగంగా, ఇంకా వేగంగా తిరుగుతూనే వున్నాం. మా పక్కింటి రాజాగాడికి మమ్మల్ని చూస్తే అసూయే పుట్టిందో, ఆసక్తే కలిగిందో – తానూ పరికిణీ కట్టుకుని మాలాగా తిరగాలని ముచ్చటపడ్డాడు. నేనూ నా ఎర్రపరికిణీ, తెల్ల జాకెట్లూ తెచ్చి యిచ్చాను. రాజాగాడు అవి వేసుకుని ముఖంమంతా వంకరలు తిప్పుకుంటూ వికారం చేసేసుకున్నాడు.

"ఛీ – ఎందుకురా ముఖం అట్లా పెడుతున్నావు" అన్నాను నేను. "సిగ్గుపడుతున్నాడే" అంది రాధ.

"ఓహో – ఇదా సిగ్గంటే. మొన్న మా అత్త అన్నదిలే. ఆడపిల్లలకు సిగ్గే సింగారమని, ఇదిగో ఇంత చీదరగా మనం ముఖాలుపెట్టి, ఎన్నడూ సిగ్గుపడొద్దేం. అలాగని ఒట్లేసుకుందాం" అంటూ ఒట్లేసుకోవటం నా కళ్ళకు కట్టినట్టే ఉంది. నిజంగానే సిగ్గుపడాల్సిన పనియెన్నడూ చెయ్యలేదు నేను. లోకం వేటివేటికి నేను సిగ్గుపడాలని ఆశించిందో, వాటికి నేను సిగ్గుపడలేదు. అవన్నీ నాకు గర్వించదగ్గ విషయాలుగా అనిపించేవి. లోకానికి భయపడి నా గర్వాన్ని దాచుకున్నాను. నా ఆలోచనలను అణచుకున్నాను గానీ నన్ను చూసి నేను సిగ్గుపడటం నేర్చుకోలేక పోయాను.

వయసు పెరుగుతున్నకొద్దీ నా శరీరంలో మార్పులు జరుగుతున్నాయి. శరీరం సాగుతోంది. కంఠం మృదువవుతోంది. వక్షం ఉబుకుతోంది. నడుము సన్నబడుతోంది. నా శరీరం చూసుకుని నేను ముచ్చట పడ్డాను. కాని అందరూ విచారించారు. వాళ్ళ విచారం యెందుకో నాకర్థం కాలేదు.

"పన్నెండేళ్ళకే యిది తాడిలా ఎదుగుతోందే. ఇక ఆగటానికి లేదు. ఓణీలివ్వాల్సిందే. పదకొండోయేట యిచ్చినా పోయేది. పదమూడో ఏడొచ్చేదాకా యిలా తిరిగితే ఎంత అసహ్యం" మా అత్త అమ్మతో గొణుగుతూండేది.

అమ్మ పన్నెండేళ్ళకే యింతెత్తు పెరిగిన నన్ను కన్న నేరానికి దిగులుపడుతున్నట్టుండేది. ఓణీలు వేసుకోకుండానే పెరిగిన నాలాంటి పిల్లలు కొందరు భుజాలు వంచి, శరీరం కుంచించుకుని నడిచేవారు. తరువాత ఓణీలు వేసుకున్నా ఆ గూని తగ్గేది కాదు.

నేను మామూలుగా నిటారుగా నిలబడి నడుస్తుంటే అమ్మా, అత్తా "కాస్త నడుం వంచి, తలదించుకుని నడువు. నడ్డి విరుచుకుని నడుస్తావేం" అని కసిరేవారు. నా వంక అదోరకంగా చూసేవారు.

నేను ఒంటరిగా వున్నప్పుడో, స్నానం చేస్తున్నప్పుడో నా శరీరం చూసుకుని గర్వించే దాన్ని. మిగిలిన సమయాల్లో ఎంత ఒద్దనుకున్నా మిగిలిన వాళ్ళ చూపుకు నా శరీరం కుంచించుకుపోయేది. నా శరీరాన్ని చూసి నేను సిగ్గుపడాలని నా చుట్టూ వున్నవారి కోరిక. అట్లా సిగ్గుపడాల్సి రావటం, సిగ్గుపడకుండా ఉండటం కోసం ప్రయత్నం చేయటం చాలా భయంకరమైన అనుభవంగా మిగిలిపోయింది. స్వేచ్ఛగా కాళ్ళూ చేతులూ యిష్ట మొచ్చినట్లు కదిలిస్తూ శరీరమంతటినీ ఉపయోగిస్తూ ఉండటం పోయి నా శరీరాన్ని కుంచించుకుని, ముడుచుకుని, మనిషిని అలాగే నుంచుని, మెడ మాత్రమే తిప్పుతూ చిన్న చిన్న అడుగులు పొందికగా వేస్తూ నన్ను నేను నిర్బంధించుకోవాల్సి రావటం నాకు చాలా కష్టమనిపించింది. ఎందుకిలా ముడుచుకుపోవటం నాకు గాలిలో ఎగరాలన్నంతా, ప్రకృతంతా విస్తరించాలన్నంతా ఉత్సాహం కలుగుతుంటే దాన్నంతా చంపేసుకుని అత్తిపత్తి ఆకులా ఎందుకు ముడుచుకోవాలి? నా చుట్టూ ఉన్న ఆడవాళ్ళందరి శరీరాలూ అలాగే వుండేవి. రాను రాను నాకు తెలియకుండానే నా శరీరం కూడా కుంచించుకుపోయింది.

నేను ఎనిమిదో తరగతి చదువుతుండే రోజుల్లో ఒక వింత అనుభవం కలిగింది. లెక్కల పిరియడు జరుగుతోంది. టీచరుగారు రెండు లెక్కలు యిచ్చి తొందరగా చేసి చూపించమని కుర్చీలో కూర్చున్నారు. నేను చేసి చూపించాను. నా పక్కన కూచున్న సుశీల లెక్కలు చేసిందిగానీ టీచరుకు చూపించటం లేదు. క్లాసులో అందరూ చూపించారు. సుశీల మాత్రమే చూపించలేదని టీచరు గమనించారు. పేరుపెట్టి పిల్చినా ఈ పిల్ల కదలలేదు. నాకర్థం కాలేదు. వెళ్ళవేం అన్నాను. టీచరు కూడా రమ్మని గద్దించి పిలిచేసరికి సుశీల లేచి వెళ్ళింది. నా గుండె ఆగినట్లనిపించింది. సుశీల పరికిణీ నిండా ఎర్రటి మరకలు. నా పక్కన సుశీల కూచున్న చోటంతా రక్తం 'అమ్మో' అని కేకేశాను. అందరూ చూశారు.

టీచరు మొహం మాడ్చుకున్నారు. సుశీలను తిట్టారు. ఈ వయసు పిల్లలున్న క్లాసుకు రాగూడదు. ఏ ఐదారు తరగతులకో వెళితే ఈ దరిద్రాలుండవని గొణుక్కున్నారు. అప్పటి కప్పుడు సుశీలను ఇంటికి పంపించేశారు. మేమంతా ఆ క్లాసు నుంచి బైటికి వచ్చేసి యింకో గదిలో కూచున్నాం. సుశీల ఏదో చెయ్యరానిపని చేసిందని, అది చాలా తప్పనీతప్ప నాకింకేమీ అర్థంకాలేదు. నాస్నేహితురాలు సుజాతా, నేనూ ఆ విషయం గురించి మాట్లాడుకున్నాం.

"సుశీల పెద్దమనిషయింది, ఆడవాళ్ళందరూ అలాగవుతారు. అప్పుడు రక్తం వస్తుంది" అని చెప్పింది సుజాత.

"అలా అవకుండా ఎవరూ ఉండరా?"

"ఛా ఉండరు. అలా వుంటే అది జబ్బుట. ఇంకో సంగతుంది. పెద్దమనిషి కాకపోతే పిల్లలు పుట్టరు" సుజాతకు యిన్ని విషయాలెలా తెలుసో? నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

మరి అలాగైతే అందరూ సుశీలనెందుకు చీదరించుకున్నారు? అలాగవకపోతే పిల్లలు పుట్టరు గదా. పిల్లలు పుట్టకపోతే ఎట్లా – ఆ విషయానికి, పిల్లల్ని పుట్టించే శక్తి ఉన్న విషయానికి గర్వపడాలిగానీ సిగ్గుపడటం ఎందుకు? మిగిలినవాళ్ళు చీదరించుకున్నట్లు చూడటం ఎందుకు? మా యిద్దరికీ ఈ ప్రశ్నకు సమాధానము దొరకలేదు. సుజాత సిగ్గుపడాలనే అంటోంది. 'ఛీ–పాడు–' 'అసహ్యం' అంటోంది. మన శరీరానికి సంబంధించిన విషయాన్ని అసహ్యించుకుంటూ ఆ శరీరంతో యెట్లా బతకటమో అర్థం కాలేదు.

ఒకరోజు నాకూ ఆ అనుభవం కలిగింది. "అప్పుడే దాపరించింది – ఈ ఏడాది గడుస్తుందేమోననుకున్నా. దిక్కుమాలిన మేనత్తపోలిక" అంది అమ్మ మా అత్త లేకుండా చూసి.

"గుండెలమీద కుంపటి తయారయిందిరా నాయనా. ఎలా దించుకుంటామో యేమో" అత్త మా నాన్నమీద జాలిపడింది. మా నాన్న ఏమన్నాడో నాకు తెలియదు. ఆయన నేనున్న గదిలోకి రాలేదు. నాకు సిగ్గువెయ్యలేదు గానీ భయం వేసింది. నా శరీరం గురించి నాకేమీ తెలియకపోవటంతో అయోమయంగా అనిపించింది. ఆడవాళ్ళందరికీ జరిగే సంగతికి నేను సిగ్గుపడదల్చుకోలేదు. బాధకూడా అనిపించలేదు. కొందరు నాతోటి పిల్లలు యేడ్చినట్లు నేను యేడవలేదు. నాచుట్టూ వాళ్ళందరికీ నా ప్రవర్తన వింతగా కనిపించింది. "ఈ కాలం ఆడపిల్లలకి భయమూ, సిగ్గూ ఏమీ లేవు" అని అత్త బుగ్గలు నొక్కుకుంది తలయెత్తి కూచున్న నన్ను చూసి. అత్త మాటలకు నాకు యింకా ధైర్యం వచ్చింది. మొదట కలిగిన అయోమయం, భయం కూడా పోయింది. వెచ్చగా ఎర్రగా స్రవించే రక్తం నేను స్త్రీనని నొక్కి చెప్పినట్లపించింది. నాకేదో కొత్త శక్తి వచ్చిందని సంతోషమే కలిగింది. గర్వంగానే అనిపించింది. కానీ పేరంటానికి వచ్చిన అమ్మలక్క లందరూ నా సంతోషాన్ని వెయ్యి రకాలుగా భంగపరిచి నా మనసులో లక్ష భయాలూ సందేహాలూ నాటి పోయారు. నా గురించి ఉన్న అయోమయానికి అమ్మలక్కల అజ్ఞానం తోడై చాలా రోజులు నా మనసు పాడయింది. ఏదో తెలియని నిరాశా, భయం బెరుకు కలిగేవి. క్రమంగా దానికి అలవాటైపోయాను.

నేను కాలేజీలో చేరటానికి ఎంత గొడవో అయింది. మాకు డబ్బు యిబ్బందులు పెద్దగా లేవు. మా అన్నయ్యను బెజవాడ లయోలా కాలేజీలో హాస్టల్లో వుంచి చదివిస్తు

న్నారు. ఊళ్ళో ఆడపిల్లల కాలేజీ ఉన్నప్పటికీ నా చదువు గురించి చర్చ అనంతంగా సాగింది. ఎప్పటికైనా పెళ్ళి చేసి పంపాల్సిందే గదా చదువెందుకు అని అత్తా నాన్నా గట్టిగా వాదించారు. నా చిన్నప్పుడు మా యింట్లో రెండు గదులు అద్దెకిచ్చాం. ఆ గదుల ముందు చాలా ఖాళీ స్థలం ఉంది. ఒకరోజు ఆ ఇంటివాళ్ళ ఇంటికి బంధువులొచ్చారు. వస్తూ వస్తూ రెండు కొబ్బరి మొక్కలు తెచ్చారు. బోలెడు చోటుంది గదా మొక్కలు నాటండి అన్నాడు వచ్చిన చుట్టం. "బాగానే వుంది-ఇదేం మన సొంతిల్లా ఇది కాపుకొచ్చే నాటికి మనమెక్కడుంటామో. రోజూ నీళ్ళు పెట్టి చాకిరీ చేస్తే ఫలితం అనుభవించేదెవరో. మాకొద్దుగానీ మీరెటూ బెజవాడ పోతారుగా మా చెల్లెలిగారింట్లో యిచ్చెయ్యండి. సొంత యిల్లు. ఎప్పుడన్న మీకో రెండు కాయలూ, నాకో రెండు కాయలూ పంపుతుంది" అంది అద్దెకున్న యిల్లాలు.

ఆవిడ మాటలకూ, మనస్తత్వానికి మా అత్తా, నాన్నా ఆడిపోసుకున్నారు. నా చదువు విషయంలో మాత్రం అచ్చం అ అద్దెకున్నావిడలాగానే మాట్లాడారు. నన్ను చదివిస్తే వీళ్ళకు డబ్బు దండగ. మరెవరికో లాభం. వీళ్ళ లాభనష్టాల బేరీజులో నేను అమ్మకానికి సిద్ధంగా ఉన్న వస్తువులా కనిపించాను. గానీ ప్రాణమున్న మనిషిలా కనిపించలేదు. ఈ ప్రాణి పెరుగుతుంది. జ్ఞానం, వికాసం కావాలన్న ఆలోచన వాళ్ళకు రాలేదు. అమ్మకెందుకో గానీ నన్ను చదివించాలనే ఉంది. కానీ, నాన్న ఇష్టం లేనిదే అమ్మేమీ చెయ్యలేదు. నేను నాలుగైదు రోజులు ఉపవాసాలుండి, యేడ్చి సాధించి కాలేజీలో చేరాను.

ఆడపిల్లల కాలేజీ కావటాన కాలేజీలో స్వేచ్ఛగానే ఉండేది. మా కాలేజీలో ఆటలాడటానికి బోలెడు స్థలముంది. కావలసిన వస్తువులూ, మంచి పి.టీ. కూడా వున్నారు. నా ఉత్సాహం మళ్ళీ పెరిగింది. అన్ని ఆటలూ చాలా బాగా ఆడేదాన్ని. కానీ మా ఇంట్లో నిషేధాల సంఖ్య విపరీతంగా పెరుగుతుండేది. ఆటలాడటానికి కాలేజీకి ముందుగా వెళ్ళాలి. కాలేజీ అయిపోయాక ఒక గంట రెండు గంటలు వుండి ఆడుకోవాలి. క్లాసులు ఎగ్గొట్టి ఆడుకునే వీలుండదు. నాకు అలా ఇష్టమూ వుండదు. నాకు ఆటలెంత యిష్టమో, పాఠాలూ అంత యిష్టంగా వుండేవి. నేను సరిగ్గా కాలేజీ టైముకి వెళ్ళి, కాలేజీ వదిలిపెట్టగానే ఇంటికి రావాలని నాన్న ఆజ్ఞ. నేను సాయంత్రం కనీసం గంట సేపు ఆడందే ఇంటికి వచ్చేదాన్ని కాదు. మా నాన్నకూ నాకూ మధ్య పెద్ద పోట్లాటలే జరిగేవి. నేను ఆటలు మానలేదు గానీ మా మధ్య జరిగే పోట్లాటవల్ల నా ఉత్సాహం దెబ్బతినేది. సంవత్సరం చివర నాకు ఆటల పోటీల్లో చాలా బహుమతులు వచ్చాయి. కానీ వాటిని చూసి ఆనందించిన వాళ్ళెవరూ లేరు.

నేను కాలేజీకి రోజూ నడిచే వెళ్ళేదాన్ని. నాతో పాటు ఇంకో నలుగురు స్నేహితులు కూడా వచ్చేవారు. మేం వెళ్ళే దారిలోనే మగపిల్లల కాలేజీ ఉంది. దారి పొడుగునా అబ్బాయిలు మా వెనక నడుస్తూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉండేవారు. ముఖ్యంగా మా అందచందాల గురించి పొగుడుతూ, ఎగతాళి చేస్తూ ఏదో ఒకటి అనేవారు. నేనూ, నా స్నేహితులూ, వాళ్ళ మాటలకు కోపం తెచ్చుకుంటూ ఒకోసారి నవ్వుకుంటూ నడిచేవాళ్ళం. ఒక రోజు మా కాలేజీ గేటు దగ్గర ఒకతను నిలబడి ఉన్నాడు. అతను చాలా అందంగా ఉన్నాడు. అతన్ని చూడగానే నాకు ఒళ్ళు ఝల్లుమన్నట్లనిపించింది. శరీరం, మనసూ చాలా తేలికైనట్లనిపించాయి. అలాగే చూస్తున్నాను. నా పక్కనున్న సుజాత నన్ను చేత్తో పొడిచి లోపలకు లాక్కెళ్ళింది.

"అతను చాలా బాగున్నాడు కదూ" అన్నాను నేను ఇంకా అతని ధ్యాసలోనే ఉండి.

"ఛీ ఊరుకో" అంది సుజాత.

"ఏం నీకు బాగాలేదా?"

"ఏంటా మాటలు. ఎవరన్నా వింటే నవ్వుతారు. గొడవ చేస్తారు. అబ్బాయిల గురించి అలా మాట్లాడుకోగూడదు".

"అబ్బాయిలు అందంగా ఉన్నారనగూడదా? రోజూ మన అందచందాల గురించి పబ్లిగ్గా వాళ్ళు మాట్లాడితే వింటున్నాం. వాళ్ళ అందం గురించి మనమెందుకు మాట్లాడ గూడదు?"

"నీదంతా వితండవాదం తల్లీ. మగవాళ్ళ అందచందాల గురించి మనం నలుగురిలో మాట్లాడితే చాలా చెడ్డవాళ్ళమనుకుంటారు" సుజాత దీర్ఘం తీసింది.

నిజంగానే చాలా మంది అమ్మాయిలు అబ్బాయిలకేసి సూటిగా చూసేవాళ్ళే కాదు. తలదించుకుని కళ్ళు మాత్రం పైకెత్తి చూసేవారు. పక్క చూపులు చూసేవారు. కొందరసలు దించిన తల ఎత్తేవారు కాదు. ఎందుకలా దొంగచాటుగా చూడటం. సూటిగా చూడొచ్చు గదా. అలా చూస్తే చెడ్డవాళ్ళనటం ఏమిటి? ఈ ఆలోచనలతో నేను అబ్బాయిలు ఎదురవ గానే గందరగోళపడిపోయేదాన్ని. సూటిగా చూడటానికి బెరుకూ, వాలు చూపులుచూడటం రాదు. ఇష్టముండదు. మొత్తానికి మానసికంగా చాలా ఆందోళన పడిపోయేదాన్ని.

పి.యు.సి. పరీక్షలు రాస్తూనే యిక చదువు పూర్తయినట్లేనని నాన్న చెప్పేశాడు. సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. నా స్నేహితురాళ్ళు కొందరు కాలేజీలో చేరారు. కొందరు పెళ్ళి చేసుకున్నారు. కొందరు నాలాగే పెళ్ళికోసం ఎదురు చూస్తున్నారు.

"నీకేం నువ్వందంగానే వుంటావు. తొందరగానే సంబంధం కుదురుతుంది" అనేది కరుణ.

కరుణ చాలా పొడుగు. దాదాపు ఆరడుగులుండేది. కాలేజీలో అందరూ కరుణను ఎగతాళి చేసేవారు. బజార్లో అబ్బాయిలు రకరకాల పేర్లతో ఏడిపించేవారు. ఇంట్లో అందరూ కరుణకు పెళ్ళెలాగవుతుందని దిగులుపడేవారు. ఆరడుగుల అబ్బాయిని మంచి పర్సనాలిటీ అనే వాళ్ళంతా కరుణను "అమ్మో అదేం పిల్లా అదేం పొడుగూ అనేవాళ్ళు". కరుణనే కాదు మా స్నేహితుల్లో చాలామంది ఏదో ఒకరకమైన ఆందోళనతో సతమత మవుతుండేవారు. లావుగా వున్నా దిగులే. సన్నగా వున్నా దిగులే. ఈ దిగుళ్ళన్నీ పెళ్ళితోనే ముడిపడి వుండేవి. వాళ్ళ శరీరాలకున్న శక్తిని గురించి గానీ, వాళ్ళకున్న తెలివితేటల్ని గురించి గానీ వాళ్ళు ఆలోచించేవాళ్ళు కాదు. తమ అందం చూసి మంచి సంబంధం రావాలన్నదే వాళ్ళ కోరిక. రాదేమోనని వాళ్ళ దిగులు. చదువు మానేసిన రెండేళ్ళకు గాని నాకు పెళ్ళి కుదరలేదు. ఈ రెండేళ్ళూ జరుగుతున్న పెళ్ళిళ్ళను చూసి భయపడుతూ, దిగులుపడుతూ, అసహ్యించుకుంటూ గడిపాను. అయితే ఈ రెండేళ్ళూ నేను వృథా చెయ్యలేదు. మొదటి సంవత్సరం టైపు నేర్చుకున్నాను. రెండో సంవత్సరం నేను చదివిన కాలేజీలోనే టైపిస్టు ఉద్యోగం సంపాదించాను. నాకు ఆశ్చర్యం కలిగేటట్లు నేను ఉద్యోగం చెయ్యటానికి మా అత్త పెట్టిన అభ్యంతరం మా నాన్న పెట్టలేదు. 'ఉన్న ఊళ్ళో, ఆడపిల్లల కాలేజీలో, పోనీ వెళ్ళనీ' అని ఊరుకున్నారు. బహుశ డబ్బు విలువ ఆయనకు తెలియటం వల్ల కావచ్చు.

మా అన్నయ్య మా ఊళ్ళోనే డాక్టరు కోర్సు చదువుతున్నాడు. అన్ని విషయాల్లో అన్నయ్యకే విలువ. అన్నయ్య పనులకే ప్రాముఖ్యత. మా ఇద్దరి మధ్యా తేడా నిండా రెండేళ్ళుండదు. కానీ అందరూ అన్నయ్యను గౌరవించేతీరు చూస్తుంటే మా ఇద్దరికీ ఎంతో ఎడముందనిపించేది. "వాడు మగాడు. పెద్ద చదువు చదువుతున్నాడు" అని అమ్మా, నాన్నా, అత్తా అందరూ అన్నయ్యను వెనకేసుకు వచ్చేవారు. నేనెంత బాధ్యతగా ఇంటిపనులు చేస్తున్నా, అన్నయ్య ఇంటి పనులు పట్టించుకోకుండా తిరిగినా అన్నయ్య మాటకే విలువ. అందరూ నా పట్ల చూపే చులకన భావాన్ని పట్టించుకోకుండా, నన్ను నేను గౌరవంగా చూసుకోవటానికి ఎంత కష్టపడ్డానో బహుశ చాలా మంది అమ్మాయిలు ఇలాగే కష్టపడతారనుకుంటాను.

ఉద్యోగంలో ఎక్కువ పనుండేది కాదు. లైబ్రరీ నుంచి పుస్తకాలు తెచ్చుకుని చదువుకుంటూ పెళ్ళికోసం ఎదురుచూస్తూ కాలం గడిపాను. పెళ్ళి గురించీ, నా జీవితం లో ఒక పురుషుడి ప్రవేశం గురించీ కలలు కందామంటే భయంగా అనిపించేది. పెళ్ళంటే ఏమిటి? పెళ్ళయ్యాక నేను మారిపోతానా? ఈ ఇంటి నుంచీ, ఈ మనుషుల

నుంచీ దూరమై ఇంకో వ్యక్తికి చెందుతానా? నేనంటూ మిగులుతానా? రకరకాల అస్పష్టతలతో చాలా దిగులుగా అనిపించేది. ఒక్కోసారి పెళ్ళి తొందరగా కుదిరితే బాగుండుననిపించేది.

చివరికి ఒక సంబంధం అందరికీ నచ్చింది. అతను గుంటూర్లోనే కాలేజీలో లెక్చరరుగా ఉద్యోగం చేస్తున్నాడు. మనిషి అందంగానే ఉన్నాడు. నాకు నచ్చాడు. పెళ్ళి జరిగిపోయింది. మొదటి రోజులన్నీ సంతోషంగానే గడిచిపోయాయి. అతన్ని సుఖపెడుతూ నేను సుఖపడటం. ఇందులో కూడా నేను స్త్రీనైనందుకు నాకు చాలా సంతోషంగానే అనిపించింది. సెక్సు జీవితాన్ని నేను కోరుకునేదాన్ని, ఇష్టపడేదాన్ని. మొదటి రోజుల్లో గమనించలేదు గానీ నా భర్తనది తీవ్రంగా కలవరపెట్టింది. ఆడది తనంతట తాను సెక్సు సుఖం కోరటం సహజం కాదని అతను మాట్లాడితే నేను నివ్వెరపోయాను. సినిమాల్లో, కథల్లో పురుషులే స్త్రీలను కోరటం, వాళ్ళు ముందు ఇష్టపడకపోవటం, మగవాళ్ళు బతిమాలటం, ఆడవాళ్ళు సిగ్గుపడటం, చివరకు ఎలాగైతేనేం పురుషులు స్త్రీల నుంచి సుఖం పొందటం ఇదంతా నేనూ చూశాను. కానీ ఎందుకో నా మనసుకది పట్టలేదు. నాకు సహజంగా కోరికలు కలిగితే వాటిని దాచుకుని, నాకు కోరికలే లేనట్టూ, అదంతా విసుగన్నట్టూ, భర్త ఆనందం కోసమే నేను ఆ పనికి సిద్ధమవుతున్నట్టూ, నటించాలని నాకు తెలియలేదు.

నాకు ముద్దు పెట్టుకోవాలనిపించగానే అతన్ని ముద్దు పెట్టుకునేదాన్ని. నా అంతట నేనే అతని పక్కన చేరి కౌగలించుకునేదాన్ని. అది నా భర్తకు చిరాకుగా ఉండేది. నా ప్రవర్తన అతనిలో లేనిపోని అనుమానాలను కలిగిస్తుందని అర్థమయ్యాక నేను నా కోరికలను అణుచుకోవటం నేర్చుకున్నాను. నా శరీరంతో నేను పొందాలనుకున్న సుఖం పొందలేకపోవటం నాకు చాలా వెలితిగా అనిపించింది. అతని కోరికలు తీర్చటానికేనా నా శరీరం? నా శరీరపు కోరికలు తీర్చుకోటానికి నేను చేసే ప్రయత్నం అతనిలో విముఖతనూ, చిరాకునూ ఎందుకు కలిగిస్తోంది నాకు అర్థమయ్యేదికాదు.

తన కోరికలను గురించి మాట్లాడని స్త్రీయే మంచి స్త్రీ ఔతుందా?

కోరికలు సహజంగా మనలో కలిగేవైనప్పుడు వాటి గురించి మాట్లాడితే తప్పెందుకవుతుంది?

ఈ సందేహాలతో సతమతమయ్యే రోజుల్లోనే నేను తల్లిని కాబోతున్నానని తెలిసింది. ఆ రోజు... నేను తల్లినవుతానని తెలిసిన రోజు, ఏమో అయ్యాను. నింగిని అందుకున్నాను. గుండెల్లో పొంగుతున్న సంతోషంతో పాటు ఏమూలో చిన్న భయం కూడా పుట్టింది.

ఏమవుతుంది? ఏం జరుగుతుంది? నా చిన్న పాపాయి ఎలా పెరుగుతుంది?

నా శరీరాన్ని గురించి నాకేమీ తెలియదని నాకప్పుడు స్పష్టమయింది. ఎలా తెలుసుకోవాలో కూడా తెలియలేదు.

నాకు తెలియవని శరీరంలో జరిగే మార్పులు ఆగవు గదా. నెలనెలా పొట్ట పెరుగుతోంది. బిడ్డ పొట్ట లోపల అటూ ఇటూ కదులుతుంటే ఎంతో తృప్తిగా అనిపించేది. ప్రపంచమంతా అందంగా కనిపించేది. జీవితమంటే ఎంతో ప్రేమ కలిగేది. నా చుట్టూ వున్నవారందరిమీదా ప్రేమా, దయా కలిగేవి. నన్ను పట్టుకుని ప్రాణం పోసుకుంటున్న ఆ పసిగుడ్డు ఎప్పుడు బైట పడుతుందా అని ఆరాటంగా ఉండేది. రాత్రిపూట, పొట్టలోపల తన్నినట్లయి మెలకువ వచ్చేది. పొట్టమీద చెయ్యి వేసుకుని పడుకుంటే నిశ్చింతగా ఉండేది. నా రక్తమే బిడ్డ ఆహారమవుతున్నందుకు గర్వంగా ఉండేది. వీటన్నిటి వెనకాలా లోపల ఎక్కడో భయం.

ఇదంతా ఎట్లా జరుగుతుంది? ఎట్లా జరుగుతుందో నాకు స్పష్టంగా తెలియదు. దానిని గురించి ఎవరిని ఎట్లా అడగాలో అర్థమయ్యేదికాదు. డాక్టరు నాకెప్పుడూ నా సందేహాలు అడిగే టైము ఇచ్చేదికాదు.

ఒకసారి నేను ధైర్యం తెచ్చుకుని నాకున్న భయాన్ని గురించి చెబితే చాలా చిరాకు పడింది. అర్థం పర్థంలేని ప్రశ్నలతో తన టైమంతా వృధా చేస్తున్నానని కసురుకుంది. నేను కంగారు కంగారుగా ఆ గదిలోంచి బైటపడ్డాను.

ఆమెకూడా ఆడమనిషే కదా? మరి మా అమ్మ మాత్రం – మా అత్త మాత్రం – వీళ్ళు కూడా ఆడవాళ్ళయినా నన్నెందుకు చిన్నచూపు చూశారు. తమని తామెందుకు తక్కువ చేసుకున్నారు?

చివరకు ఆరోజు రానే వచ్చింది.

నాబిడ్డను బైటికి తీసుకురావటానికి ఎంత శ్రమపడ్డాను? చచ్చిపోతానేమో అనుకున్నాను మొదట.

చచ్చిపోతేనేం. నా బిడ్డ సుఖంగా బైటపడితే చాలు అనుకున్నాను.

నడుము దగ్గర విపరీతంగా మొదలైన నొప్పి పొత్తికడుపు దగ్గరకు వచ్చి తగ్గిపోయేది. ఆ నొప్పి శరీరానికి బాధగా ఉండేదిగానీ, మనసుకి పట్టేది గాదు. ఐదు నిమిషాలకోసారి అలా నొప్పి వస్తుంటే అదొకరకం అనుభూతి. ఇంకా ఎంతసేపిలా అని నర్సుని అడిగితే "నిమిషానికి రెండు మూడుసార్లు రావాలి ఆ నొప్పి" అన్నది.

"భయంగా అనిపిస్తోంది. ఏం జరుగుతుంది?' అనడిగాను.

"భయం లేదూ యేమీలేదు. నువ్వొక్కదానివే కాదుగా, ఆడవాళ్ళందరూ కంటూనే ఉన్నారు. ఇదంతా కాసేపే, అందరిలాగానే నాకూ అనుకుంటే భయం ఉండదు" అంది నర్సు నవ్వుతూ.

ఆ గదీ, ఆ వాతావరణం అన్నీ కొత్తగా భయం గొలిపేలా ఉన్నాయి. చల్లటి ఇనుప బల్లా, చుట్టూ రకరకాల సామగ్రి, హడావుడిగా లోపలికి, బైటికీ తిరుగుతున్న నర్సులూ, లోషన్ల వాసన, పైకి చూస్తే పెద్ద పెద్ద లైట్లూ. అంతా అయోమయంగా అనిపించింది. ఎవరన్నా పక్క నుండి ఏదన్నా మాట్లాడితే బాగుండుననిపించింది. ఎవరినీ లోపలికి రానివ్వరు. అసలు నా భర్తకు నన్ను ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు కూడా తెలియదు. నేను మా పుట్టింటి నుంచి ఆసుపత్రికి వచ్చాను. అంతా సవ్యంగా జరిగాక కబురుచేద్దాంలే, ఈ రాత్రిపూట కంగారెందుకూ అని ఎవరూ అతనికి కబురంపలేదు. కబురు పంపినా ఇంత రాత్రివేళ నాకోసం అతనొస్తాడన్న నమ్మకమూ లేదు.

నేనొక్కదాన్నే మాట సాయం కూడా లేకుండా ఆ పెద్ద పనికి సమాయత్తమయ్యాను. నొప్పులు తీవ్రమవుతున్న కొద్దీ నా ఆలోచనలు ఆగిపోయాయి. మరింకో ఆలోచనకు తావేలేదు.

ఎలాగైనా ఆ నెత్తుటి ముద్దను బైటికి నెట్టాలి. అదే నా పని.

ఆ క్షణాన అదే నా జీవితం. అప్పుడింకో ధ్యాసే లేదు.

మెదడు అసలు పనిచేస్తోందా? శరీరమూ, మనసూ, మెదడూ అన్నీ కలిసి ఒకే పనిలో నిమగ్నమైపోయాయి.

అదిబాధా? ఆనందమా? అయోమయమా? ధ్యానమా? సాధనా? తపస్సా? - అన్నీనా?

మనశ్శరీరాలను తదేక ధ్యానంతో ఐక్యం చేసి సాధించిన పనివల్ల కలిగేదే బ్రహ్మానంద మైతే ఇదే ఆ బ్రహ్మానందమా-

నాకు స్పృహ పోతోందా?

నేనంటూ ఉన్నానా? నేనొక్కత్తినే ఉన్నానా?

నేనే సర్వ ప్రకృతినా? ఈ లోకంలో నేను తప్ప మరెవరూ లేరా?

ఉన్నారు.

బిడ్డ కెవ్వున ఏడ్చాడు. వాడి ఏడుపు చెవిని పడగానే ఒళ్ళు జలదరించింది. 'సృష్టించాను చివరికి' అనుకున్నాను. మళ్ళీ ఆ అయోమయపు అనుభూతి నుండి మామూలు ప్రపంచంలోకి వచ్చాను.

ఆ పసికందును నర్సు తెచ్చి చూపించింది. గులాబీ రేకులా నున్నగా మెత్తగా ఉన్న వాడి బుగ్గ మెల్లగా తాకినపుడు నా వెన్నుపూస కదిలిపోతున్నట్లే అనిపించింది. శరీరమంతా తేలికై పోయింది.

నా శరీరాన్ని చూసుకుంటే నాకే ఆశ్చర్యం వేసింది.

ఎంత శక్తి వుంది ఈ శరీరానికి. నేనేమిటో నాకు బాగా తెలిసింది.

ఈ సృష్టికార్యంలో నా శరీరం కుంచించుకుపోలేదు. విశాలమయింది.

సర్వ ప్రకృతినీ నేనేనా అన్నంతగా నేను విస్తరించాను.

నా శరీరాన్ని స్వేచ్ఛగా ఉపయోగించాను.

నేను చేయవలసిన పనికి అనుకూలంగా నా శరీరాన్ని నేను నిర్దేశించాను.

నేను నా శరీరపు యజమానిని. కాదు – ఈ శరీరం నాది. నాది మాత్రమే!

ఈ శరీరపు శక్తీ, ప్రయోజనం, రహస్యాలూ అన్నీ నాకిప్పుడు తెలుసు.

నా జీవితంలో నేను పొందిన అనుభవాలలోకెల్లా ఈ అనుభవం విలువైనది.

నామీద నాకు నమ్మకాన్నీ, నా శక్తిమీద గౌరవాన్నీ, నా శరీరం పట్ల మరింత ప్రేమనూ కలిగించిన అనుభవం ఇది.

నా బిడ్డ నా రొమ్ము నోట్లో పెట్టుకుని పాలు తాగుతుంటే నాకు కలిగిన పరవశం చెప్పలేనిది. నేను బిడ్డను సృష్టించడమే కాదు, బిడ్డ ఆహారాన్ని కూడా సృష్టిస్తున్నాను.

పొలం దున్ని, పంట పండించి ఆ పంటను బిడ్డలకు పెడుతున్న రైతులా ఉన్నాను నేను.

నా శరీరం ఎంత గొప్పది!

ఆడవాళ్ళెందుకు వాళ్ళ శరీరాలను చూసుకుని సిగ్గుపడటం, కించపడటం? ఆడవాళ్ళుగా పుట్టినందుకు అవమానపడటం?

నేను కన్న ఇద్దరు బిడ్డల్నీ చూసుకుని నేను స్త్రీ నైనందుకు మరింత గర్వించాను.

క్రమంగా సంసారంలో కలతలు ప్రారంభమయ్యాయి. నేను ఇంట్లో పని, పిల్లలపనీ, ఆఫీసు పనీ, ఇవన్నీ చేసుకుంటూ కూడా ఉత్సాహంగా వుండేదాన్ని. ఆ ఉత్సాహం నా భర్తకు నచ్చేదికాదు.

అతనికి అనుమానాలెక్కువ. నేను ఉత్సాహంగా ఉండటానికి ఎక్కడెక్కడి కారణాలో వెతికేవాడు. చివరికి ఎవరో ఒక మగవాడిని తలుచుకునే నేనింత సంతోషంగా ఉన్నానని తీర్మానించేవాడు.

నా ఉత్సాహాన్ని అణచటానికి అతను అన్ని ప్రయత్నాలూ చెయ్యటం మొదలుపెట్టాడు. నాకు నా బాల్యం జ్ఞాపకం వచ్చింది.

చిన్నతనంలో నేను పరిగెత్తటం చూసి నాన్న సహించలేకపోయాడు. నేను పరిగెత్తటం మానేశాను.

ఆపనైతే చెయ్యటం లేదుగానీ ఆ పని తాలూకు శక్తీ, ఉత్సాహం నాలో చచ్చిపోలేదు. ఇన్నాళ్ళకు కూడా అవింకా బతికే ఉన్నాయి. ఏదో ఒకరూపంలో వాటి ఉనికిని ప్రదర్శించు కుంటున్నాయి.

నా శక్తినీ ఉత్సాహాన్నీ నశింపచేయటమే జీవితాదర్శంగా పెట్టుకున్నాడు నా భర్త. పిల్లలను ఎత్తుకుని ఎగరేసి, వాళ్ళను ఆడించి నవ్వుతుంటే అతనికి చెప్పలేని చిరాకొచ్చేది. "ఎందుకలా విరగబడి నవ్వుతావు?" అంటూ నా నవ్వు మీద దాడి మొదలయ్యేది.

పిల్లలకు కథలు చెబుతుంటే వెటకారాలు. పిల్లలతో ఆడుకుంటే చిరాకు. "పిల్లలతో పాటు ఆ గంతులేమిటి?" పిల్లలతో పాటు నేను ఆడుకుంటే అతను భరించలేడు.

నేను ఇంతపనీ చేస్తూ ఉత్సాహంగా ఉండటం, అతను కాలేజీలో నాలుగ్గంటల పనికే తోటకూర కాడలా వేలాడబడిపోవటం, ఈ తేడా అతనికి నామీద అసూయ కలిగించింది.

ఆ అసూయతో అతను నా జీవితాన్ని హరించబూనుకున్నాడు.

విసుక్కోవటాలూ, కసురుకోవటాలతో ప్రారంభమై నెమ్మదిగా తిట్లదాకా వచ్చింది.

నేనే పనిచేసినా తప్పయిపోయింది. ఏ పని చెయ్యకపోయినా తప్పే అయింది.

అతని అధికారాన్ని సహించటం నావల్ల కాలేదు.

చిన్నప్పుడు గోలీలాట వద్దని నిషేధించినా, క్యారమ్స్ ఆడుకోమన్నారు.

ఇప్పుడు అదీ ఇదీ కాదు ప్రతి పనిమీదా నిషేధాలే.

చిన్నతనంలో నాకు ప్రశ్నలు తప్ప సమాధానాలు తెలియవు. అందుకని నామీద పెట్టిన నిషేధాలను ప్రశ్నించుకుని ఊరుకునేదాన్ని. ఇంకో పనిలో పడిపోయేదాన్ని.

అప్పుడు నా శక్తేమిటో నాకు తెలియదు. అమ్మా నాన్నల చాటున పెరుగుతున్న దానిని.

నా వ్యక్తిత్వం అప్పుడింకా వికసించలేదు. అందువల్ల వాళ్ళ నిషేధాలు నడిచాయి. అప్పుడు లోకం గురించీ లోకరీతి గురించీ నాకెంతో అయోమయం ఉండేది.

ఇప్పుడు నేనో వ్యక్తిని. నేను పనిచేసి సంపాదిస్తున్నాను.

నా తిండి నేను తింటున్నాను. ఎవరిమీదా ఆధారపడి లేను.

పైగా నేను తల్లిని. ఇద్దరు పిల్లల్ని కని పాలిచ్చి పెంచాను.

నేనొక వ్యక్తిననే జ్ఞానం ఒచ్చాక నా భర్త పెట్టే నిషేధాలకు లొంగి వుండే ప్రశ్నే లేదు.

పైగా నాకిప్పుడు సమాజాన్ని గురించిన జ్ఞానం వుంది. ఆడవాళ్ళ మీద ఈ నిషేధాలు ఎందుకో నాకు పూర్తిగా తెలియకపోయినా ఆడవాళ్ళను పీడించటం మీద నాకు తీవ్రమైన వ్యతిరేకత వుంది.

ఇవన్నీ యిచ్చిన శక్తితో నేను నా భర్తమీద తిరగబడ్డాను. ఇద్దరి మధ్యా రోజూ పోట్లాటలతో జీవితం అశాంతిమయమయింది.

పెళ్ళంటే ఏం జరుగుతుంది అని చిన్నప్పుడెప్పుడో నాకొచ్చిన సందేహానికి సమాధానం దొరికినట్లయింది.

పెళ్ళంటే ఇదా? ఈ నరకమా?

ఆత్మలో నుంచి పుట్టుకొస్తున్న జీవన సంగీతాన్ని హత్య చెయ్యటమేనా పెళ్ళంటే – మనిషిని బానిసగా, యంత్రంగా మార్చటమేనా పెళ్ళంటే–

నా సంపాదన నాకంత శక్తి యిచ్చిందని నా భర్తకు అర్థమయింది. నన్ను ఉద్యోగం మానెయ్యమని పోరు పెట్టాడు. మొదట నా మీద ప్రేమతోనే, నా కష్టం చూడలేకనే ఉద్యోగం వద్దంటున్నట్లు మాట్లాడాడు. నాకే కష్టమూ లేదనీ, ఇంకా యింత పనైనా అవలీలగా చేసుకోగలనని గట్టిగా చెప్పేసరికి కోపం వచ్చింది.

"ఉద్యోగం చూసుకునే నీకీ తలపొగరు. నువ్వు కాలేజీకి వెళ్లొద్దు" అని ఆజ్ఞాపించటం లోకి దిగాడు.

"నాది తలపొగరైతే అది నా తలతోటే ఉంటుంది. ఉద్యోగంలో ఉండదు. దేవుడు దిగొచ్చి చెప్పినా నేను కాలేజీకి వెళ్ళటం మానను" అని ఖచ్చితంగా చెప్పాను.

ఒక రోజు కాలేజీ టైముకి తనుకూడా సెలవు పెట్టి నన్ను ఇంట్లోనుంచి బైటికి పోనీయలేదు. నేను ఆరోజుకి ఊరుకున్నాను. మర్నాడు చాలా ముందుగానే తయారై వెళ్ళిపోయాను. అతనికి పంతం హెచ్చింది.

ఆడదాని చేతిలో, అందులో పెళ్ళాం చేతిలో ఓడిపోవటం అతనికి భరించలేని అవమానం కలిగింది. కానీ నేను లొంగలేదు.

ఉద్యోగం మాన్పించలేనని తెలిశాక జీతం మొత్తం తనకిచ్చెయ్యమన్నాడు.

ఒక్క పైసా కూడా యివ్వనన్నాను. అంతవరకూ నా జీతంలో ఒక వందరూపాయలు మాత్రం దాచి మిగిలినదంతా ఇంటికే వాడుతుండేదానిని. ఇక ఇంటి ఖర్చులకు నా

డబ్బు వాడననీ, నా ఖర్చులకు మాత్రమే వాడతాననీ చెప్పాను. నేను ఉద్యోగం చెయ్యటం యిష్టం లేనపుడు నేను సంపాదించిన డబ్బెలా ఇష్టమవుతుందని ప్రశ్నించాను.

ఒక నెల అలాగే గడిచింది. ఇంటి ఖర్చంతా తన డబ్బులోంచే పెట్టేసరికి అతని జల్సాలకు ఆటంకం కలిగింది. ఈసారి జీతం మొత్తం తనకిచ్చెయ్యాల్సిందేనని ఖచ్చితంగా చెప్పాడు.

ఆ నెల ఫస్టు తారీఖున జీతం తీసుకుని ఇంటికి వచ్చాను. డబ్బు బీరువాలో దాచి తాళాలు బొడ్లో దోపుకున్నాను. అంతకు ముందు రోజునే 'రేపు జీతం యివ్వకపోతే ఏం చేస్తానో చూసుకో'మని బెదిరించాడు. నేను పెరట్లో పని చేసుకుంటుంటే వచ్చి తాళాలడిగాడు.

'ఎందుకు' అన్నాను.

'బీరువాలో నాకేం పనుందదా? బీరువా నీదా? నీ బాబిచ్చాడా?' అని ఎగిరాడు.

'మానాన్న ఇవ్వలేదుగానీ, అది నేను కొన్నదే' అంటూ నేను లోపలికి వచ్చాను.

బీరువా తాళం తీసి, నా పర్సు బీరువాలోంచి తీసి, సూట్కేసులో పెట్టి తాళం వేశాను. ఆ తాళం పిన్నీసుతో నా గొలుసుకి పెట్టుకున్నాను. ఇదంతా చూసి అతను మండిపోయాడు. నేనిచ్చిన బీరువా తాళాలు నా ముఖాన కొట్టాడు.

"డబ్బిస్తావా? ఇవ్వవా?"

"ఇవ్వను" ఖచ్చితంగా చెప్పాను.

అంతే. నామీద పడి కొట్టటం మొదలుపెట్టాడు. నేనూ కాళ్ళతో తన్ని అతన్నించి బైటపడి పెరట్లోకి పరిగెత్తాను. అక్కడ చూసుకుంటే నా మెడలో గొలుసు లేదు. నేను మళ్ళీ ఇంట్లోకి పరిగెత్తాను. అతను సూట్కేసు తాళం తీసుకున్నాడు.

నేను వెళ్ళి అతనిమీద పడి కొట్లాడి తాళం చెవిలాక్కున్నాను. నా శక్తికతను విస్తుపోయాడు. ఆ తర్వాత తిడుతూ కొట్టటానికి వచ్చాడు. నేనూ ఎదురు తిరిగి నిలబడ్డాను.

ఇక యిట్లా లాభం లేదని ఆగి "ముందు ఇంట్లోంచి బైటికి నడవమ"న్నాడు.

నాకూ అదే అనిపించింది. "నేనొచ్చేసరికి ఇంట్లో కనిపించావో చచ్చావే" అంటూ అతను బైటికి వెళ్ళిపోయాడు.

నాకు అలసట అనిపించింది గానీ నీరసంగా లేదు. నా నరాలు బలహీన పడలేదు.

ఈ పోరాటం నాకు ధైర్యాన్నిచ్చిందే గాని బలహీనురాల్ని చెయ్యలేదు.

ఈ ఇంట్లో బ్రతకటం అసాధ్యం.

నేను వెంటనే పిల్లల్ని తీసుకుని పుట్టింటికి చేరాను.

నేను వెళ్ళి విషయమంతా వివరంగా చెప్పాను. నేను చెప్పటం ముగించక ముందే ఇంట్లో గొల్లున ఏడుపులు మొదలయ్యాయి. అందరూ నన్ను తిట్టడం మొదలెట్టారు. నా పొగరుమోతుతనాన్నీ, నా మగరాయుడి లక్షణాల్నీ చిన్నప్పటి నుండి తవ్వి తలకెత్తు కున్నారు.

వెంటనే వెళ్ళి అతని పాదాలమీద పడి క్షమాపణ వేడుకోమన్నారు. నేనా పని చెయ్యకపోతే నా తరపున ఆ పని చెయ్యటానికి మా అమ్మా నాన్నా అందరూ సిద్ధమయ్యారు. ఒక్కరాత్రికి కూడా వాళ్ళు నన్నక్కడ ఉంచుకోవటానికి ఇష్టపడలేదు. "పద పదమ'ని తొందర పెట్టారు.

నేనెంత నిర్వీణ్ణురాలినయ్యానో చెప్పలేను. వీళ్ళకు నేను ఆడదానిగా తప్ప కని పెంచిన బిడ్డగా కనిపించటం లేదే అని కుమిలిపోయాను.

రాత్రి పూట యిద్దరు చిన్న పిల్లల్ని వెంట బెట్టుకుని కూతురు ఇంటికి వస్తే తరిమేస్తున్న కసాయితనం వీళ్ళకెలా అలవడిందా అని అలమటించాను.

ఎంత అలమటించీ ప్రయోజనం లేదు. నా దారి నేను చూసుకోవలసిందే -

నేను మా ఇంటికి వెళతానని పిల్లలిద్దరితో బయలుదేరాను.

రాత్రి పదిగంటల సమయం. పిల్లలతో ఎక్కడికి వెళ్ళాలి?

అతని దగ్గరికి తిరిగి వెళ్ళేది లేదని నేను వచ్చేటప్పుడే నిర్ణయించుకున్నాను. తల్లిదండ్రులు కొన్నాళ్ళయినా ఆశ్రయమిస్తారనుకుంటే వాళ్ళూ తరిమేశారు.

ఆడపిల్ల పెళ్ళయ్యాక పుట్టింట్లో ఉండకూడదు. అది వాళ్ళ నరనరాల్లో జీర్ణించుకు పోయిన నమ్మకం. ఆ నమ్మకాన్ని సమాజం వాళ్ళ రక్తంలో ఇంకిపోయేలా చేసింది. దాన్నించి వాళ్ళు బయటపడలేదు.

నాకు కూడా ఆ విశ్వాసాలను సమాజం నూరిపొయ్యాలని చూసింది.

నేను కాలేజీలో చేరగానే నేర్చుకున్న మొదటి పద్యం, నా తెలుగు పుస్తకంలో మొదటి పాఠంలో మొదటి పద్యం - ఏమిటి దాని సారాంశం. శకుంతలకు కణ్వుడు చెప్పిన పద్యం.

"ఎట్టి సాధ్వులకున్ బుట్టిన యిండ్లను
బెద్దకాల మునికి తద్ద తగదు
పతుల కడవ యునికి సతులకు ధర్మువు

సతుల కీడుగడయు బతుల చూవె"

ఇదీ కాలేజీకి వెళ్ళగానే నేను నేర్చుకున్న మొదటి ధర్మం. మొదటి నీతి.

ఆ ధర్మాలూ ఆ నీతులూ నాకు ఒంటబట్టలేదు. వాటిని నిరోధించే శక్తీ, చేవా నాలో ఉన్నాయి. ఆ నమ్మకాల నుంచి తప్పించుకుని నా భర్త నుంచి విడిపోయా స్వేచ్ఛగా బతకాలనుకున్నాను.

బతుకుమీద వున్న ఆ ఆశే, ఆ రాత్రి నా స్నేహితురాలింటికి నడిపించింది.

ఆమె నేను పనిచేసే కాలేజీలోనే లెక్చరర్. అంత రాత్రివేళ ఆమె నాకు ఆశ్రయ మిచ్చింది. నా కథంతా విని సానుభూతి చూపించింది. నేను తీసుకున్న నిర్ణయం మంచిదని ప్రోత్సహించింది.

రెండు రోజులు కాలేజీకి సెలవు పెట్టి వాళ్ళింట్లోనే ఉన్నాను. వాళ్ళింటికి దగ్గర్లోనే ఓ గది వెతుక్కున్నాను. పది రోజుల్లో ఇంట్లోకి కావలసినవన్నీ సమకూర్చుకున్నాను. నెల రోజులు గడిచిపోయాయి. అతనుగానీ, నా పుట్టింటివారుగానీ పట్టించుకోలేదు. నాకాశ్రయ మిచ్చిన భారతి మా అమ్మా నాన్నల దగ్గరకెళ్ళి మాట్లాడబోతే –

"అది మొగుడి దగ్గరుంటేనే మా దృష్టిలో బతికున్నట్లు, అదెక్కడో దానిష్టం వచ్చినట్టుంటే చచ్చిందని ఒక యేడుపేడ్చి ఊరుకుంటాం" అన్నారట. అమ్మ నిజంగానే ఏడ్చిందట. నాన్న అమ్మను తిట్టాడట.

భారతి ఇవన్నీ చెప్పినప్పుడు నేను ఆశ్చర్యపోలేదు. బాధపడలేదు. నా జోలికి వాళ్ళు రాకపోవటమే నాకు మంచిదనుకుని నిశ్చింతగా బతుకుతున్నాను.

పిల్లలు బడికి వెళుతున్నారు. పెద్దవాడు ఒకటో తరగతి. రెండోవాడు నర్సరీక్లాసు. నేను రోజూ వాళ్ళను స్కూల్లో దించి సాయంత్రం కాలేజీ నుంచి వస్తూ వాళ్ళను తీసుకొస్తాను. జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది. నా పనులను ప్రశ్నించేవారూ, నిషేధించేవారూ లేరు. పిల్లలతో స్వేచ్ఛగా ఆడి పాడుతున్నాను. నా చుట్టుపక్కల వాళ్ళకు నా సంతోషం వింతగానే కనిపించి వుంటుంది. మొగుడిని ఒదిలి నా యిష్టానుసారం బతుకుతూ, ఏ కొంచెం విచారపడని నేను వాళ్ళకు అర్థం కాలేదు.

ఒకరోజు మామూలుగానే కాలేజీ నుంచి పిల్లల్ని తీసుకురావటానికని వాళ్ళ స్కూలుకి వెళ్ళాను. పిల్లలు ఎక్కడా కనపడలేదు. టీచర్ని అడిగితే 'మధ్యాహ్నం వాళ్ళ నాన్నగారు వచ్చి తీసుకెళ్ళారండి' అని చెప్పారు.

నా గుండె ఆగినంత పనయింది. నా సర్వశక్తులూ హరించుకుపోయాయి. కాళ్ళు ఒణికాయి. కళ్ళు తిరిగాయి.

గుండెల్లో విపరీతమైన భయం. కడుపులోంచి ఆగకుండా దుఃఖం వచ్చేస్తోంది.

ఏం చెయ్యాలి? పిల్లల్ని ఎలా తెచ్చుకోవాలి?

కాళ్ళూ చేతులూ ఆడలేదు. నీరసం కమ్ముకొచ్చింది.

ఇంతకు ముందెన్నడూ ఈ స్థితి నాకు అనుభవంలో లేదు.

నువ్వు ఆడదానివి అని నన్ను తక్కువ చేసిన సందర్భాలన్నింటిలో నాకు కోపం వచ్చేది. ఆ కోపం నాకు ఆ సంఘటనని ఏదో ఒక రకంగా ఎదుర్కోగల బలాన్నిచ్చేది.

ఇవాళ నాకు ఈ భయం ఎందుకు?

సర్వశక్తులు కూడగట్టుకుని అతనింటికి వెళ్ళాను. తలుపులు వేసి వున్నాయి. తలుపు కొడితే అతను బైటికి వచ్చాడు. పిల్లలేరని అడిగాను.

"పిల్లలు లోపలున్నారనీ, తన దగ్గరే ఉంటారనీ, వాళ్ళు తన పిల్లలనీ, నాకు వాళ్ళమీద ఎలాంటి హక్కూ లేదనీ" చెప్పి నా మొహానే తలుపేశాడు.

నేనెలా ఇల్లు చేరానో నాకు గుర్తులేదు.

ఆ పిల్లలు అతని పిల్లలట.

ఆ పిల్లల మీద నాకే హక్కూ లేదట. అతని భార్యగా ఉంటేనే వాళ్ళమీద నా హక్కట. నా భర్త చెప్పాడు.

నా నెత్తురు పీల్చుకున్న పిల్లలు.

నా ఊపిరి పోసుకున్న పిల్లలు-

నన్ను పట్టుకుని నా పొట్టలో కదిలిన పిల్లలు-

నా శరీరాన్ని చీల్చుకుని బైటపడిన పిల్లలు-

వాళ్ళు నా పిల్లలు కాదట.

ఇదిగో వీడిని చూడమని రోజుల పిల్లవాడిని ఒళ్ళో పడుకోబెడితే - ఛీ, ఛీ, నాకు చీదర తీసెయ్యమన్న అతని పిల్లలంట.

నా రొమ్ముల్ని పట్టుకుని వాళ్ళు ఆత్రంగా పాలు తాగుతుంటే వాళ్ళ ఆకలి తీర్చిన గర్వంతో పొంగిపోయిన నా పిల్లలు కాదట.

ఆకలై వాళ్ళేడుస్తుంటే "ఎందుకట్లా ఏడుస్తారు. నిద్రపోనివ్వకుండా" అని చిరాకు పడ్డ అతని పిల్లలేనట.

చలికాలంలో పక్కలో ఉచ్చ పోసుకుని అలాగే నిద్రపోతే, ఆ లేత తొడలు పాసి పోతాయేమోనని రాత్రులు మేలుకుని కూచున్న నా పిల్లలు కాదట.

బలవంతాన నా పోరు పడలేక ఎత్తుకుని, వాడు ఉచ్చపోస్తే చీదరించుకుంటూ ఉయ్యాలలో పడేసిన అతని పిల్లలేనట.

వాళ్ళ శరీరంలో అంగుళం అంగుళమూ పరిచయం నాకు. నిద్రపోతున్న ఆ పసివాళ్ళను చూడటమే ఆనందంగా గంటలకు గంటలు గడపగలను.

పుట్టినప్పుడు వాళ్ళ మాడు మీద గుంట ఎంతుందో, అది రోజు రోజుకి ఎంత పూడిందో నాకు తెలుసు.

వాళ్ళ నుదుటిమీద వెంట్రుకలెలా పడతాయో–

చెవికింద పుట్టుమచ్చ ఎంతదో–

ఆకలేస్తే వాళ్ళ పొట్ట ఎంత లోపలికి పోతుందో

సుస్తి చేసే ముందు వాళ్ళ కళ్ళు ఎలాగుంటాయో

చేతిగోళ్ళు ఉబ్బెత్తుగా వచ్చి ఎలా కిందకి జారినట్లుంటాయో–

వాళ్ళ అరికాళ్ళలో ఎన్ని గీతలుంటాయో, ఎలా ఉంటాయో అన్నీ తెలుసు నాకు.

అయినా ఆ పిల్లలు నా పిల్లలు కాదట. వాళ్ళమీద నాకే హక్కూ లేదట.

నాకే హక్కూ వద్దు.

నా ఇంటి పేరుతో వాళ్ళు వర్థిల్లవద్దు.

నాకేం ఆస్తులు లేవు వాళ్ళకు సంక్రమింప జెయ్యటానికి.

నా వంశ ప్రతిష్టను వాళ్ళు పెంచాలనే కోరికాలేదు.

నాకేం కావాలి?

ఆడి ఆడి వచ్చిన వాళ్ళ ఒళ్ళు శుభ్రంగా రుద్ది నీళ్ళు పొయ్యాలి.

ఆకలితో నకనకలాడే వాళ్ళ పొట్టకు అన్నం ముద్దలు అందించి ఆకలి తీర్చాలి.

చిన్నారి వేళ్ళను పట్టుకుని అక్షరాలు దిద్దించాలి. కథలు చెప్పి నిద్రపుచ్చాలి. వాళ్ళతో పాటు ఆడిపాడాలి.

రెక్కలు రాగానే వాళ్ళెగిరి పోతుంటే ఆశ్చర్యానందాలతో చూడాలి.

ఇవన్నీ నేను చెయ్యగలననుకున్నాను.

నా శరీరం పెరిగినంత సులువుగా, నేను తల్లినైనంత సులువుగా యివన్నీ జరుగుతా యనుకున్నాను.

ఇవన్నీ జరగాలంటే నాకిష్టమున్నా లేకున్నా అతని భార్యగా వుండాలి.

అతని భార్యగా ఉంటేనే నేను తల్లిని. లేకపోతే నేను తల్లిని కాను. నేను బిడ్డల్ని కన్న సంగతి మర్చిపోవాలి. నాకే హక్కూ లేదు.

ఆ రాత్రి ఎట్లా గడిచిందో నాకే తెలియదు. పిల్లల్ని తలుచుకుంటే ఏడుపాగలేదు. నేను లేకుండా ఎక్కడా ఒక్కరోజు కూడా వుండలేదు. చిన్నవాడు నా పక్కలో తప్ప పడుకోడు.

వాళ్ళకి అతను అన్నం పెట్టి వుంటాడా? వాళ్ళ పేచీలకు అతనికి చిరాకొచ్చి కొడితే ఏడుస్తూ పడుకున్నారా?

అమ్మకావాలని వాళ్ళేడిస్తే - అర్ధరాత్రి నిద్రలో భయపడి లేచి ఏడిస్తే-

ఆలోచనలతో నా తల పగిలిపోయింది. వాళ్ళను చూడకుండా నేను బతకలేనని పించింది.

ఎలాగోలా వాళ్ళను తెచ్చేసుకోవాలి. అతను తనంతట తాను ఇవ్వడు. నా మీద పగ తీర్చుకోటానికే పిల్లల్ని తీసుకెళ్ళాడు.

నన్ను మరే రకంగానూ సాధించలేక, పిల్లల మీద నాకున్న ప్రేమను బలహీనతగా చూసి పిల్లల ద్వారానే సాధించ బూనుకున్నాడు. పిల్లల కోసంనేనతని దగ్గరకు వస్తాననీ, చచ్చినట్టు అతనితో కలిసి ఉంటాననీ, నా తల పొగరు అణచటానికి ఇదే సరైన మార్గమనీ అతను గ్రహించాడు.

కానీ నేనతనికి లొంగను. ఎలాగోలా పిల్లల్ని తెచ్చుకుంటాను.

ఎలా? ఎలా? ఎట్లా తెచ్చుకోవాలి నా పిల్లల్ని.

గుండెలవిసేలా ఏడుస్తున్న నన్ను చూసి జాలిపడిన వారే లేరా రాత్రి. నిమిషమో యుగంలా గడిచి, తెల్లవారటానికి జంకుతున్నట్లుగా తెల్లవారిందా రాత్రి.

ఎనిమిది కాకముందే బడికి వెళ్ళి కూచున్నాను. రాత్రంతా తిండి లేదు. నిద్ర లేదు. శరీరం నీరసంతో అలసటతో తూలిపోతోంది.

పిల్లలు వస్తారా? అతను పంపుతాడా? అతనంత తెలివితక్కువ వాడా?

అతనే పిల్లల్ని తీసుకుని వస్తే - నేనతనికి కనపడకుండా ఏమూలో దాక్కొని అతనెళ్ళాక పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోవాలి.

నాకు పిల్లల్నివ్వవద్దని టీచర్లతో చెప్పడు కదా -

చెప్పినా సరే ఎలాగోలా బతిమాలో కాళ్ళు పట్టుకునో నా పిల్లల్ని నేను తీసుకుపోవాలి. కాని అసలు తీసుకువస్తాడా? లేదా?

నా తల దిమ్మెక్కి పోయింది. కళ్ళుతిరుగుతున్నాయి. ఒంట్లో ఓపికనంతా పోగు చేసుకుని నిల్చున్నాను.

ఒక్కొక్కరే పిల్లలు వస్తున్నారు. పిల్లలతో స్కూలంతా నిండిపోతోంది. నా పిల్లలు రావడంలేదు.

పదిగంటలయింది. పిల్లలంతా క్లాసుల్లోకి వెళ్ళారు. నా పిల్లలు రాలేదు. పదిన్నర దాకా చూసి వాళ్ళిక రారని నిశ్చయించుకున్నాను.

ఇప్పుడు కాలేజికి వెళ్ళే ఓపిక లేదు. ఎలాగో ఇంటికి వెళ్ళి పడ్డాను.

ధైర్యం కోసం పిచ్చిగా ప్రయత్నించాను. ఉబికి వస్తున్న దుఃఖాన్ని బలవంతాన మింగేశాను.

ఇలా నీరసపడితే, నిరాశపడితే నేనేమీ చెయ్యలేను. నేను చెయ్యాల్సిన పని చాలా పెద్దది.

నా పిల్లల్ని నేను సాధించుకోవాలి. దానికి ఎంతో శక్తి కావాలి. ధైర్యం కావాలి. ఈ ఏడుపులు పనికిరావు.

ఈ ఏడుపు నా గుండెను బలహీనపరుస్తుంది. ఈ ఏడుపు నా శరీరాన్ని శిథిలం చేస్తుంది.

నా మనశ్శరీరాలు శిథిలమైపోయాక నా పిల్లల్ని యెట్లా పెంచుకుంటాను. నా పిల్లల కోసం నేను బలంగా గట్టిగా నిలబడాలి. శక్తిహీనురాలిని కాకూడదు. నా మెదడు ఎప్పటికన్నా చురుగ్గా పనిచెయ్యాలి. నా శరీరం ఎప్పటికన్నా బలంగా ఉండాలి. అలాగైతే నేను నా పని సాధించుకోగలుగుతాను.

ఇట్లా ఎన్నో రకాలుగా నాకు నేను ధైర్యం చెప్పుకుని సాయంత్రానికి ఓపిక తెచ్చుకుని భారతి దగ్గరకు వెళ్ళాను.

భారతీ నేనూ కలిసి ఏం చెయ్యాలా అని ఆలోచించాం. విడాకుల కోసం, పిల్లల కోసం కోర్టుకి వెళ్ళటం తప్ప మరో మార్గం కనిపించలేదు. ఆమె తనకు తెలిసిన ప్లీడరు దగ్గరికి నన్ను తీసికెళ్తానంది. భారతి భర్త మా మాటలు విని అన్నాడు -

"పిల్లల మీద అతనికే హక్కుంటుందనుకుంటానండీ - మీరు బాగా ఆలోచించుకోండి. తీరా పిల్లలు మీకు దక్కకపోతే చాలా బాధపడాల్సి వస్తుంది. ఎలాగోలా ముందే రాజీ పడితే పోతుందేమో"

నాకు కోపం దుఃఖం ముంచుకొచ్చాయి. అందరూ అదే మాట మాట్లాడతారేమిటి?

పిల్లల మీద అతనికే హక్కుండటం ఏమిటి? నేను కనిపెంచిన పిల్లల మీద నాకే హక్కూ లేకపోవటమేమిటి?

ఆయనతో నాకంత పరిచయం లేకపోవటాన కోపాన్ని దాచుకోగలిగాను గానీ దుఃఖాన్ని దాచుకోలేకపోయాను.

నా దుఃఖాన్ని చూసి ఆయన మరింత గట్టిగా చెప్పాడు. "చూశారా మీరు ఆ ఊహే భరించలేకపోతున్నారు. భారతీ – లాయర్ దగ్గరికి ముందు నువ్వెళ్ళి అన్ని విషయాలూ మాట్లాడు. పిల్లల విషయంలో ఆశ ఉందంటేనే కోర్టుకి వెళ్ళటం మంచిది. లేకపోతే రాజీ మార్గం ఆలోచిద్దాం".

"నేను రాజీ పడే ప్రశ్న లేదండి" నా సమాధానానికి ఆయన ఆశ్చర్యపోయాడు.

"పిల్లలకోసమైనా తప్పదుగదా–"

"ప్లీజ్ – ముందు ఆవిషయం లాయర్‌తో మాట్లాడుదాం".

భారతి ముందు తనొక్కతే లాయర్ దగ్గరకు వెళ్ళి నా విషయమంతా వివరించి చెప్పింది.

భారతి ముఖం చూస్తే లాయరు ఏమాత్రం అనుకూలంగా మాట్లాడినట్లు లేదు.

"నేను అన్ని విషయాలు ఆయనతో చెప్పాను. ఆయన నీతో మాట్లాడతానన్నారు. పద వెళదాం" అన్నది.

ఇద్దరం కలిసి లాయర్ దగ్గరకు వెళ్ళాం. ఇదే చివరి ఆశ. న్యాయశాస్త్రంలో ఇంత అన్యాయం ఉంటుందా? నిజంగానే నా భర్త చెప్పిందే న్యాయమా?

అలాగయితే ఏం చెయ్యాలి?

లాయర్ కూడా చెప్పాడు "నీకేమీ హక్కులేదమ్మా".

"నా పిల్లలమీద నాకు హక్కులేదా?"

నా చివరి ఆశ భగ్నమై పోయిన నిరాశలోంచి కసి, కోపం పుట్టుకొచ్చాయి. "వాళ్ళు ఐదేళ్ళు నిండేవరకే నీ పిల్లలు. తర్వాత వాళ్ళమీద పూర్తి హక్కు నీ భర్తదే. నీది కాదు".

"వాళ్ళను కన్నది నేను"

"అయినా అతనికే హక్కు" లాయరుగారు నా అమాయకత్వానికి చిన్నగా నవ్వారు. నేనది పట్టించుకుని ఆగేస్థితిలో లేను.

"ఇవ్వాల్టి వరకూ వాళ్ళను నేనే పెంచాను, అతనుకాదు"

"అయినా అతని పిల్లలే"

"ఇప్పుడు కూడా వాళ్ళనతడు పెంచడు. ఏ బంధువులింట్లోనో పడేస్తాడు".

"అయినా అతనికే హక్కుంది".

"నేను లేకపోతే నా పిల్లలు బతకరు. బెంగతో చచ్చిపోతారు".

"అయినా అతనికే హక్కు" లాయరు నాకంటే మొండిగా సమాధానాలిస్తున్నాడు. ఇన్నాళ్లూ నాలోపల అణుచుకున్న ఆవేశం కట్టలు తెంచుకుంది.

"ఎందుకుంది అతనికీ హక్కు ఎవరిచ్చారు? నేనేం నేరం చేశానని నాకా హక్కులేదు? అతనేం ఉద్ధరించాడని అతనికా హక్కు లిచ్చారు?"

"చూడమ్మా-ఆవేశపడకు. నేను నాలుగు మాటలు చెబుతాను. మధ్యలో అడ్డం పడకు. అర్థం చేసుకో. నీ బాధ నాకర్థమవుతుంది. కాని చట్టాని కేమర్థమవుతుంది చెప్పు. ఇప్పుడు ఒక పొలాన్ని ఒకరికి కౌలుకిచ్చామనుకో, కౌలుకి తీసుకున్నతను తనకిష్టమైనపుడు నాటేసుకుని, పండాక పంట కోసుకెళ్తాడు. నువ్వు నీ భూమిని అతనికి కౌలుకివ్వాలా వద్దా అని ముందు ఆలోచించుకోవాలి. ఒకసారిచ్చేశావనుకో. అంతే పండిన పంటంతా అతనిదే. అతనే దానికి హక్కుదారు".

"మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలుస్తోందా?"

"ఆ. బాగా! బాధలో ఉండటం వల్ల నీకే తెలియటంలా. ఆడది క్షేత్రం అంతే".

"నేను క్షేత్రాన్నా. నేను మనిషిని కానూ? నాకు మీ మగవారిలా శరీరం లేదూ? దానిలో మీకులాగా రక్తమాంసాలు లేవూ? నాకు మనసు లేదూ? దానిలో కోర్కెలు లేవూ? నా శరీరంతో నేను రకరకాల పనులు చేయటం లేదూ? నేను మనిషిని కాదూ?"

"కాదు. నువ్వు ఆడదానివి. ఆడది అంటే క్షేత్రం. అంతే".

మేం కన్న పిల్లలే పెరిగి మగవాళ్ళయి మా హక్కుల్ని కాలరాస్తారు.

మేం కన్న పిల్లలే పెరిగి మగవాళ్ళయి మమ్మల్ని మనుషులే కాదంటారు.

"మీరు చెప్పిన పన్లన్నీ నోరుమూసుకు చేసినన్నాళ్ళూ మమ్మల్ని అమ్మ అంటారు. తల్లి అంటారు. దేవత అంటారు. ఇల్లాలు అంటారు. చెల్లెలంటారు. మేం మీకు లొంగక నిలబడ్డామో? అంతే – మాకే హక్కూ లేదు.

మేం తల్లులం కాదు. ఆవులం.

మేం చెల్లెళ్ళం కాదు. గేదెలం.

మేం ఇల్లాళ్ళం కాదు. పందులం.

మేం దేవతలం కాదు. పొలాలం.

మాకే హక్కూ లేదు. మామీద మాక్కూడా హక్కులేదు. మేం పెళ్ళాడాలన్నా మా యిష్టం కాదు. పెళ్ళిని కాదనాలన్నా మా ఇష్టం కాదు. అంతెందుకు మామీద సర్వ హక్కులూ మీవే. మా రక్తం మీద, మా కోర్కెల మీద, మా ఆలోచనల మీద, మా మీదా – అన్నిటిమీదా, మీకే హక్కు. మేం ఆడవాళ్ళం".

భారతి నా చెయ్యి పట్టుకుని వారిస్తోంది. నేను ఏదీ పట్టించుకునే స్థితిలో లేను.

"ఆవేశం తగ్గించుకోమ్మా – స్వాతంత్ర్యం, పిల్లలూ రెండూ కావాలంటే రావు ఏదో ఒకటే" లాయరు మాటల్లో వ్యంగ్యం వినిపించి చురుగ్గా చూశాను.

లాయరు సర్దుకున్నాడు.

"నిజమేనమ్మా నేచెప్పేది. నీ సంగతనేకాదు. చాలా మంది యిట్లా బాధలు పడ్డారు. నీకు అనిబిసెంటు తెలియదూ? ముందు మతాన్ని నమ్మేది. తనలాగే మతాన్ని నమ్మేవాడిని పెళ్ళాడింది. తర్వాత మతం మీద నమ్మకం పోయింది. భర్తతో సరిపడలేదు. విడాకు లిమ్మంటే అతనివ్వడు. ఈవిడ నాస్తికురాలు గనుక పిల్లని పెంచటానికి అర్హత లేదని కోర్టుకెళ్ళాడు. కోర్టులో గెలిచి పిల్లను లాక్కెళ్ళాడు. ఎంత ప్రయత్నించినా విడాకులు రాలేదు. అతనివ్వడు.

ఎందుకొచ్చిన చిరాకులమ్మా, ఇప్పుడే ఇంత బాధపడుతున్నావు. పిల్లలంటే వల్లమాలిన ప్రేమ ఉంది. ఎలాగోలా అతనితోనే రాజీపడి బతకరాదా?"

నేనేం మాట్లాడలేదు.

"కోర్టుకి వెళ్ళి విడాకులు అడగవచ్చు. కానీ పిల్లల్ని నీకిస్తారనే నమ్మకం లేదు. అతను నీకంటే పెద్ద ఉద్యోగస్తుడు. దురలవాట్లేమీ లేవు. నీవాళ్ళూ, అతనివైపు వాళ్ళూ అందరూ అతని కనుకూలంగానే ఉన్నారు. అందువల్ల పిల్లలు నీకు రాకపోవచ్చు. అలాగనే కేసులోకి దిగాలి. ఇప్పుడు వాళ్ళు బాగా చిన్నపిల్లలు కాబట్టి కొన్నేళ్ళు నీకిచ్చినా, తర్వాతైనా అతను తీసుకుపోయే అవకాశం ఉంటుంది. అన్నీ ఆలోచించుకుని కేసులోకి దిగాలి".

"కొన్నేళ్ళు నాదగ్గరున్నా చాలండీ– కోర్టుకి వెళదాం".

ఆమాట నాకెంత ఉత్సాహాన్నిచ్చిందో చెప్పలేను.

"నువ్వింత బాధపడుతున్నావు. నేకాదనను. నువ్వు తల్లివి. నీ బాధ నాకు తెలుస్తోంది. కానీ మరి తండ్రికి మాత్రం ప్రేమ ఉండదా? అతనికి మాత్రం పిల్లల్ని ఒదిలి ఉండటం కష్టం కాదా? ఇద్దరూ కలిసి వుంటే పిల్లలు సుఖంగా ఉంటారు గదా".

"తండ్రికి పిల్లలకి సంబంధం ఉండకూడదని నేనటం లేదండి. కానీ పిల్లల క్షేమం ప్రధానంగా చూడాలి గదా. అతనెప్పుడు కావాలంటే అప్పుడు పిల్లలను తీసికెళ్ళి వాళ్ళతో గడపొచ్చుగదా. వాళ్ళకు జ్ఞానం వచ్చేదాకా, వాళ్ళ పనులు వాళ్ళు చేసుకునే వయసొచ్చే దాకా, వాళ్ళ ఆకలి వాళ్ళు తెలుసుకునే తెలివొచ్చేదాకా నా ప్రేమ వాళ్ళకవసరం. పిల్లలు నా స్వంత ఆస్తి అని నేననుకోవటం లేదండీ-"

"పిల్లలు నీ స్వంత ఆస్తి కావటం కాదమ్మా. నువ్వే మగాడి ఆస్తివి. ఆ ఆస్తి సృష్టించే ఫలం మీద అతనే హక్కుదారు. అదీ ఉన్న పరిస్థితి. అది మంచిదనను. కానీ ఇప్పుడు మనం చేసే పని ఇప్పటి పరిస్థితులను బట్టే చెయ్యాలి గదా. అందుకని బాగా ఆలోచించుకో".

మేమిద్దరం నెమ్మదిగా ఇంటికి వచ్చేశాం. భారతి బాగా అధైర్యపడింది.

"పిల్లలు లేకుండా ఎట్లా ఉంటావు; ఏదో ఒక రకంగా రాజీపడితే పోతుందేమో" అన్నది.

రాజీ-అతనికి తలవొగ్గటం. అతను చెయ్యమన్న పనులన్నీ చెయ్యటం. ఒద్దన్న పనులన్నీ మానెయ్యటం.

నా ఆత్మనూ, శరీరాన్నీ అతని పరం చెయ్యాలి.

చిన్నప్పటి నుంచీ నన్నందుకే ఒక మూసలో పడేసి తయారుచేశారు.

అయినా నా ఆత్మ లొంగటం లేదు.

ఎన్నో విషయాల్లో చిన్నతనం నుంచీ లొంగిపోవటం నేర్చుకున్నా ఇవాళ అతనికి లొంగిపోలేకపోతున్నాను.

నా పిల్లలకోసమైనా నేను లొంగలేను.

నా ఆత్మా నా శరీరం ఎదురుతిరుగుతున్నాయి.

జీవితమంతా లొంగుబాటేనా?

నేనతనితో కలిసి ఉంటేనే వాళ్ళు నా పిల్లలు. నా పిల్లలు నాకు కావాలనుకుంటే నేనతనితో కలిసి ఉండాలి.

ఈ నిర్బంధం ఏమిటి? నా మాతృత్వం నా స్వతంత్రాన్ని హరించటం ఏమిటి?

నేను కన్న పిల్లలతో నా సంబంధం ఎంత వరకుండాలో, ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో చెప్పటానికి వీళ్ళెవరు?

తల్లీపిల్లల బంధాన్ని సామాజిక విధానాలు నాశనం చేస్తుంటే నేనేమీ చెయ్యలేనా?

దీనంతటికీ మూలం ఏమిటి?

ఏదైనాగానీ, ఆ మూలాన్ని నాశనం చెయ్యనిదే నా తల్లి ప్రాణం శాంతించదు.

నేను తల్లిని. బిడ్డను కనటం నా ఇచ్ఛతో కూడిన పని.

దానికోసం నేను నా రక్తం ధారపోశాను.

ఆ బిడ్డను రక్షించుకోవటం నా సహజ స్వభావం, నా హక్కు

ఈ హక్కు నాకు ఎవరో యివ్వాల్సిన పనిలేదు.

నాకీ మాతృత్వాన్ని ఏ ప్రకృతి ఇచ్చిందో, ఆ హక్కును కూడా ఆ ప్రకృతే ఇచ్చింది.

ఆ హక్కును కాలరాసిన శక్తి ఏదైనా, ఎంత రాక్షసబలంతో కూడినదైనా దానితో నేను తలపడతాను.

మళ్ళీ రక్తం ధారపోసైనా నా హక్కును నేను పొందుతాను.

నేను జయించి తీరుతాను. రాజీ ప్రశ్నే లేదు.

ఈ పోరాటం చెయ్యనిదే నాకున్న సృష్టి శక్తికి అర్థం లేదు. సార్థకత లేదు.

*నవంబర్ – డిసెంబర్, 1987*

*మానవి (ఉదయం)*

## ఓల్గా ఇతర రచనలు

### నవలలు

సహజ

స్వేచ్ఛ

మానవి

కన్నీటి కెరటాల వెన్నెల

ఆకాశంలో సగం

గులాబీలు

### కథాసంకలనాలు

రాజకీయ కథలు

ప్రయోగం

భిన్న సందర్భాలు

ప్రయోగం

(రాజకీయ కథలు-2)

### సంపాదకత్వం

మాకు గోడలు లేవు

నీలిమేఘాలు

నూరేళ్ళ చలం

సారాంశం

సరిహద్దులులేని సంధ్యలు

మహిళావరణం

జీవితమే ఒక ప్రయోగం

అలజడి మా జీవితం

నవలా మాలతీయం

### అనువాదాలు

సామాన్యుల సాహసం

భూమి పుత్రిక

మిస్సింగ్

మూడు తరాలు

పుట్టని బిడ్డకు తల్లి ఉత్తరం

ఉరికొయ్య అంచున

నేనూ సావిత్రీబాయిని

### ఇతరములు

అతడు-ఆమె-మనం (సాహిత్య విమర్శ)

కుటుంబ వ్యవస్థ-మార్క్సిజం (వ్యాసం)

వాళ్ళు ఆరుగురు (నాటిక)

యుద్ధము-శాంతి (నృత్య రూపకం)

పలికించకు మౌనమృదంగాలను (సాహిత్య వ్యాసాలు)

తొలివెలుగులు (స్త్రీవాద వ్యాసాలు)

కుటుంబ వ్యవస్థ - మార్క్సిజం - ఫెమినిజం (స్త్రీవాద వ్యాసాలు)

"ఈ సంకలనంలో కథలు స్త్రీల శరీరాల చుట్టూ, స్త్రీలకు తోటి స్త్రీలతో, సమాజంతో, తమ పురుషులతో వుండే సంబంధాల చుట్టూ అల్లబడిన భావజాలానికి సంబంధించిన కథలు. మొదటి కథలన్నీ స్త్రీల శరీరం చుట్టూ పురుషాధిపత్య సమాజం ఎన్ని 'మిత్'లను బలంగా అల్లిందో చెప్పటానికి ప్రయత్నించిన కథలు. చివరి కథలు స్త్రీలకు తమ తోటివారితో, సమాజంతో, కుటుంబంతో వున్న సంబంధాలలో వున్న 'మిత్'ల గురించి రాసినవి."



"స్త్రీకి గుర్తింపు వచ్చినదానికంటే వందరెట్లు తెలివి ఆమెకుంటుంది. ఆ తెలివిని అణచటం సాధ్యం కాక, మొదటికే మోసం అని తెలిసి కొంచెం ఆమెకు అవకాశం యిస్తారు. దానికే పొంగిపోయి ఆ చోటులోనే స్థిరపడతారు ఆడవాళ్లు. ఆడదాని శక్తిలో, తెలివిలో సగంపైగా సమాజంతో, ఇంట్లోవాళ్లతో యుద్ధం చెయ్యడానికే సరిపోతుంది."